
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్



# యుగశక్తి  గాయత్రి



ప్రఖర ప్రజ్ఞ

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

సజల శ్రద్ధ


**సంకల్పం - సంరక్షణ**

వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత

**శ్రీరామ శర్మ ఆచార్య**

శక్తి స్వరూపిణి

**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు

**డాక్టర్ ప్రణవ్ పండ్యా**

సంపాదక వర్గం

**డా॥ యం.రామకృష్ణ**

**డా॥ తుమ్మూరి**

**కందర్ప రామచంద్ర రావు**

**కె.బి.సోమయాజులు**

**జి.సత్యవాణి**

**అశ్విని సుబ్బారావు**

**సంపుటి 4 సంచిక 8**

**నవంబర్ 2003**

**విడిప్రతి రూ॥ 8.00**

**సం॥ చందా రూ॥ 85**

**3సం॥ చందా రూ॥ 250**

**10 సం॥ చందా రూ॥ 750**


## అంతరాత్మ ప్రబోధం అందుకో

మనిషి ఒంటరిగా ఉన్నప్పుడు, అతడి చుట్టు ప్రక్కల ఎవ్వరూ లేనప్పుడు పాపం చేయడానికి అతడికి భయం వేస్తుంది, ఏదో జంకు కలుగుతుంది. ఎందువల్ల? తన పాపాన్ని ఎవరో చూస్తూన్నట్లు అతడికి పదే పదే ఎందుకు అనిపిస్తుంది? ఆ పాపకార్యం చేయడానికి అతడి శరీరం ఎందుకు ఉత్సాహం చూపదు? ఆతర్వాత కూడా అతడొక నేరస్థునిలా ఎందుకు కలుషితం అవుతాడు? తన పాపాన్ని చూచేవారు ఎవరూ లేకపోయినా, అతడు ఎవరికి భయపడుతున్నాడు? అతడా పని చేయకుండా ఎవరు అడ్డు పడుతున్నారు? తన మనస్సులో, ప్రాణంలో, శరీరంలో ఎవరు వణుకు పుట్టిస్తున్నారు?

ఇదంతా చేసేది అతడి అంతఃకరణ అన్నమాట నిస్సందేహం. పాపం నుండి అతడిని తప్పించే ప్రయత్నంలో అది రకరకాల శంకలు, అనుమానాలు, వణుకుల వంటి భయాన్ని వ్యక్తపరచే అనుభవాలతో ఆ పని చేయవద్దని సూచన చేస్తూ ఉంటుంది. అంతఃకరణ చేసే ఈ సూచనలను ఉపేక్షించని వ్యక్తి పాపకార్యం చేయకుండా బయటపడతాడు. వాటిని ఖాతరు చేయకుండా పాపం చేసే వ్యక్తికి విరుద్ధంగా అతడి అంతఃకరణ ఏదో ఒక రోజున సాక్ష్యం ఇస్తుంది. అతడికి శిక్ష పడేటట్లు చేస్తుంది. ఒక వ్యక్తి చేసే పాప కార్యం ప్రపంచం కన్ను కప్పవచ్చు, కాని అంతఃకరణ కన్ను ఎన్నడూ కప్పజాలదు. అతడి ప్రతి పనికీ, ప్రతి ఆలోచనకూ అది అన్నిటి కన్న బలీయమైన సాక్షిగా, నిజమైన సాక్షిగా నిలచి ఉంటుంది. అంతఃకరణలో వెలుగుతున్న పరమాత్మ యొక్క వాణిని వినడం, దానిని అనుసరించడం మనకు సముచితమైన పని.

★ ★ ★

**పారమార్థిక ప్రవృత్తి లోపిస్తే వ్యక్తీ, సమాజమూ నష్టపోతాయి.**

# విషయ సూచిక

**ముఖ చిత్రం : గురునానక్,**

గురునానక్ జయంతి సందర్భంగా.


1. **సంపాదకీయం :**
అంతరాత్మ ప్రబోధం అందుకో 1
2. **విషయ సూచిక** 2
3. **వేదమంత్రం** 3
4. **మాతాజీ దివ్య జీవనం :**
దివ్యజ్యోతి అవతరణ 4
5. **సమాజ నిర్మాణం - స్వావలంబన :**
దేశాభివృద్ధికి కీలకం గ్రామాభివృద్ధి 7
6. **భావవిప్లవ యోధుడు :**
వేదవిజ్ఞాన ప్రసారానికి అంకితమైన సాత్వలేకర్ 9
7. **మనం - మన ఆరోగ్యం :**
ఉపవాసం ఎందుకు, ఎలా? 11
8. **బోధ కథ :**
ముఖ్యమంత్రికి కనువిప్పు 15
9. **శతసూత్ర కార్యక్రమం - 1**
ఆరోగ్య రక్షణకై ఆహార విహారాలలో కట్టుబాట్లు 17
10. **వ్యక్తి నిర్మాణం :**
నిన్ను నువ్వే ఉద్ధరించుకో 19
11. **సూర్య విజ్ఞానం :**
సమస్త బ్రహ్మాండం ఒక చైతన్య శరీరం 21
12. **ముఖచిత్ర కథనం :**
గురునానక్ ఉదారత 23
13. **భాగవత బోధ :**
కర్మఫల వ్యవస్థ తిరుగులేనిది - 2 24
14. **బోధ కథ :**
అహంకారం ఒక మురికికూపం 26
15. **యుగ గీత :** ముక్త పురుషునికి ఉజ్వల ఉదాహరణ పరమపూజ్య గురుదేవులు 28
16. **కృష్ణావతారం - 12 :**
సాందీపని ఆశ్రమంలో విద్యాభ్యాసం 30
17. **గురుదేవుల అమృతవాణి**
దేవతలు ఇచ్చేవి దైవీగుణాలు మాత్రమే 33
18. **మనం - మన ఆరోగ్యం :**
నవ్వు, నవ్వించు - రోగాన్ని జయించు 36
19. **బోధ కథ**
నిరంతర పోరాటానికి మారుపేరు ఆయన 38
20. **కుటుంబ నిర్మాణం :**
దాంపత్య జీవితం సుఖమయం కావాలంటే .. 40
21. **నావారితో నామాట**
1.దేవసంస్కృతి విశ్వవిద్యాలయంలో జీవన కళలో శిక్షణ 42
2.శీతాకాలంలో శాంతికుంజ్‌లో నడిచే శిబిరాలు 44
22. **శాంతికుంజ్ సమాచారం** 45
సాధన, సంవేదనల సంగమం మాతాజీ దివ్య జీవనం
- డా॥ ప్రణవ్ పండ్యాజీ
23. **వార్తలు** 46


## నవంబర్ నెలలో పర్వదినాలు

1 ఆంధ్ర రాష్ట్ర అవతరణ.
5 గురునానక్ జయంతి.
14 ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి.
29 సుబ్రహ్మణ్య షష్ఠి.
30 జగదీష్‌చంద్ర బోస్ జయంతి.
గురు తేగ్ బహదూర్ బలిదానం.

## డిసెంబర్ నెలలో పర్వదినాలు

4 గీతా జయంతి.
8 దత్తాత్రేయ జయంతి.
17 ధనుర్మాస ఆరంభం.
22 శారదామాత జయంతి.
23 స్వామి శ్రద్ధానంద జయంతి.
25 మదనమోహన్ మాలవ్యా జయంతి.

**ధైర్యం, నిష్ఠ లోపిస్తే మనం సాఫల్యపు గుమ్మం నుండి వెనుదిరగ వలసి వస్తుంది.**

# వేద మంత్రం

యాదృగేవ దదృశే తాదృగుచ్యతే సం ఛాయయా దధిరే సిధ్రయాప్స్వా ।
మహీమస్మభ్యమురుషామురు జ్రయో బృహత్సువీరమనపచ్యుతం సహః ॥

(ఋగ్వేద 5/44/6)

**భావార్థం :** ఏది ఆత్మలో ఉన్నదో దానినే మనస్సులో, మనస్సులో ఏది ఉన్నదో దానినే వాణిలో ఎవరు వ్యక్తము చేస్తారో వారే నిజమైన ఉపదేశకులు. స్వయంగా ఆచరించి దానిని ఉపదేశించాలి. అప్పుడే జనులందరిలో విద్య, బలము, ధనము అభివృద్ధి చెందుతాయి. ఇదే సదుపదేశము.

**సందేశం :** భారతదేశం ఋషుల దేశం, గురువుల దేశం. ఇక్కడి నుండే ప్రపంచమంతటా ప్రకాశం లభిస్తూ వచ్చింది. ఉన్నతమైన ఆలోచనా పద్ధతిని ఇక్కడి నుండే ఋషు లందించారు. ఆలోచనా పద్ధతి ఉన్నతమగుట వలన అందరి జీవితం ఉత్కృష్టంగా ఉండేది. నేడు ఆలోచనా పద్ధతి నిమ్నస్థాయి దగుట వలన, నీచమైన ఆలోచనలు చేసేవారు, స్వార్థపరులు దేశాన్ని నడిపేవారయినారు. సమాజంలో అటువంటి నీచమైన ఆలోచనలే వ్యాపింప చేస్తున్నారు.

ధార్మిక కాంట్రాక్టర్లు, ఉపదేశకులు అమాయకులైన ప్రజలను మోసగించే ఉపదేశాలిస్తూ పబ్బం గడుపుకోవటమే బ్రాహ్మణత్వము, ఆధ్యాత్మికత అని భావించారు. అటువంటి ఉపదేశకుల ఆలోచనలు నిమ్న స్థాయివే, ఆచరణ నిమ్నస్థాయిదే. వారిది ఒకటే మూలమంత్రము - 'నోటితో రామనామం, బొడ్డులో కత్తి'. నేడు మన సమాజం ఈ మూఢ ఆలోచనలు, భ్రష్ట ఆచరణ కారణంగా శిథిలావస్థకు చేరుకున్నది. వారి ఆలోచనలలో ఉత్కృష్టత లేని కారణంగా, వారి వాణిలో ప్రభావమేమీ లేదు. ఒకవేళ వారేదైనా మంచి చెప్పినా ప్రజల మనస్సులలో నిలబడుట లేదు. గాంధీజీ మాట్లాడుతూ ఉంటే లక్షలాది మంది హృదయాలలో ప్రభావం పడేది. ఉపదేశం యివ్వటం ఒక పదునైన ఆయుధం. కానీ షరతు ఏమిటంటే - మొదట ఆచరించి తర్వాత చెప్పు.

శ్రావణ పూర్ణిమ రోజున మనం సప్తఋషుల పూజ చేస్తూ ఉంటాము. వారు మనకు 'మనోవాక్కాయ కర్మలా' పూర్తి నిజాయితీతో, సత్కర్మల వైపు ప్రేరణ యిచ్చే ఉపదేశమిచ్చారు. వారు మనకు ఆదర్శ పురుషులు. కానీ నేడు బ్రాహ్మణత్వం మునిగిపోతూ ఉన్నది. ఈ పరిస్థితులలో మనందరి మీద 'ఋషి పరంపర పునరుజ్జీవనం' బాధ్యత, మనం 'చెప్పేది చేసేది' ఒకటిగా ఉండేటట్లు చేయవలసిన అవసరం ఉన్నది. మనుష్యుడు 'నిరాడంబర జీవనం, ఉన్నత ఆలోచనలు' అనే ఆదర్శం స్వీకరిస్తేనే, హృదయంలో ఎల్లప్పుడూ శుద్ధ, పవిత్ర భావనలు నింపుకుంటేనే యిది సాధ్యం. జీవితంలో నిరాడంబరత అలవాటైతే మనస్సు భౌతిక సమృద్ధికి అర్రులు చాచదు. ఇతరులను చూచి ఈర్ష్యపడదు. లోభ, మోహ, క్రోధములనే దుష్ప్రవృత్తులు స్వయంగా పారిపోతాయి. వీటి స్థానంలో సద్గుణాల పెంపు కలుగుతుంది.

మన ఋషులు ఈ జీవనశైలిని స్వీకరించారు. ఎల్లప్పుడూ ప్రభు చింతనలో నిమగ్నమై లోకహిత కార్యాలకు తమను సమర్పించుకున్నారు. వ్యక్తి వ్యక్తిలో సాత్వికతా వికాసం కొరకు, వారు తేజస్సులు, ఓజస్సులు, వర్చస్సులు, విద్యావంతులు, బలవంతులు, ధనవంతులు అగుటకు తగిన మార్గదర్శనం చేస్తుండేవారు.

దీనిలోనే బ్రాహ్మణత్వపు సార్థకత ఉండేది.

☆ ☆ ☆

**నిజమైన ఆనందానికి ఆధారం అంతఃకరణలోని పవిత్రత.**

మాతాజీ దివ్య జీవనం - 1

# దివ్యజ్యోతి అవతరణ

[భాద్రపద పూర్ణిమ పరమ వందనీయ మాతా భగవతీదేవి శర్మ (మాతాజీ) శ్రద్ధాంజలి పర్వదినం. ఆ సందర్భంగా 2002 సెప్టెంబరు నెల అఖండజ్యోతి పత్రికను మాతృసత్తా ప్రత్యేక సంచికగా ప్రచురించారు. డాక్టర్ మారెళ్ల శ్రీరామకృష్ణ దానిని తెలుగులోకి అనువదించారు. శ్రీమతి విజయా విశ్వనాథ్ దానిని "సర్వసహా పరమవందనీయ మాతా భగవతీదేవి శర్మ దివ్య చరిత్ర" అనే గ్రంథంగా ప్రచురించారు. ఆ గ్రంథాన్ని ధారావాహికంగా పాఠకులకు అందిస్తున్నాము.]

## అన్ని సంవేదనలకూ మూలం మాతృతత్వం

మాతృతత్వం జీవితానికి, ప్రపంచానికి, సమస్త సంవేదనలకు మూలతత్త్వం. సృష్టిలోని అన్ని సంవేదనలూ మాతృత్వ సారంనుండి అంకురిత మవుతాయి. సృష్టిలోని అన్ని భావి సంఘటనలూ ఇక్కడ నుంచే ప్రకటీకృత మౌతాయి. జగత్తు విస్తరించడానికి కారణం ఈ పూర్ణత్వంలోని ఒక్క అంశమాత్రమే. ఈ సత్యమునే వైదిక ఋషులు 'ఏకాంశేన స్థితి జగత్' అని తెలిపారు. ఇదే సృష్టి యొక్క అర్థం. దీని నుంచే జీవితంలోని వివిధ రూపాలు జన్మిస్తాయి. దార్శనికులు దీనినే జీవితంలోని జగత్తులోని అన్ని అనివార్య తత్వములను ధారణ, పోషణ చేసే "మూల ప్రకృతి" అన్నారు. ఇదే ఋగ్వేదంలో వర్ణించబడిన ఆదిమాత. "అదితి" స్వయముగా 'అనాది, అనంతం, అవిభాజ్యం' అయినప్పటికి అన్ని లోకాలకు జన్మను, జీవితమును ఇస్తున్నది. చివరికి అన్నీ ఇందులోనే విలీనమైపోతాయి. విశ్వబ్రహ్మాండమును నడిపే ఆదిశక్తి ఈ మాతృతత్త్వమును ప్రపంచానికి పరిచయం చేస్తుంది.

అన్ని యోగసాధనల పరాకాష్టే ఈ మాతృతత్త్వ అవగాహన. వివిధ యోగతత్త్వములు, విధివిధానములు, అనుశాసనములు ఈ పరమపూర్ణతను తెలుసుకొనుటకు, పొందుటకు ఏర్పడినవే. చిత్తవృత్తి నిరోధంతో మాతృతత్వంలోని చిత్‌శక్తి ప్రకాశితమై ఆవిర్భవిస్తుంది. దీనిలోనే సాధకులకు తమ స్వరూపము అవగాహన అగుటయే గాక అనేకానేక యోగ విభూతులు లభిస్తాయి. సాధకుల సాధన, సిద్ధుల ఆధారభూమి ఇదే. ఇదే యోగుల కుండలినీ శక్తి. దీని జాగరణతో యోగసాధకులలో మహాశక్తి ప్రకటీకరణకు అనేక మార్గాలు తెరవబడతాయి. మాతృతత్త్వ అనుగ్రహంతోనే యోగసాధకుడు సమర్థుడు అవుతాడు. అనేకానేక సిద్ధులు, విభూతులు, అతనిని అనుసరిస్తాయి. అతనిలో కైవల్యప్రభ ప్రకాశిస్తుంది.

మాతృతత్త్వ సంపూర్ణత యోగగమ్యము, జ్ఞానగమ్యము, ధ్యాన గమ్యము అయినప్పటికి దాని సామాన్య పరిచయం జీవికి పుట్టుకతోనే వస్తుంది. ప్రతి ప్రాణి మాతృతత్త్వంలోని ఆర్ద్ర భావానుభూతులలోనే జీవనం పొందుతాడు. అతని తల్లే అతనికి అన్నీ. అతని హృదయం నుండి వెలువడే మొదటి పిలుపే 'అమ్మ'. పెదవుల నుంచి వెలువడే మొదటి శబ్దమే 'అమ్మ'. అన్ని సంబంధాలు, అన్ని బంధుత్వాలు, అన్నీ సంవేదనలు మాతృతత్త్వం చుట్టూరా తమ అస్తిత్వాన్ని అల్లుకుంటాయి. అన్నింటికి కేంద్రం అమ్మయే. ఎవరు తల్లికి దగ్గరవారో, వారే సాన్నిహిత్యాన్ని అనుభూతి చెందుతారు. తల్లి సంవేదన విస్తరణలో జీవన సంవేదనలు విస్తరణ పొందుతాయి. జనన కాలంలో ఈ ఒక్క జీవన సత్యమే తీవ్రాతితీవ్రంగా పూర్తి అస్తిత్వంలో స్పందితం అవుతుంది. ప్రతి శిశువు జీవితం మాతృమయం. మాతృతత్త్వమే శిశువుకు సుఖం, రక్ష, ఆనందం, ప్రేమ.

ఈ భావానుభూతులు స్థిరంగా ఉండవు. జీవన చేతనత్వం బహిర్ముఖం అవుతున్నకొద్దీ, నెమ్మది నెమ్మదిగా ఇవి విలీనమైపోతాయి. అహం (నేను) సుదృఢం అవగానే తల్లి గర్భంలో తన జీవితాన్ని గట్టిగా కట్టివేసి ఉన్న సంబంధ, సంవేదనలు బలహీనమైపోతాయి. నేను అనబడే అహంకారము జన్మ నిచ్చిన తల్లి నుంచి దూరం పెంచుతుంది. జీవాత్మ యొక్క అంశ తాను పరమపూర్ణం అని గర్వం పెంచుకుంటుంది. విస్మృతి యొక్క ఆచేతనత్వం వల్ల జీవన చేతనత్వం పూర్తిగా కప్పబడిపోతుంది. "విద్యాః సమస్తాస్తవ దేవి భేదాః స్త్రియాః సమస్తాః సకలాం జగత్సు". 'ఓ మాతా! ప్రపంచంలోని సమస్త విద్యలు, ప్రపంచంలోని సమస్త స్త్రీలు నీ స్వరూపములే' - అనే సూత్రం మర్చిపోతారు. మాతృతత్త్వానికి దూరమైన జీవనం తెలియని చీకట్లలో దారితప్పి వెతుకులాడుతూ ఉంటుంది.

ఈ చీకటి నుంచి బయటపడడానికి ఒకే ఒక ఉపాయం ఉంది. అది మాతృతత్వం పట్ల అవిరళమైన అనురాగం. ఇదే మహా యోగసాధనకు ప్రారంభదశ. జీవితాన్ని పూర్ణత్వమువైపు ఇదే తీసుకువెడుతుంది. శిఖరాగ్రానికి చేర్చుతుంది. వైదిక ఋషుల నుంచి మహాయోగి శ్రీఅరవిందుల వరకూ ఈ మార్గాన్నే అనుసరించారు. ఈ మార్గాన్ని అనుసరించే వారు పూర్ణత్వంతో లాభాన్వితులయ్యారు.

ఋగ్వేదములోని అనేక మంత్రాలతో పాటు శ్రీఅరవిందుల మంత్రకావ్యమైన 'సావిత్రి'లోని అనేకానేక పంక్తులు ఈ సమాధి సత్యానికి సాక్షులు. మహాయోగి శ్రీఅరవిందులు తమ మంత్రకావ్యమైన 'సావిత్రి' మూడవ పర్వమును "భగవతీ శ్రీ మాతా పర్వము" అని పేర్కొన్నారు. దీనిలో మాతృత్వం యొక్క అత్యంత గూఢమైన, అనుభూతిపరమైన వివరణ ఉన్నది.

**దృఢ సంకల్పం జీవితంలో ఉత్కృష్టతకు తారక మంత్రం.**

పరమపూజ్య గురుదేవుల అనుభూతి కూడా ఉంది. ఆయన ఒకచోట కాదు, అనేకచోట్ల ఇలా అన్నారు - "మాతృతత్వ సాధన మాత్రమే జీవితాన్ని సంస్కారవంతం, పరిష్కృతం చేస్తుంది. దీనివల్లే జీవితం సమర్థవంతం, శక్తివంతం అవుతుంది." దీని గురించి చెప్తూ అప్పుడప్పుడు ఆయన కొన్ని ముఖ్యమైన విషయాలను తెలిపారు. ఆయన ఇలా అన్నారు - "కాల ప్రవాహంలో సామాన్య క్షణాలు, అసామాన్య క్షణాలు ఉంటాయి. సామాన్య క్షణాలలో మానవుడు మాతృతత్వాన్ని కోరుకుంటాడు. తల్లి పరమపూర్ణతను అవగాహన చేసుకునేందుకు యోగసాధనలో నిమగ్నం అవుతాడు. ధ్యానం, జ్ఞానసాధనలు చేస్తూ ఆదిమాతను తన జీవితానికి పూర్ణత్వాన్ని వరంగా ఇమ్మని ప్రార్థన చేస్తాడు.

అసామాన్య క్షణాలలో తన గర్భము నుంచి జీవితాన్ని, జగత్తును ప్రసవించే మాతృమూర్తే స్వయంగా యత్నశీలం అవుతుంది. సృష్టిని సుసంస్కారితం చేయడానికి ఆమే స్వయంగా యుగశక్తి రూపంలో అవతరిస్తుంది. దారి తప్పిన తన సంతానానికి దారి చూపడానికి వస్తుంది. ఆమె దైవీ చేతనత్వం మానవ చేతనత్వం ద్వారా వ్యక్తం అవుతుంది. మహాదేవి స్వయంగా మానవ శరీరధారియై తన బిడ్డలను ప్రేమతో లాలిస్తుంది. ఆదిశక్తి యుగశక్తి రూపం ధరించి సన్మార్గాన్ని చూపిస్తుంది. జగన్మాతకు మరొకరి ఆదేశాలతో పని లేదు. తానే స్వయంగా జీవించి జీవిత తత్వాన్ని, సత్యాన్ని బోధిస్తుంది. చేయి పట్టుకొని తన పిల్లలకు జీవితాన్ని, జీవించే కళను నేర్పుతుంది.

సృష్టి యొక్క చరిత్రలో ఈ క్షణాలు చాలా మహిమాన్వితమైనవి. ఎందరెందరో ఆర్తుల పిలుపునకు సమాధానంగా కరుణామయి మాత అవతరించాలని సంకల్పిస్తుంది. ఆదిజనని తన లీలా భూమిగా ఎన్నుకున్న ఆ దేశం, ఆ ప్రాంతం ఎంతో ధన్యమైనవి. ఏదో రూపంలో ఆమె స్వజనులుగా, పరిజనులుగా దగ్గరయిన వ్యక్తులు కూడా చాలా పుణ్యశీలురు. భక్తితో పెల్లుబుకుతున్న హృదయాలతో తమ శ్రద్ధా పుష్పాలను తల్లి చరణాల మీద పోసి మాతృతత్వాన్ని అర్చన, వందన చేసే వ్యక్తులు వీరందరికంటే ధన్యులు. వీరేకాక ఆ దివ్య జనని లీలా గాథలను స్మరణ, చింతన చేస్తూ, అవగాహన చేసుకుంటూ, ఆమె జ్యోతిర్మయ చేతనత్వంతో ఏకాత్మ సాధన చేసేవారు కూడా చాలా అదృష్టవంతులే.

సాధన యొక్క ఈ భావపూర్ణ స్వరములకు స్పందించడానికే కదా భావమయి మాతా భగవతి అవతరించేది. అందుకే మాతృతత్వ విశుద్ధ చేతన ఘనీభూతమై స్థూలరూపంలో ఆవిర్భవిస్తుంది. మానవుని జన్మజన్మాంతరాల ఆధ్యాత్మిక కోరికలకు జవాబు ఇవ్వడానికే మాతృతత్వ దివ్యజ్యోతి జన్మిస్తుంది. దాని కాంతితో లోకముల బాహ్య ఆవరణయే కాక ప్రాణుల అంతఃకరణం కూడా ప్రకాశింపబడుతుంది. యుగశక్తి అవతరణ వల్ల వాతావరణంలో అలౌకిక సుగంధం వ్యాపిస్తుంది. జాగృత ఆత్మలు తమ అంతః కరణాలలో అత్యంత అద్భుత స్పందనలను అనుభవిస్తాయి. ఆదిశక్తి దివ్యజ్యోతి జన్మమహోత్సవము చేసుకోవడానికి ఋషులు, దేవతలు, సిద్ధగణాలు సక్రియు లౌతారు. సృష్టిలోని సమస్త దివ్యశక్తులలో ఒక విలక్షణ చేతనత్వం వ్యాప్తి చెందుతుంది. ఆదిశక్తి మాతాజీ అవతరణ కాలంలో ఈ విధమైన పరిస్థితులు ఏర్పడ్డాయి.

## దివ్యజ్యోతి అవతరణ వేళ

దివ్యజ్యోతి జన్మించే ఘడియలు దగ్గరపడ్డాయి. మాతృతత్వం మానవీయ రూపం ఆకారం ధరిస్తోంది. ఆదిశక్తి యుగశక్తిగా అవతరించే సంకల్పం సూక్ష్మ జగత్తులో తీవ్రరూపము ధరిస్తోంది. ఆగ్రాలోని 'సావరియా బహారే సముదాయం'లో పండిత జస్వంత్ రావు పరివారంలో దీని స్పందనలు తీవ్రవేగంతో ఘనీభవిస్తున్నాయి. ఇంటి వాతావరణంలో దివ్యత్వ తరంగాలు ప్రతి క్షణం ఎగసిపడుతున్నాయి. అలౌకికమైన సువాసన ఇంటి ఒక మూలనుంచి వరండా నుంచి ఉండి ఉండి వస్తోంది. కుటుంబంలోని అందరి మనస్సులు, అంతఃకరణలు ఉల్లాసంతో నిండి ఉన్నాయి. ఒక గుర్తించని ఆనందం అందరిలోనూ వ్యాపించి ఉన్నది.

గత కొలది నెలల నుంచి జరుగుచున్న ఈ మార్పులను అందరికంటే ముందు జస్వంతరావు గుర్తించారు. జస్వంతరావు అత్యంత సరళ స్వభావం గల, ఆధ్యాత్మిక ప్రకృతి కల వ్యక్తి. ఆయన సహధర్మచారిణి రామప్యారీ శర్మ భర్తకి అనుకూలంగా జీవించే భక్తురాలు. ఆమె కోమలత్వాన్ని, సేవాగుణాన్ని కుటుంబ సభ్యులు, బంధువర్గములోని వారు అందరూ పొగిడేవారు. చుట్టుపక్కల ఉన్న పెద్దవాళ్లు మాటిమాటికీ ఆమెను ఉదాహరణగా చూపేవారు. వారిలో వారు చర్చించుకుంటున్నప్పుడు "జస్వంతరావు భార్యను చూడండి. ఇంటిని, కుటుంబాన్ని, పిల్లల్ని ఎంత బాగా చూసుకుంటుందో! జపం, తపం, పూజ ఎంత బాగా చేసుకుంటోందో!" అనేవారు. ఈ ప్రశంసా వాక్యాలతో యథార్థత, సార్థకత ఉన్నాయి.

ఈ బ్రాహ్మణ దంపతుల పుణ్య చరిత్ర, తపఃపరాయణత చూస్తే వీరు ప్రాచీన కాలంలోని సుతపా, పృశ్నిలా అనిపించేది. మాతా భగవతి ఉపాసన వీరిరువురికి చాలా ఇష్టం. జస్వంతరావు నిత్యం నియమంగా దేవీ సప్తశతి సంపూర్ణ పారాయణ చేసేవారు. ఆయన ఇల్లు వాకిలి ప్రతీరోజు జగన్మాత మహిమా స్తోత్రాలతో ప్రతిధ్వనించేవి. సప్తశతి సంపూర్ణ పారాయణతో పాటు గాయత్రీ మంత్రం మీద నవార్ణ మంత్రము మీద కూడా ఆయనకి పూర్తి నమ్మకము ఉండేది. "ఓం ఐం హ్రీం క్లీం చాముండాయ విచ్చై" మంత్ర జపం చేస్తూ పూర్తిగా దానిలో లీనం అయిపోయేవారు. దేవీ సప్తశతి పారాయణ కాలంలో ప్రతిరోజూ ఆయన కంటి నుంచి భావబిందువులు వర్షించేవి. అప్పుడప్పుడు రామప్యారీ తన భర్తని ఈ భావాశ్రువుల గురించి అడిగేది. ఈ ప్రశ్నకు జవాబు ఇస్తూ ఆయన గద్గద స్వరంతో ఇలా

**నీ దోషాల పట్ల మెలకువ వహించు. వెన్నుపోటు పొడిచే శత్రువులు అవి.**

అనేవారు - "నేను పారాయణ చేస్తున్నప్పుడు ఆ తల్లి చిన్న బాలిక రూపంలో కూర్చున్నట్టు అనిపించేది. మంత్రజపం చేసేటప్పుడు కూడా అనిపించేది. అప్పుడప్పుడూ చిన్న బాలిక రూపంలో ఆ జగజ్జనని నా ఒళ్ళో కూర్చున్నట్టు అనిపించేది''.

ఈ మాటలు విని రామప్యారీ భావనిమగ్న అయ్యేది. ఆమె ఈ విధముగా మౌనంగా ఉండడం చూసి జస్వంతరావు 'నీవు ఎందుకు మౌనం వహించావు?' అని అడిగేవారు. ఒకటికి రెండు సార్లు అడిగినప్పుడు ఆమె నెమ్మదిగా ఇలా చెప్పేవారు - 'నాకు ఈ మధ్య అతివిచిత్రమైన కలలు వస్తున్నాయి. ఒకటి రెండు రోజుల క్రిందట నేను ఒక స్వప్నం చూసాను. నేను హిమాలయాలలో ఉన్నాను. శ్వేత, శుభ్ర, హిమశిఖరాలు చాలా భవ్యంగా ఉన్నాయి. అప్పుడే ఆ హిమశిఖరాలలో ఒక దేవి ఆవిర్భవించింది. నిజంగా ఆమె దేవిలాగే ఉంది. నెమ్మదిగా ఆమె ఒక చిన్న బాలిక రూపం ధరించి నా చేయి పట్టుకుని "అమ్మా! నేను నీ ఇంటికి రాబోతున్నాను'' అన్నది. ఇవాళ కూడా నేను ఒక కల కన్నాను. చిన్ని చిన్ని ఎనిమిది మంది ఆడపిల్లలు ఒక అత్యంత అందమైన పిల్లను తీసుకుని నా వద్దకు వచ్చారు. "మేము నీకు ఈమెను ఇవ్వడానికి వచ్చాము. ఈ రోజు నుంచి నీవు ఈమె తల్లివి. అంతేకాక మా తల్లివి కూడా. ఎందువల్లనంటే మేము ఈమె అంశలము.'' అని నాతో చెప్పారు.

ఈ మాటలు విని జస్వంతరావు కొన్ని క్షణాలు అంతర్లీనమయ్యారు. తన భార్య గర్భవతి అని ఆయనకు తెలుసు. అందువల్ల స్వప్నాలు ఆమె గర్భము దివ్యత్వాన్ని తెలుపుతున్నాయి అనిపించింది. అంతేకాక చాలా రోజులనుంచి ఆయన ఇంటి వాతావరణంలో వస్తున్న ఆధ్యాత్మిక మార్పుల చిహ్నాలను గమనించారు. తన జీవితంలో ఏదో ఒక దివ్య సంఘటన జరగబోతోంది అని ఆయనకు అనిపించింది. ఆయన ఈ విధంగా ఆలోచనా సముద్రంలో మునగడం చూసి రామప్యారీ "మీరు ఎందుకు మౌనంగా ఉన్నారు? ఏమీ చెప్పరెందుకు? ఏమీ మాట్లాడరెందుకు?, - అని అడిగింది. ఈ ప్రశ్నతో ఆయన ఆలోచనా ధార చెదిరింది. తన ఆలోచనలనుంచి బయటకి వస్తూ రామప్యారీతో ఇలా అన్నారు - "ఈసారి మాతా భగవతీ జగదంబిక స్వయంగా నా మీద, నీ మీద, మన సంపూర్ణ పరివారం మీద అనుగ్రహించడానికి అవతరిస్తోందని అనిపిస్తోంది.''

ఈ మాటలు విని రామప్యారీ భావవిహ్వల అయింది. ఆమె కంటిలో నీరు నిండింది. మనస్సులోనే ఆమె ఆదిమాత జగదంబకు ప్రణమిల్లింది. లేచి నిలుచుంది. ఆమె ఇంకా పూర్తి చేయవలసిన ఇంటి పనులు చాలా ఉన్నాయి. కానీ ఈరోజు ఆమె ఇంటి పనులు చేస్తూ తనలో ఒక అద్భుత ఆనందధార మందగతిలో ప్రవహిస్తోంది అని అనుభూతి చెందింది. ఆమె కణ కణం, ఆమె అస్తిత్వం లోని ప్రతి అణువు దీనితో తడిసింది. పనిచేస్తూ మధ్యలో తన ఇరువురు పుత్రులు దీన్‌దయాల్, సున్‌హరీలాల్‌లను, కూతురు ఓంవతిని చాలా ప్రేమగా చూసుకుంది. తన లోపల నుంచి పెల్లుబుకుతున్న ఆనందసరితా ప్రవాహాన్ని తన పిల్లలకి కూడా పంచాలి అని అనుకున్నదేమో. రాత్రి నిద్రించే వేళలో మరల దివ్యభావానుభూతులు ఆమెను చుట్టుముట్టాయి. దివ్యలోకాల నుంచి సమస్త దేవగణాలు, దేవతలు, సూక్ష్మ శరీరధారులు, ఋషులు, సిద్ధ జనులు ఆమె గర్భం మీద పుష్పవృష్టి కురిపిస్తున్న భావన కలిగింది. ఇప్పుడు ఇది ఒక రోజు విషయంగా కాక నిత్యకృత్యంగా మారింది. నెలలు నిండుతున్న కొలది ఈ భావానుభూతులు ఇంకా ఎక్కువ అవడం మొదలుపెట్టాయి. ఆమె ప్రాణాలలో పులకింత ఎక్కువ అవుతోంది. ఆమె నిర్మల అంతర్ చేతన ఇంకా ఎక్కువ ఉజ్వల దీప్తితో ప్రకాశిస్తున్నది.

కాలచక్రం తిరుగుతోంది. దేవతలు, ఋషులు నిశ్చయం చేసిన విధముగా - జస్వంతరావు, రామప్యారీ, సంపూర్ణ విశ్వమానవత నిరీక్షిస్తున్న దివ్యముహూర్తం ఆసన్నమైంది. (ఆశ్వయుజ, కృష్ణ, తదియ సంవత్సరం 1982కి సరియైన) 1926 సెప్టెంబరు 20 తారీఖున ప్రాతఃకాలంలో 8 గంటల దరిదాపులలో దివ్యజ్యోతి అవతరించింది. పండిత జస్వంతరావు శర్మ ఆ సమయంలో దేవి నవార్ణ మంత్రం జపిస్తున్నారు. ఆయన ధ్యానంలో మాత రూపం ప్రత్యక్షంగా ఉన్నది. ఆయన హృదయపు లోతులలో ఉన్న ఆదిమాత ఆయనను ఆశీర్వదిస్తున్నది. అప్పుడే ఆయన చెవులలో ఒక వృద్ధ స్త్రీ వాక్యాలు ఇలా విన్పించాయి - "లేడీ లాయల్ ఆసుపత్రిలో సరిగ్గా 8గంటలకు నీకు ఆడపిల్ల పుట్టింది''. కానీ ఆశ్చర్యం ఏమిటంటే ఆస్పత్రిలో ఈ జనన వార్తతో పాటు ఆయన హృదయంలో ఇంకొకటి కూడా మారుమ్రోగింది.

చాలా స్పష్టంగా తన హృదయంలో ఆయన "శ్రీదేవ్యథర్వశీర్షమ్'' లోని ఈ మంత్ర ధ్వని విన్నారు.

**" అహమానన్దానన్దౌ ! అహం విజ్ఞానా విజ్ఞానే !**
**అహం బ్రహ్మా బ్రహ్మణీ వేదితవ్యే !**
**అహం పంచభూతాన్య పంచభూతాని ! అహం అఖిలం జగత్ !"**

అనగా - నేను ఆనందాన్ని ఆనందం కానిదాన్ని. నేను విజ్ఞానాన్ని, అవిజ్ఞానాన్ని. నేను తప్పనిసరిగా తెలుసుకోవలసిన బ్రహ్మను, బ్రహ్మము కాని దాన్ని. పంచీకృతములు అపంచీకృతములు అయిన మహాభూతములు నేనే. ఈ కన్పించుచున్న మొత్తము జగత్తును నేను.

ఈ స్పష్ట మంత్రధ్వనిని తన అంతర్ చేతనలో విన్న జస్వంతరావుకి ఆదిమాత తాను ఆవిర్భవించటమే కాక తన అతి స్పష్టమైన పరిచయాన్ని కూడా ఇచ్చింది. ఆయన ఆదిమాతకు ప్రణమిల్లి పూజాసనము మీద నుండి లేచి బట్టలు మార్చుకుని లేడీ లాయల్ ఆసుపత్రికి బయల్దేరారు. ఆయన తన జ్యోతిష్య విజ్ఞానం సార్థకత కూడా నిరూపించుకొనవలసి ఉన్నది.

★★★

**చిన్న చిన్న స్వార్థాలను వదులుకోలేనివాడికి గొప్ప అదృష్టం లభించదు.**

## సమాజ నిర్మాణం - స్వావలంబన

# దేశాభివృద్ధికి కీలకం గ్రామాభివృద్ధి

దూర దూరాలకు పరచుకొని ఉన్న పచ్చికబయళ్ల తివాచీలు. నిర్మలమైన ఆకాశం, నదీ నదాలు, సరస్సులు, జలజల పారే సేలయేళ్ళు, పక్షుల కలరవాలు. మనసును రంజింపచేసే మట్టి వాసన - ఇదీ గ్రామాల ప్రకృతి సంపద. ప్రకృతి తన సౌందర్యం, తన శృంగారం అంతా కుప్ప పోసి గ్రామాలను రూపుదిద్దిందా అనిపిస్తుంది. గ్రామీణ వాతావరణం మనోహరంగా, సజీవంగా ఉంటుంది. నగర వాతావరణం తళుకు బెళుకులతో మనిషిని ఆకర్షిస్తుంది. అయితే, గ్రామసీమలలోని అందం, జీవం అక్కడ ఉండవు. ప్రకృతికి దూరంగా ఉండే అక్కడి వాతావరణంలో మనిషికి విసుగుదలనూ, బరువునూ సృష్టించే కృత్రిమత్వం నిండి ఉంటుంది. అయినా - అభివృద్ధికి అవసరమయ్యే సాధన సంపత్తీ, సౌకర్యాలూ అన్నీ పట్టణాలలోనే లభిస్తున్నాయి. రోజురోజుకూ పట్టణాలు పెరుగుతున్నాయి. గ్రామాలు వెనుకబడి ఉండిపోతున్నాయి.

ప్రకృతిని ప్రేమించిన జాతిపిత మహాత్మా గాంధీ గ్రామీణ వాతావరణంవల్ల ఎంతగానో ప్రభావితులు అయ్యారు. "భారతదేశపు ఆత్మ గ్రామాలలో నివసిస్తోంది" - అని నొక్కి వక్కాణించారు ఆయన. ఆయన చెప్పిన ఈ సూక్తిలో ఎంతో లోతయిన రహస్యం దాగి ఉంది. ఆ సూక్తి నేటికీ అక్షరాలా వర్తిస్తుంది. గ్రామాలను ఉద్ధరించినపుడే, గ్రామాలలో పౌర సౌకర్యాలన్నీ కల్పించినపుడే పట్టణాల సమగ్ర వికాసం సాధ్యపడుతుంది. ఎందుకంటే రెండూ పరస్పర పూరకాలు. జాతీయ సమస్యల శాశ్వత పరిష్కారం ఈ వాస్తవంలో ఇమిడి ఉంది.

ఆధునిక నాగరికతలోని అభివృద్ధి ప్రక్రియలో గ్రామాలకు విలువ కాని, స్థానం కాని లేకుండా పోయింది. నేడు గ్రామాలకు పటిష్టమైన వర్తమానమూ లేదు, ఉజ్వల భవిష్యత్తూ లేదు. అవి గతానికి చిహ్నాలుగా మిగిలిపోయాయి. అమెరికా, పశ్చిమ ఐరోపాలలో గ్రామాల అస్తిత్వమే లోపించిపోయింది. పారిశ్రామికంగా ప్రగతి పొందని దేశాలలో మాత్రమే, వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న దేశాలలో మాత్రమే గ్రామాలు మిగిలి ఉన్నాయి. గ్రామాలను రక్షించడం అంటే వ్యవసాయ సభ్యతను రక్షించడం. వ్యవసాయ ప్రధానమైన మన దేశం ఈ వాస్తవం ఆధారంగా మాత్రమే వికాసం పొందగలుగుతుంది. భారతదేశం గ్రామాల దేశం. భారతదేశ ప్రగతికీ, ఉన్నతికీ, సమృద్ధికీ తారక మంత్రం ఒక్కటే - మొట్టమొదట వ్యవసాయాన్ని గౌరవించడం, ఆ తర్వాత గ్రామీణ పరిశ్రమలను ఆదరించడం.

భారత్‌లో నేటికీ లక్షలాదిగా గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలను వికసింపజేయడం ద్వారానే భారత్‌ను అభివృద్ధి బాటలో నడపగలుగుతాము. గాంధీజీ కన్న కలలను నిజం చేయగలుగుతాము. ఆయన కలలు కన్న భారత్ ఆదర్శ గ్రామాల పరస్పర సంబంధ బాంధవ్యాలపై ఆధారపడినది. కానీ, మనం ఈ సిద్ధాంతానికి, ఈ మూల సూత్రానికి నీళ్లు వదిలాము. ఇందుకు పూర్తిగా విరుద్ధంగా మనం నగరీకరణను దేశ అభివృద్ధికి మూలాధారంగా చేసుకున్నాం. పట్టణాలను నిర్మించడం, అభివృద్ధిపరచడం అనే ప్రక్రియను ఉన్నతికి కొలబద్దగా స్వీకరించాము. ఫలితంగా - నేడు సుమారు 40 కోట్ల ప్రజలు పట్టణాలలో, 60 కోట్ల ప్రజలు పల్లెలలో నివసిస్తున్నారు. పట్టణ జనాభాలో సుమారు సగంమంది అతి నికృష్టమైన, దయనీయమైన జీవితం గడుపుతున్నారు. మరోప్రక్క గ్రామాల పట్ల తగు శ్రద్ధ చూపకపోవడంవల్ల అవి నశించిపోతున్నాయి. ప్రజలు గ్రామాల నుండి పట్టణాలకు వలస పోతున్నారు. ఈ వలస వల్ల పట్టణాలు మరింతగా క్రిక్కిరిసి పోతున్నాయి, వికృతం అవుతున్నాయి.

గ్రామాలకూ, పట్టణాలకూ మధ్య గల అంతరం నానాటికీ పెరిగిపోతోంది. ఒకప్రక్క గ్రామాలలో కనీస సౌకర్యాలు కూడ కరవవుతున్నాయి. మరోప్రక్క పట్టణాలు అత్యాధునిక సౌకర్యాలతో తులతూగుతున్నాయి. ఒకప్రక్క అభివృద్ధికి శిఖరాగ్రం, మరో ప్రక్క నిత్యజీవితావసర వస్తువులకు సైతం కొరత. ఒకప్రక్క ఆకాశాన్ని అందుకునే భవనాలు, అత్యాధునికమైన బంగళాలు, వాహనాలు, విలాస వస్తువులు జమ అవుతున్నాయి. మరోప్రక్క విద్య, వైద్యం, భోజనం వంటి మౌలిక సమస్యలు ఆవులిస్తున్నాయి. గ్రామాలకూ, పట్టణాలకూ మధ్య ఉన్న ఈ తేడా, ఈ అసమానత మనం అనుసరించిన అభివృద్ధి వ్యూహరచన కలిగించిన విష ఫలితాలే. ఆ వ్యూహరచనలో గ్రామాలకూ, గ్రామీణులకూ స్థానం లేకపోవడంవల్ల కలిగిన విష ఫలితాలే. పారిశ్రామిక విధానాన్ని ప్రోత్సహించి, వ్యవసాయ విధానాన్ని ఉపేక్షించడంవల్ల ఈ విషమ సమస్య దాపురించింది.

వ్యవసాయంపట్ల తగు శ్రద్ధ చూపకపోవడం వల్ల దాని ఉత్పత్తి సామర్థ్యం పడిపోయింది. ఉత్పత్తి తగ్గడం వల్ల దానిమీద పూర్తిగా ఆధారపడిన గ్రామాలలో దారిద్ర్యం తాండవిస్తోంది. వ్యవసాయం ఒకే ఒక జీవనోపాధి కావడంవల్ల, ఇతర పరిశ్రమలు లేకపోవడంవల్ల దేశంలోని చాలా పెద్ద శ్రమశక్తి ఖాళీగా, పనిలేకుండా పడి ఉంటోంది. ఇందువల్ల నిరుద్యోగ సమస్య పెరిగిపోతోంది. దీని పరిష్కారంకోసం హరిత విప్లవం అమలు జరిగింది. దాని ప్రయోజనాన్ని పొందిన స్థలాలు సమృద్ధిని అనుభవిస్తున్నాయి. అయితే ఇలాంటి స్థలాలు బహుకొద్ది. మన దేశంలో హరిత విప్లవం సఫలం కావడం చాలా కష్టం. ఎందుకంటే సాగుభూమిలో అత్యధిక భాగం చిన్నచిన్న కమతాలుగా విభజింపబడి ఉంది. అన్న దమ్ముల మధ్య పంపకాలవల్ల కమతాలు చిన్నవైపోయాయి. ఈ కమతాలలో ఆధునిక యంత్రాల వాడకం సాధ్యపడదు. కనుక హరిత విప్లవం ఎలా అమలు జరుగుతుంది?

నేడు మన గ్రామాలు ఎదుర్కొంటున్న విషమ సమస్య పట్టణాలకు వలస.

**ఆత్మ వికాసానికి తీవ్ర అవరోధాలు అసూయా ద్వేషాలు.**

లక్షలాది గ్రామాలు ఈ సమస్యతో సతమతం అవుతున్నాయి. పట్టణాల తళుకు బెళుకులు గ్రామీణులను ఆకర్షిస్తున్నాయి. గ్రామాలలోని అక్షరాస్యులైన యువకులు పట్టణాలలో నివసించడానికి ఎక్కువగా ఇష్టపడుతున్నారు. వ్యవసాయ అభివృద్ధిలో మెలకువలు అందజేయడం కోసం పలు వ్యవసాయ విశ్వవిద్యాలయాలు స్థాపించబడ్డాయి. కానీ, వాటిలో శిక్షణ పొందిన యువకులు గ్రామాలలో వ్యవసాయానికి దోహదం చేయడానికి బదులు పట్టణాలవైపు మొగ్గు చూపారు.

ఈ సమస్యలను పరిష్కరించడానికై వ్యవసాయాన్ని పారిశ్రామికీకరణ చేసే విధానం అవలంబించబడింది. అయితే ఆ విధానం సఫలమయే అవకాశాలు తక్కువ. ఈ వైఫల్యానికి ముఖ్య కారణాలు చిన్న కమతాలు, దారిద్ర్యం. చిన్న కమతాలు యంత్రాల వాడడానికి అనుకూలం కావు. ఈ చిన్న కమతాలనుండి రైతులకు వచ్చే ఆదాయం చాలా తక్కువ. అది వారి కుటుంబ నిర్వహణకే చాలదు. అలాంటి స్థితిలో పొదుపు చేసి కూడబెట్టి దానిని మదుపు పెట్టడం వారికి పగటి కలగానే మిగిలిపోతుంది. ఈ పెట్టుబడి లేకపోతే వ్యవసాయాన్ని పరిశ్రమగా రూపొందించే విధానం సఫలం అవుతుందని ఆశించలేము. ఈ సందర్భంగా కర్ణాటకలో అమలు జరిగిన భూపరిమితి చట్టం సఫలం కాలేదు. కంట్రాక్టు వ్యవసాయంకూడ గ్రామాలను మెరుగుపరచడంలో విఫలమయింది.

ఈ పరిస్థితులలో గ్రామాల పారిశ్రామికీకరణ అత్యవసరం అవుతోంది. గ్రామాలలో లభించే మానవ వనరులను, ప్రకృతి వనరులను తగువిధంగా వినియోగించాలి. గ్రామాలలో లభించే ముడి సరుకుకు, వృత్తినిపుణతకు, శ్రమశక్తికి అనుగుణంగా పారిశ్రామిక సంస్కృతిని వికసింపజేయాలి. ఎక్కడ ఏ వస్తువు సహజంగా లభిస్తే అక్కడ దానిని ఉపయోగించడం విజ్ఞత. ఈ సందర్భంగా స్విట్జర్లాండ్‌లోని గడియారాల పరిశ్రమ, జపాన్‌లోని సాంకేతిక పరిశ్రమలు మన అభివృద్ధికి ప్రేరణ ఇవ్వగలుగుతాయి. ఎందుకంటే ఈ దేశాలలోని వివిధ ప్రాంతాలలో ఈ పరిశ్రమలకు ముడి సరుకు పుష్కలంగా లభిస్తుంది. తగిన శ్రమ ద్వారా, కౌశల్యం ద్వారా ఆ ముడి సరుకుతో భారీ పరిశ్రమలను నిర్వహిస్తున్నారు. సరిగా అదేవిధంగా మన గ్రామీణ స్థితిగతులకు అనుగుణమైన పారిశ్రామిక సంస్కృతిని వికసింపజేయాలి. అందువల్ల అందరికీ పని దొరుకుతుంది. పట్టణాలకు వలస నిలిచిపోతుంది. గ్రామాలు సమృద్ధిని సాధిస్తాయి.

'చిన్నతనం'లో అందాన్ని వెదకడం నేడు అత్యవసరం. అనగా - చిన్న చిన్న పనులను ఎంతో అందంగా చేయాలి. ఆ ఉత్పత్తులను మార్కెట్ చేయాలి. అగరువత్తులు, కొవ్వొత్తులు, బేకరీ వస్తువుల తయారీ వంటి కుటీర పరిశ్రమలు ఈ తరహాకు చెందినవి. కొద్దిపాటి తర్ఫీదుతో ఇలాంటి వస్తువుల తయారీ పద్ధతులను నేర్చుకోవచ్చు. ఇలాంటి వస్తువుల తయారీకూడా సులువే. ఈ తయారీలో శ్రమమాత్రమే అవసరం అవుతుంది. కొద్దిపాటి పెట్టుబడితో ఇలాంటి పరిశ్రమలను సులువుగా నిర్వహించవచ్చు. గ్రామసీమలలో ఉన్న అపారమైన శ్రమశక్తినీ, వృత్తి నైపుణ్యాన్నీ సద్వినియోగపరిస్తే ప్రతి గ్రామాన్ని సమృద్ధం చేయవచ్చు, ప్రగతి పథంలో అగ్రగామిని చేయవచ్చు.

దేశ అభివృద్ధి జరగాలంటే మన దృష్టి పట్టణాల వైపు మాత్రమేకాక గ్రామాల వైపు ప్రసరించాలి. గ్రామాలలో పడి ఉన్న విస్తారమైన వనరులను క్రమబద్ధంగా వినియోగించాలి. ఆధునిక పారిశ్రామిక సంస్కృతిలో మరుగుపడిపోయిన కుటీర పరిశ్రమలను వెలికితీసి అభివృద్ధి చేయాలి. అందువల్ల అపారమైన మన శ్రమశక్తి సద్వినియోగం అవుతుంది. గ్రామాలలోని కుటీర పరిశ్రమలకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించాలి. తద్వారా కుటీర పరిశ్రమల రూపురేఖలను ఆధునిక తరహాలో తీర్చిదిద్దవచ్చు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని, తక్కువ పెట్టుబడినీ సమన్వయించుకున్న కుటీర పరిశ్రమలు మాత్రమే గ్రామాలను సుసంపన్నం చేయగలుగుతాయి. ఈ పరిశ్రమలవల్ల గ్రామాలలో పనిలేకుండా పడిఉన్న శ్రమశక్తినీ, వృత్తి నైపుణ్యాన్నీ గ్రామాల ప్రగతికీ, సమృద్ధికీ వినియోగించడం సాధ్యపడుతుంది. చేనేత, ఖాదీవంటి గ్రామీణ పరిశ్రమలను సహకార సూత్రం ఆధారంగా నడపాలి. ఈ విధంగా యాజమాన్య నైపుణ్యం, వనరుల సద్వినియోగం తోడయితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో చిన్నతరహా పరిశ్రమలు కీలకము మహత్తరము అయిన పాత్ర వహించగలుగుతాయి.

మన గ్రామీణ రంగం జటిలమైనది, విస్తృతమైనది. దీన్ని ఆధారం చేసుకుని దేశ ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని నడపవచ్చు. ఇందుకు కావలసినవి వనరుల వికాసం, ప్రజలలో శ్రమపట్ల, స్వావలంబనపట్ల గౌరవాన్నీ, విశ్వాసాన్ని మేలుకొలపడం. గ్రామీణ ప్రజలలో వ్యవహారదక్షత, స్వావలంబన వంటి గుణాలను వికసింపజేయగలిగితే వారు ఎన్నడూ పరావలంబులు కారు, ఇతరుల దయా దాక్షిణ్యాలపై ఆధారపడరు. వికాసానికీ, ప్రగతికి మూలాధారం గుణాల వికాసం. వీటిని సమర్థవంతంగా క్రమబద్ధంగా వినియోగిస్తే అద్భుత విజయాలను సాధించవచ్చు. ఇందువల్ల గ్రామాలకూ, పట్టణాలకూ మధ్య ఉన్న అడ్డుగోడలు కూలిపోతాయి. గ్రామీణుడయినా, నగరవాసి అయినా - ప్రతి వ్యక్తీ స్వావలంబి అవుతాడు. తన కాళ్లమీద తాను నిలబడతాడు. గ్రామ వికాసానికి అవకాశం లభిస్తుంది. పట్టణాలకు వలస ఆగిపోతుంది. పట్టణాలలో జనాభా ఒత్తిడి తగ్గుతుంది, గ్రామాలలోని స్వయం సహాయక చర్యలకు పట్టణాలలో తగు గౌరవం లభిస్తుంది. ప్రతి గ్రామం ఒక తీర్థం అవుతుంది.

దేశ ఆర్థిక విధానం కేవలం పట్టణాలపై ఆధారపడకూడదు. ఆ విధానంలో గ్రామాలకు తగు ప్రాధాన్యం ఇచ్చేందుకై సూత్రబద్ధంగా కృషి జరగాలి. స్వదేశీని స్వయం ఉపాధిపై నిలిపితే అదొక ఆర్థిక విప్లవానికి శంఖారావం అవుతుంది.

వాస్తవానికి జీవితం సమగ్రమూ, సంపూర్ణమూ అయినది. దానిని గ్రామ జీవితంగా, నగర జీవితంగా విడదీసి ఆలోచించకూడదు. జీవితాన్ని సర్వతోముఖంగా వివేచన చేయాలి. గ్రామ, నగరాల పరస్పర సహకారం ద్వారానే సమగ్ర వికాసం సాధ్య మవుతుంది. దీన్ని అమలు చేయడం ద్వారా మనం స్వప్రయోజనంతోపాటు జాతి ప్రయోజనాన్ని, మానవాళి ప్రయోజనాన్ని, విశ్వ ప్రయోజనాన్ని కూడ సాధించగలుగుతాము. అందువల్ల గ్రామాలకు పచ్చదనం తిరిగి చేకూరుతుంది. పట్టణాలు క్రమబద్ధంగా, కాలుష్యరహితంగా రూపొందుతాయి.

★ ★ ★

**నీకు జరిగిన చెడ్డను ఇసుక మీద, మంచిని రాతి మీద వ్రాయి.**

భావవిప్లవ యోధుడు

# వేద విజ్ఞాన ప్రసారానికి అంకితమైన సాత్వలేకర్

పరిస్థితులు ప్రతికూలించినపుడు, సమస్యల విషవలయంలో చిక్కుకున్నపుడు పలువురు యువకులు నిరాశలో మునిగిపోతారు. ఓటమిని అంగీకరించే అలాంటి వ్యక్తులకు ఈ జీవితం కను విప్పు కాగలుగుతుంది. 40 సంవత్సరాల వయస్సు గల ఒక డ్రాయింగ్ మాస్టరుకు 50 రూపాయల నెలసరి వేతనం లభించేది. అకస్మాత్తుగా ఆ ఉద్యోగం ఊడిపోయింది. కుటుంబానికి రోజులు గడపడం కష్టమైపోయింది. ఆయన ఆ పరిస్థితులతో సంఘర్షణ జరిపారు. వాటిని అదుపుచేశారు. సాఫల్యానికి ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పారు. అదంతా ఓ అద్భుత గాథ.

తన చేతులతో తన అదృష్టాన్ని నిర్మించుకున్న ఆ మహావ్యక్తి శ్రీపాద దామోదర సాత్వలేకర్. ఆయన 1867 సెప్టెంబరు 19న జన్మించారు. ఆయన తండ్రి శ్రీదామోదర భట్ తండ్రి తాతలనుండి వస్తున్న పౌరోహిత్యం కొనసాగిస్తున్నారు. నిత్య అవసరాలకు సరిపోయేటంత ఆదాయం మాత్రమే వచ్చేది. కుటుంబంలో సుఖాలకు, సౌకర్యాలకు సాధనాలు ఉండేవి కావు, శ్రీపాదకు ముందు పుట్టిన సంతానం చిన్న వయసులోనే చనిపోయారు. శ్రీపాదకు వయస్సు పెరిగేసరికి ఇక తమ వంశం నిలుస్తుందని ఆయన తల్లిదండ్రులకు ధైర్యం వచ్చింది.

శ్రీపాద స్వగ్రామం కోల్‌గావ్. ఆయన తన 8వ ఏట అక్కడికి 200-250 మైళ్ల దూరంలో ఉన్న అసరోబాకీబాడీ వరకు నడిచివెళ్లి, అక్కడ ఉపనయన సంస్కారం పొందారు. ఆతర్వాత మరాఠీ స్కూలులో చేరారు. ఒక్కడే కొడుకు కావడంతో, తల్లి దండ్రులు ఆయనను తమకున్నంతలో గారాబంగా పెంచారు. గారాబంతోపాటు బాలుని వ్యక్తిత్వాన్ని సంస్కరించి దానిని ఉదాత్తంగా తీర్చిదిద్దేందుకు అవసరమయ్యే కుటుంబ వాతావరణాన్ని నిర్మాణం చేయడంలో వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. తండ్రి దామోదర భట్, తల్లి లక్ష్మీబాయి అందించిన ఆ సంస్కారాలతో పెరిగిన శ్రీపాద విద్యాభ్యాస సాధనలో సఫలత పొందుతూ వచ్చారు. 15వ ఏట 6వ తరగతి ప్యాసయి, ఆ స్కూలు వదిలారు.

ఆతర్వాత ఒక ఇంగ్లీషు స్కూలులో ఆయనను చేర్పాలనే ఆలోచన వచ్చింది. ఆ స్కూలులో ఫీజు నెలకు అర్ధరూపాయి. ఆ ఫీజు కట్టడం ఆయన తండ్రికి తలకు మించిన పని అయింది. కనుక ఆ ఆలోచన అమలు కాలేదు. ఆయన చదువు ఆగిపోయింది. ఆయన పౌరోహిత్యంకోసం తన తండ్రితో వెళ్లసాగారు. దక్షిణగా వచ్చిన డబ్బుతో ఆయన పుస్తకాలు కొని చదివేవారు. అప్పటికే ఆయన జ్ఞాన పిపాస అంత తీవ్రంగా ఉండేది.

అంతే కాదు. ఇంగ్లీషు స్కూలులో చేరడానికి శ్రీపాద మరో ప్రయత్నం చేశారు. ఆ స్కూలు హెడ్‌మాస్టరు శ్రీపణందీకర్‌ను కలుసుకుని ఆయనకు తన పరిస్థితిని వివరించారు. శ్రీపాద జ్ఞాన పిపాసకు ఆయన ముగ్ధులు అయ్యారు. అతడి పరిస్థితులకు ఆయన హృదయం ద్రవించింది. కానీ, ప్రభుత్వ నియమ నిబంధనలు అడ్డు రావడంతో ఆయన చేయాలనుకున్నప్పటికీ సహాయం చేయలేకపోయారు. అయితే, స్వయంగా ఇంగ్లీషు నేర్పుతానని ఆయన మాట ఇచ్చారు. అదే అదృష్టంగా భావించి, శ్రీపాద ఆయనవద్ద ఇంగ్లీషు నేర్చుకున్నారు. ఇంటివద్ద స్వయంగా ఇంగ్లీషు చదువుకోవడం సాగించారు. మొదటినుంచీ ఆయనకు సంస్కృతం పట్ల ప్రత్యేక అభిరుచి ఉంది. ఆ దేవభాషలో ఆయన యోగ్యతను సంపాదించారు.

పౌరోహిత్యంవల్ల బ్రతుకుదెరువు సాగించడం కష్టమని ఆయన తెలుసుకున్నారు. కనుక, సావంత్‌వాడీలో చిత్రకళ నేర్చుకుని, ఆ కళలో ఉన్నత శిక్షణకోసం బొంబాయి వెళ్లడానికి ఆయన నిర్ణయించుకున్నారు. ఈలోగా ఆయన వివాహం జరిగింది. శ్రీపాదజీ అతికష్టం మీద తల్లి దండ్రులను ఒప్పించి 1880లో బొంబాయి వెళ్లారు. అక్కడ జె.జె.స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో చేరారు. కోర్సు పూర్తయిన తర్వాత ఆ సంస్థలోనే అధ్యాపకులుగా నియమితులయ్యారు. నెలకు 50 రూపాయలు జీతం వచ్చేది. ఆ జీతంతో బొంబాయి వంటి మహానగరంలో బ్రతకడం చాలా కష్టం. కనుక, ఆయన మరో అవకాశంకోసం వెదికారు.

సుమారొక సంవత్సరం తర్వాత ఆయనకా అవకాశం వచ్చింది. ఆయన హైదరాబాదు చేరారు. హైదరాబాదు చిత్రకారులకు మంచి అవకాశాలు ఉన్న నగరం. అక్కడ శ్రీపాదజీకి తన కళా సాధనలో సఫలత లభించింది. అక్కడే ఆయన జీవితం విప్లవాత్మకంగా మలుపు తిరిగింది. దేశమంతటిలో స్వారాజ్య కాంక్ష మేలుకొంటున్న రోజులవి. హైదరాబాదు విప్లవకారులకు ఒక ప్రముఖ స్థావరం. ఆ నగరంలో ఎందరెందరో విప్లవకారులు రహస్యంగానూ, బహిరంగంగానూ పనిచేస్తూ ఉండేవారు. శ్రీపాదజీకి వారితో సాన్నిహిత్యం ఏర్పడింది. బానిసత్వంలో ఉన్న తన జాతికి సేవ చేయడం తన విధ్యుక్త ధర్మమని ఆయన భావించారు. దానితో పాటు భారతీయ ధర్మ, సంస్కృతుల పునరుద్ధరణకూడ శ్రీపాదజీ మనస్సును ఆక్రమించుకున్నది.

అందుకోసం ఆయన వైదిక సాహిత్యాన్ని అధ్యయనం చేయడం ప్రారంభించారు. ఆరోజుల్లో ఆర్యసమాజ ఉద్యమం దేశంలో నడుస్తోంది. జాతీయ, సాంస్కృతిక పునర్ జాగరణ కోసం సాగుతున్న

**సామూహిక సహకారం ఆధారంగా మానవాళి పురోగమించింది.**

ఆ ఉద్యమం ఆయనను ప్రభావితం చేసింది. ఆయన ఆ ఉద్యమ నాయకులతో కలసి పనిచేశారు. ఆయన హైదరాబాదులో ఒక వ్యాయామశాల, ఒక పాఠశాల, ఒక వ్యాఖ్యాన మండలి (ఉపన్యాస వేదిక) స్థాపించారు. ఆ మండలిలో భారతీయ ధర్మ, సంస్కృతులలోని వివిధ అంశాలపై, సిద్ధాంతాలపై ప్రగతిశీలమైన వివేచన జరిగేది. అంతే కాదు. ఆయన అనేక సాంఘిక దురాచారాలపై సైద్ధాంతికమైన ఉద్యమం నిర్వహించారు.

జాతీయతకు ధార్మికమూ, సాంస్కృతికమూ అయిన పునాది లేకపోవడంవల్ల ప్రజలు దానిపట్ల ఆకర్షితులు కావడం లేదనీ, వారిలో జాతీయ భావన స్పందించడంలేదనీ జాతీయ జాగరణ ఉద్యమంలో పనిచేస్తూ ఆయన గుర్తించారు. కనుక - ఆయన వేదాలలో నుండి దేశభక్తికి ప్రేరణ ఇచ్చే మంత్రాలను ఎంపిక చేశారు. "వైదిక రాష్ట్రగీత" అనే పేరుతో వాటిని హిందీలోకి అనువదించారు. ఆ రోజుల్లో కొల్హాపూర్ నుండి వెలువడుతూన్న "విశ్వవృత్త" అనే మాసపత్రికలో అవి ప్రచురితం అయినాయి. ఆ సంచిక వెలువడగానే బ్రిటిషు ప్రభుత్వం దాన్ని నిషేధించింది. ఎందుకంటే - ఆ సంచికలోని ఒక వ్యాసం విప్లవకారులకు ప్రేరణ, ప్రోత్సాహం ఇచ్చింది. సాత్వలేకర్‌జీపై కూడ శిక్ష పడింది. హైదరాబాదులోని ఆంగ్లేయ రెసిడెంట్ నిజాముపై ఒత్తిడి తెచ్చాడు. ఫలితంగా సాత్వలేకర్‌జీని హైదరాబాదు సంస్థానం నుండి బహిష్కరించారు.

ఆ వార్త స్వామి శ్రద్ధానందజీకి అందింది. ఆయన సాత్వలేకర్‌జీని తమ వద్దకు పిలిపించుకున్నారు. గురుకుల్ కాంగ్రీలో విద్యార్థులకు చదువుచెప్పమని ఆయనను కోరారు. సాత్వలేకర్‌జీ ఆ ఆహ్వానాన్ని ఆనందంగా అందుకున్నారు. 1908లో ఆయన గురుకుల్ కాంగ్రీలో చేరారు. వేదాల అధ్యాపకులుగా అక్కడ బాధ్యత స్వీకరించారు. జాతి జాగరణకు ఆయన కృషి అక్కడకూడ కొనసాగింది. 'విశ్వవృత్త' మాసపత్రికలో ఆయన వ్యాసం మరొకటి ప్రచురితం అయింది. భారతీయులంతా ఏకమై శత్రువులను నాశనం చేసి, మాతృభూమిని విముక్తి చేయాలని ఆ వ్యాసంలో ఆయన పిలుపు ఇచ్చారు. ఆయనను ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆయనపై కేసు నడిపింది. ఆయనపై మోపబడిన ఆరోపణలు ఋజువు కానందువల్ల ఆయన విడుదల అయినారు.

ఆతర్వాత ఆయన సాంస్కృతిక పునర్ జాగరణ కోసం ఒక నిర్దిష్ట ప్రణాళికను రూపొందించారు. 1918లో దానిని అమలు చేయడం ప్రారంభించారు. ఈ ప్రణాళికను గురించి తెలుసుకున్న ఒక జమీందారు ఆయనకు ఎనిమిది ఎకరాల భూమి ఇచ్చాడు. ఆర్థిక సహకారం అందించాడు. సాత్వలేకర్‌జీ వేదాల ప్రచురణ ప్రారంభించారు. ఆరోజులలో వేదాల పరిష్కృత సంహితలు ఎక్కడా లభ్యం కావడం లేదు. అసలు వేద సంహితలు దొరకడమే కష్టసాధ్యం అయ్యేది. భారతీయ సంస్కృతికి మూలాధారం అయిన ఈ వేదం లభించకపోవడంతో, పండితులు పాక్షిక పరిజ్ఞానంతోనే సరిపెట్టుకునేవారు. వేద సంహితలను ప్రామాణికమైన రీతిలో ప్రజలకు అందించే పనిని సాత్వలేకర్‌జీ చేపట్టారు. 109 సంవత్సరాల వయస్సువరకు ఆపని క్రమబద్ధంగా నిర్వహిస్తూవచ్చారు.

ఈ పనితో పాటు ఆయన జనజాగరణ కార్యాన్నికూడ నిర్వహిస్తూవచ్చారు. దేవతలకు పశువులను బలి ఇచ్చే దురాచారం ప్రబలంగా ఉన్న స్థలాలకు వెళ్ళి, ఉద్యమాలు నిర్వహించి, ఆ పశుబలులను నిలిపివేయించారు. తాను స్థాపించిన సంస్థను 1947లో సౌలభ్యం కోసం పార్డీకి తరలించారు. భారతీయ సంస్కృతిలోని అమూల్య సంపదను వెలుగులోకి తేవడానికై నేడా సంస్థ మహత్తరమైన కృషి జరుపుతోంది.

101 సంవత్సరాల వయస్సులో సైతం సాత్వలేకర్‌జీ నవయువకునిలా పనిచేసేవారు. రోజూ ప్రాతఃకాలం 5గంటలకు నిద్రలేచేవారు. కాలకృత్యాలు తీర్చుకుని 7గంటలకు పని ప్రారంభించేవారు. రాత్రి 9గంటలవరకు పని చేసేవారు. చివరి రోజువరకు ఆయన ఈ దినచర్యను కొనసాగించారు. 1968 జూన్ 9 ఉదయం ఆయనకు జబ్బుచేసింది. కొద్దిరోజుల తర్వాత ఆయన తనువు చాలించారు. జీవితంలో జబ్బుపడడం ఆయనకు అదే మొదటిసారీ, చివరిసారీ కూడ.

సాత్వలేకర్‌జీ కార్యశూరత అసాధారణం. ఆయన ధ్యేయనిష్ఠ అద్వితీయం. ఆయన దేశభక్తి నిరుపమానం. ఈ అద్భుత గుణాలు కారణంగా ఆయన తమ జీవితం మలిసగంలో మహత్కార్యాలు సాధించగలిగారు.

* * *

## ఏకాగ్రత మహత్తు

నెపోలియన్ చదివే స్కూలులో 58మంది విద్యార్థులుంటే ఈయన 42వ ర్యాంకులో ఉత్తీర్ణుడయ్యేవాడు. ఆయనను విద్యలో వెనుకబడినవానిగా భావించేవారు. చార్లీ చాప్లిన్ విదూషకుల ప్రారంభిక పోటీల్లో ఘోరంగా ఓడిపోయాడు. ఇటలీ నాయకుడు గారిబాల్డీ చాలా వెనుకబడిన పేద కుటుంబంలో జన్మించి గుడిసెల్లో జీవించేవాడు. ఐన్‌స్టీన్ విద్యార్థి జీవితంలో లెక్కల్లో చాలా వెనుకబడి ఉండేవాడు. తోటి స్నేహితులు లెక్కలు నీకు జన్మకు రావని హేళన చేసేవారు. వారందరితో ఆయన - గణితం నాకు ప్రీతికరమైన పాఠ్యాంశము, దానిలో నేను ప్రవీణుడనై తీరుతానని పలికేవాడు.

ఈ ఉదాహరణలు కేవలం ఏకాగ్రత ద్వారా అద్భుతమైన సాఫల్యాలు పొందిన వారివి. వీరి జీవితాలు ప్రారంభంలో సాధారణ స్థాయి కంటే చాలా అధ్వాన్నంగా ఉండేవి.

- ప్రజ్ఞాపురాణం నుండి

**స్వార్థం, సంకుచితత్వం, పిరికితనం అవినీతికి పుట్టిళ్లు.**

మనం - మన ఆరోగ్యం

# ఉపవాసం ఎందుకు, ఎలా?

రోగి శరీరము మలభారముతో కూడిఉన్నప్పుడు చతురుడైన వైద్యుడు అతనికి విరేచనములకు మందు ఇస్తాడు. విరేచనములు కావడం వలన పొట్టలో భారం తగ్గుతుంది. కాని చిరకాలము నుండి విరోచనబద్ధం కలవారికి ఈ పద్ధతి ఉపకరించదు. దీనికి ఉపవాసమే మంచి మందు. అది అన్నమయ కోశము నందలి అనేక సూక్ష్మ వికృతులను మార్పు చేస్తుంది.

స్థూలంగా ఉపవాస ప్రయోజనం అందరికీ తెలుసు. కడుపులో అపక్వంగా ఉన్న ఆహారం పక్వమవుతుంది. విశ్రాంతి వలన జీర్ణకోశము నవచేతన పొంది ద్విగుణీకృతంగా పని చేస్తుంది. అన్నాశయంలో చేరిన అపక్వాన్నము వలన ఉత్పన్నమయ్యే విష పదార్థాలు ఉత్పన్నం కావు. ఆహారాన్ని పొదుపు చేయటం వలన ఆర్థిక లాభం కలుగుతుంది. స్వల్పాహారం తీసుకునేవారు దీర్ఘకాలం జీవిస్తారని డాక్టర్లకు నిష్కర్షగా తెలుసు. ఎక్కువగా తింటూ, బలవంతంగా తిండిని పొట్టలో కుక్కుకుంటూ ఒక్కరోజైనా కడుపుకు సెలవీయకుండా ఉండేవారు తమ జీవితాన్ని త్వరలో సమాప్తి చేసుకుంటారు.

గీత యందు "విషయా విని వర్తంతే నిరాహారస్య దేహినః" అనే శ్లోకంలో ఉపవాసము వలన విషయ వికారములు నివృత్తి చెందుతాయని చెప్పబడినది. మనస్సును విషయ వికారముల నుండి రహితం చేయడం గొప్ప మానసిక లాభము. ఇది మనసులో ఉంచుకొనియే మన పూర్వులు అన్ని శుభకార్యములకు ఉపవాసాన్ని జోడించారు. కన్యాదాన దినమున మాతాపితలు ఉపవసిస్తారు. దేవీ నవరాత్రులలో ఎందరో స్త్రీ పురుషులు సంపూర్ణంగానో, పాక్షికంగానో ఉపవాసం చేస్తారు. బ్రాహ్మణుల భోజనము కాకుండా ఆ రోజు ఇంటిలో ఎవరూ ముందుగా భోజనం చేయరు. స్త్రీలు భర్త, అత్తమామలు భోజనం చేయనిదే తాము భుజించరు. ఇట్టి అంశిక ఉపవాసములు చిత్తశుద్ధిని పెంపొందించు దృష్టితో విధించబడినవే.

స్వాధ్యాయం దృష్టితో చూస్తే ఉపవాసమునకు అసాధారణ మహత్తు కలదు. రోగులకు ఉపవాసాన్ని జీవనమూలంగా పేర్కొంటారు. చికిత్సా శాస్త్రంలో రోగులకు ఒక దైవీ ఉపదేశం ఉన్నది. లంఘనం (ఉపవాసం) పరమౌషధం అని. కష్టసాధ్య, ప్రమాదకర అంటు వ్యాధులకు లంఘనం (ఉపవాసం) ఒక ముఖ్య ఔషధముగా చెప్పబడినది. న్యుమోనియా, టైఫాయిడ్, కలరా, ప్లేగు మొదలైన రోగములతో బాధపడేవారికి వైద్యులు తప్పనిసరిగా ఉపవాసాన్ని నిర్దేశిస్తారు. ప్రకృతి చికిత్సలో సంపూర్ణంగా గానీ, పాక్షికంగా గానీ ఉపవసించడము ప్రధాన చికిత్సగా ఉన్నది.

ఇది తథ్యమని మన ఋషులు చక్కగా తెలుసుకొన్నారు. ప్రతినెల లోనూ ఏకాదశి మొదలైన పుణ్యతిథులలో ఉపవాసం విధించారు.

అన్నమయ కోశాన్ని శుద్ధి చేయడానికి ఉపవాసమునకు విశేష ఆవశ్యకత ఉన్నది. శరీరంలోని "ఉపత్యికా" కేంద్రములను శరీర శాస్త్రజ్ఞులు నాడీ గుచ్ఛములని పిలుస్తారు. కొన్ని స్థానాలలో కొన్ని సూక్ష్మ నాడీ తంత్రులు కలుస్తాయి. కొన్ని చోట్ల గోలీలాగా ముడివేసుకొని ఉంటాయి.

కొన్నిచోట్ల ఈ నాడులు సర్పముల వలె సమానాంతరంగా ఉంటాయి. శిరస్సు కలుసుకొని ఉంటుంది. కొన్ని చోట్ల వటవృక్షము వలె శాఖోపశాఖలు విచ్చుకొని ఉంటాయి. ఈ విధములైన గుచ్ఛములు కొన్ని కలిసి విస్తృత మండలము నేర్పరచుకొంటాయి. వీని రంగు, ఆకారము, అనుచ్ఛేదనములలో చాలా తేడాలుంటాయి. వీని ఉష్ణోగ్రత, అణు పరిక్రమణము, ప్రతిభా పుంజములలో తేడాలుంటాయి.

వైజ్ఞానికులకు ఈ నాడీగుచ్ఛకము కార్యక్రమములను గురించి విశేష పరిచయం లేదు. కానీ యోగులకు ఈ ఉపత్యికలు శరీర మందలి అన్నమయ కోశమును బంధించు గ్రంథులుగా తెలుసు. మరణ సమయంలో ఈ బంధములు విడిపోయి ఒక గ్రంథి కూడ కనుపించకుండ పోతుంది. ఈ ఉపత్యికలు అన్నమయకోశము గుణదోషములకు ప్రతీకలు.

"ఇంధక" జాతి ఉపత్యికలు చంచలత్వము, అస్థిరత్వము, ఉద్విగ్నతలకు ప్రతీకలు. ఈ ఉపత్యికలు శరీరములో ఎక్కువగా కలవారు ఒకచోట కూర్చొని పని చేయలేరు. ఎప్పుడూ తిరుగుతూ ఉంటారు.

"దీపికా" జాతి ఉపత్యికలు ఆవేశము, కోపము, వేడి, ఆకలి మొదలైన వాటికి కారణము. ఇవి ఎక్కువగా కలవారికి చర్మరోగములు, కురుపులు, వ్రణములు, ముక్కు వెంట రక్తము కారటము, పసుపు పచ్చని మూత్రం, కళ్ళ మంటలు మొదలైన వ్యాధులు వస్తాయి.

"మోచక"ముల ఆధిక్యత వలన చెమట ఎక్కువగా పట్టటం,

**ఆంతరిక బలం లేనివాడే దరిద్రుడు.**

చొంగ, మూత్రము, మలము ఎక్కువగా విసర్జింపబడుట జరుగుతుంది.

"అప్యాయినీ'' జాతి గుచ్ఛకముల వలన సోమరితనం, అధికనిద్ర, ఉత్సాహము లేకపోవుట, శరీరము లావెక్కిపోవుట సంభవిస్తాయి. అట్టి వ్యక్తి ఏమాత్రం శ్రమకు ఓర్చలేడు. శారీరక, మానసిక కార్యకలాపాలలో ఉత్సాహం తగ్గిపోతుంది.

"పూషా'' జాతి గుచ్ఛకముల వలన కామ ప్రకోపం ఎక్కువ అవుతుంది. సంయమనము, బ్రహ్మచర్యము నిలువవు, ఏమాత్రము ఉత్తేజము కలిగినా - మనస్సును వికలం చేస్తుంది. మన్మధుడు ఈ 'పూషా' గ్రంథిని ఉత్తేజపరచియే శివుని మనస్సును కలవరపరిచాడు.

"చంద్రికా'' జాతి ఉపత్యికలు సౌందర్యాన్ని పెంచుతాయి. వాక్కులో మాధుర్యాన్ని, నేత్రములలో మాదకతను, ముఖము నందు ఆకర్షణను, కోమలత్వమును, మోహనత్వమును పెంపొందించుతాయి.

"కపిల'' కారణంగా నమ్రత, భయము, గుండెదడ, దుః స్వప్నములు, మెదడునకు అస్థిరత్వము, నపుంసకత్వము, వీర్యరోగము కలుగుతాయి.

"ధూమ్రారీ'' వల్ల సంకోచనశక్తి పెరుగుతుంది. కురుపులు దీర్ఘకాలం పక్వానికి రావు. కఫం బహుకష్టంమీద వెలువరించబడుతుంది. మైల ఎక్కువగా ఆలస్యం అవుతుంది. మనస్సులోని మాట బయటకు చెప్పలేరు. ఆయాసం ఎక్కువౌతుంది. శరీరంలో వేడి పెరుగుతుంది. కోపము త్వరగా వస్తుంది. తొందరపాటు ఎక్కువవుతుంది. రక్తప్రసరణము, శ్వాస ప్రక్రియ తీవ్రగతిని పొందుతాయి.

"అమాయ'' వర్ణగుచ్ఛకముల వలన దార్ఢ్యము, బలము, కఠోరత్వము, గాంభీర్యము, మొండితనము ఏర్పడతాయి. ఈ విధంగా శరీరము మీద బాహ్య ఉపచారముల ఫలితం ఉండదు. మందులు పనిచేయవు. రోగము దానంతటది తగ్గిపోవలసిందే. రోగి పథ్యము జాగ్రత్తగా చేయాలి. లేకుంటే తరువాత సంయమనము, నియమపాలన కూడ పనిచేయవు. డాక్టర్ల చికిత్స కూడ అనేకమార్లు విఫలంకావడం కద్దు. దానికి కారణం - ఉపత్యికల స్థితి కారణంగా శరీరముయొక్క సూక్ష్మస్థితిపై మందుల ప్రభావం ఉండదు.

"ఉద్గీయ'' ఉపత్యికల అభివృద్ధి వలన సంతానము కలుగదు. స్త్రీ పురుషు లిరువురు ఆరోగ్యవంతు లయినా సంతాన ప్రాప్తి ఉండదు.

స్త్రీ పురుషులలో ఎవరియందు 'అసితా' అనే ఉపత్యికలు ఎక్కువగా ఉంటే ఆ లింగానికి చెందిన సంతానము కలుగుతుంది.

"యుక్త హింస్రా'' అనే గుచ్ఛకము వలన క్రూరత్వము, దుష్టత్వము, పరపీడనము ప్రేరేపింపబడుతాయి. అట్టివారికి దొంగతనము, జూదము, వ్యభిచారము, దోపిడి మొదలైన దుర్గుణాలు అలవడతాయి. ధనవంతులైనా ఈ బుద్ధులు తప్పక వస్తాయి. అకారణముగా ఇతరులపై ఈర్ష్యా ద్వేషములు, తగవులు పెరుగుతాయి. ఇట్టివారికి మాంసాహారం, మద్యపానము, వేట, హత్యలు, దోపిడీలు ఎక్కువ ఇష్టం.

"హింస్రా'' ఉపత్యికలు పనిచేస్తే అలజడులు సృష్టిస్తారు. అట్టివారు తల పగులకొట్టుకొని ఆత్మహత్య చేసుకోవచ్చు. తమ పిల్లలనే హింసించుట మొదలైన పాడుపనులు చేస్తారు.

ఇంతకుముందు వర్ణింపబడినవి కాక ఉపత్యికలు 96 జాతులు ఉన్నాయి. ఇంకా ఎక్కువ కూడా ఉండవచ్చు. ఈ గ్రంథుల వలన శరీరాన్ని మన ఇచ్ఛవచ్చినట్లు ఉంచలేకపోతున్నాము. మనుష్యుడు తన శరీరాన్ని ఈ విధంగా ఉంచుకోవాలి అని అనుకొనుటకు కారణం ఈ ఉపత్యికలు లోలోపల తమ విలక్షణ క్రియలు, ప్రేరణలు ఉత్పన్నం చేయడం. బాహ్య ప్రయత్నములచే వీనిని అదుపు చేయలేం. మన అసహాయత వ్యక్తం చేయవలసి వస్తుంది.

అన్నమయ కోశమును శరీరముతో బంధించి ఉంచే ఈ ఉపత్యికలు శారీరక, మానసిక వికర్మలవలన చిక్కుపడి వికృత మవుతాయి. అటులే సత్కర్మల వలన సువ్యవస్థితంగా ఉంటాయి. దురాచరణ అంటే తన గొయ్యి తాను త్రవ్వుకోవటం వంటిది. ఈ గోతిలో పడి, రోగ శోకాది పీడలతో బాధపడవలసిందే. ఈ చిక్కులనుండి విడివడడానికి ఆహారమును సాత్వికంగా సంయమపూర్వకంగా ఉంచడం, దినచర్యలో క్రమశిక్షణ పాటించడం, ప్రకృతి ఆదేశాల ప్రకారం సంచరించడం ఆవశ్యకములు. కొన్ని యౌగిక ఉపచారముల ద్వారా కూడా ఆంతరంగిక వికారములను అదుపు చేయవచ్చు. కేవలం బాహ్యోపచారములతో సరిచేయడం కష్టము.

ఉపవాసములతో ఉపత్యికల సంశోధనము, పరిమార్జనం, సుసంతులనములకు సన్నిహిత సంబంధమున్నది. యోగ సాధనలలో ఉపవాసము గురించి విస్తృత విజ్ఞానమున్నది. ఈ సమయంలో, ఈ మాసంలో, ఈ ముహూర్తంలో, ఈప్రకారము ఉపవాసముంటే ఈ ఫలితం లభిస్తుంది - ఇట్టి ఆదేశములు శాస్త్రములలో పలుచోట్ల దర్శనమిస్తాయి. ఋతువులను అనుసరించి శరీరమునందలి ఆరు అగ్నులు ఎక్కువ తక్కువగా ఉంటాయి. ఊష్మ, బహు, వృచ, హ్వావాధీ, రోహితా, ఆత్పతా, వ్యాతి ఈ షడగ్నుల పేర్లు. గ్రీష్మము నుండి వసంతము వరకు

**కామనలు నిండిన మనస్సులో భావనలు ఉదయించవు.**

ఈ ఆరు అగ్నులు క్రియాన్వితంగా ఉంటాయి. వీనికి ప్రత్యేకమైన గుణములు కలవు.

(1) ఉత్తరాయణ దక్షిణాయనముల గోళార్ధ స్థితి, (2) చంద్రుని యొక్క వృద్ధి క్షీణ కళలు, (3) నక్షత్రముల నుండి భూమి మీద పడు శక్తి ప్రభావము, (4) సూర్యుని అంశకిరణముల మార్గము. ఈ నాల్గింటికీ శరీరంలోని ఋతు అగ్నులకు గల సంబంధము వలన ఏ పరిణామములు కలుగుతాయో మనస్సులో ఉంచుకొని ఋషులు పుణ్య పర్వములను నిశ్చయించి, అందు నిర్ణీత విధి ప్రకారము ఉపవాసము ఉంటే ఈ ఫలితం వస్తుందని తెలియజెప్పారు. కార్తీక శుక్లచతుర్ధి (నాగుల చవితి) నాడు ఉపవాసముంటే దాంపత్య ప్రేమ అధికమవుతుంది. దానికి కారణం ఆరోజు గోళార్ధ స్థితి, చంద్రకళలు, నక్షత్ర ప్రభావము, సూర్యమార్గము వీటన్నిటి కలయిక వల్ల ఏర్పడిన పరిణామము శరీరగత అగ్నితో కూడి సమన్వితమై శరీరస్థితి చిరకాలం సుదృఢమై దాంపత్య జీవితానికి మిక్కిలి దోహదకారి అవుతుంది.

ఈ విధంగానే ఇతర వ్రతములు, ఉపవాసములు అనేక కోరికలను, ఆవశ్యకతలను పూర్తిజేసి క్లిష్ట అనిష్టములను నివారించుటకు తోడ్పడును.

ఉపవాసములలో పంచ భేదములున్నవి. (1) పాచక, (2) శోధక (3) శామక (4) ఆనస (5) పాధక. పాచకోపవాసము కడుపులోని అపక్వాన్నమును. అజీర్ణాన్ని, మలబద్ధాన్ని పోగొడుతుంది. శోధకోపవాసము రోగులను ఆకలిగా ఉంచడానికి తోడ్పడుతుంది. దీనినే లంఘన మంటారు. శామకము చెడు తలంపులను, మానసిక వికారములను, దుష్ప్రవృత్తులను పోగొట్టి ఉపత్యికలను శమింపజేస్తుంది. ఆనసము దైవీశక్తిని ఆకర్షించు విశేష ప్రయోజనము ఉద్దేశించి చేయునది. ఎవరెవరి ఆత్మిక, మానసిక స్థితులను బట్టి వారికి అట్టి ఉపవాసము ఉపయుక్త మగును. దానికి అవలంబింపవలసిన నియమోపనియమములను నిర్ణయించుటకు సూక్ష్మవివేచన అవసరం.

సాధకుని అన్నమయ కోశ స్థితి ఎట్లున్నది? వీనిలో ఏ ఉపత్యికలు వికృతమై ఉన్నవి? ఏ ఉత్తేజిత ప్రదేశములను శాంత మొనరింపవలె? ఏ మర్మ స్థానమును సతేజమొనరించు ఆవశ్యకత కలదు? వీనిని చూచి ఆ వ్యక్తి ఏ ఉపవాసము చేయవలెనో నిర్ణయించాలి.

పాచక ఉపవాసములో అవసరమైనంత కాలము ఆహారాన్ని తీసుకోకుండా ఉండాలి. తడవకు ఒకరోజు లేదా 2 రోజులు అజీర్ణం తగ్గేవరకు ఉపవాసం ఉండాలి. ఆ సమయంలో నీరు, నిమ్మకాయ రసం మందులు మాత్రమే తగుమాత్రం పుచ్చుకోవాలి.

శోధక ఉపవాసమందు ఉపవాసముతోపాటు విశ్రాంతి కూడా ఉండాలి. రోగి ప్రమాదస్థితిని దాటనంతవరకు ఇది అవసరము. చల్లార్చిన నీటిని మాత్రమే త్రాగించాలి.

శామక ఉపవాసమందు పాలు, పండ్ల రసము, మజ్జిగ మొదలైన తేలికపాటి సంయుక్తమైన, బలహీనమైన పదార్థములను మాత్రమే వాడాలి. ఈ ఉపవాసకాలమందు స్వాధ్యాయము, ఆత్మచింతన, ఏకాంతము, సేవనము, మౌనము, జపము, ధ్యానము, పూజ, ప్రార్థన మొదలగు ఆత్మశుద్ధి నొసగు ఉపచారములు అవసరము.

"ఆనస" ఉపవాసమందు సూర్యకిరణముల ద్వారా అభీష్ట దైవీ శక్తిని ఆహ్వానం చేయాలి. సూర్యుని యందు నవగ్రహములలో రాహు కేతువులను విడిచి తక్కిన సప్తగ్రహముల లోని శక్తి సమ్మిళితమై ఉంటుంది. సూర్యునియందు తేజస్సు, వేడి, పిత్త ప్రకృతి ప్రధానములు. చంద్రునియందు చల్లదనము, శాంతి, ఉజ్వల కీర్తి ప్రధానములు. కుజుని యందు కఠోరత, బలము, సహాయత. బుధుని యందు సౌమ్యత, శిష్టత, కఫ ప్రాధాన్యము. సౌందర్యము, ఆకర్షణ గురువు నుండి. విద్య, బుద్ధి, ధనము, సూక్ష్మదర్శన శక్తి, శాసనము, న్యాయము, రాజ్యార్హత. శుక్రుని వలన వాక్చాతుర్యము, చాంచల్యము, ఉత్పాదకశక్తి, కూటనీతి. శనివలన స్థిరత్వము, స్థూలత్వము, సుఖోపభోగము, దార్ఢ్యము, పరిపుష్టి లభిస్తాయి. ఏ గుణముల ఆవశ్యకత ఉన్నదో వారములో ఆరోజు ఉపవాసముండి అనురూప దైవీతత్వమును ఆకర్షించుకోవాలి. ఆ సమయములో ఆ గ్రహమునకు సంబంధించిన లఘు ఆహారము, రంగు వస్తువులు, వస్త్రములు ఉపయోగించి ఫలితము వచ్చేటంతవరకు చేయాలి.

ఆదివారము :- శ్వేతవర్ణము, ఆవుపాలు, పెరుగు, అన్నము.
సోమవారము :- పసుపురంగు, బియ్యపుగంజి.
మంగళవారము:- ఎరుపురంగు, గేదెపెరుగు లేక మజ్జిగ.
బుధవారము :- నీలిరంగు, పులుపు, తీపిపండ్లు.
గురువారము :- నీలిరంగు, తీయని పండ్లు.
శుక్రవారము :- ఆకుపచ్చరంగు, మేకపాలు, పెరుగు, బెల్లం.

ప్రాతః కాలమునందు సూర్యకిరణముల సమ్ముఖమున కనులు మూసికొని నిర్ధారిత కిరణములు ప్రవేశిస్తున్నట్లు ధ్యానముచేస్తూ ఆ శక్తి సూర్యరశ్మి ద్వారా తనయందు అవతరితమగుచున్నట్లు భావించాలి.

పాధక ఉపవాసము ప్రాయశ్చిత్త స్వరూపముగా చేయవలెను. కేవలము జలమును మాత్రమే ఆ కాలమందు గ్రహింపవలె. తన తప్పిదమును క్షమించవలసిందిగా భగవంతుని వేడుచూ అటువంటి

**అవివేకంతో కూడిన అధ్యయనం వల్ల బుద్ధికి ఆహారం లభించదు.**

తప్పు తిరిగి చేయనని ప్రమాణము చేయవలె. అపరాధము కొరకు శారీరక కష్టసాధ్య తితీక్ష, శుభకార్యములకై ఎంతగా దానము చేయవలెనంటే పాపముయొక్క వ్యథ, పుణ్యము యొక్క శాంతి రమారమి సమానముకావలె. చాంద్రాయణవ్రతము, కృచ్ఛ చాంద్రాయణ వ్రతము ఈ సాధక ఉపవాసములే.

ప్రత్యేక ఉపవాసములందు ఈ విషయములను విశేషరూపమున ధ్యానము నందుంచుకొనవలెను. (1) ఉపవాస సమయమున మంచినీరు తరచుగా పుచ్చుకోవాలి. (2) ఉపవాసమున్న రోజున అధిక శ్రమ చేయరాదు. (3) పాలు, పండ్లు మొదలైన బరువైన పదార్థములు కడుపునిండా తింటే ఉపవాసము వలన ప్రయోజనముండదు. (4) ఉపవాసము ముగించిన తర్వాత స్వల్పంగా తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని తీసుకోవాలి. కడుపు నిండుగా భోజనం చేయరాదు. (5) ఉపవాసము చేసిన రోజున ఎక్కువ సమయాన్ని ఆత్మచింతన, స్వాధ్యాయము, ఉపాసన మొదలగు కార్యక్రమాలలో గడపాలి.

ఉపత్యికల శోధన, పరిమార్జన ఉపయోగీకరణములను బాగా తెలిసినవారి సలహా ప్రకారము ప్రత్యేక ఉపవాసములు చేయవలసివచ్చినా - సాధారణ ఉపవాసానికి ప్రత్యేకంగా గాయత్రీ ఉపాసకులకు ఆదివారం మంచిది. ఆరోజున సప్తగ్రహముల సమ్మిళిత శక్తి భూమిమీద ప్రసరిస్తుంది. అది వివిధ ప్రయోజనములకు ఉపకరిస్తుంది. ఆదివారం ప్రాతః కాలముననే స్నానంచేయ వీలుకలుగక పోతే కాళ్ళు, చేతులు, ముఖము కడిగి శుద్ధవస్త్రములను ధరించి, సూర్యునికి ఎదురుగా కూర్చొని విప్పారిన నేత్రాలతో సూర్యనారాయణుని దర్శించి, కళ్ళు మూసుకొని గాయత్రీ తేజోపుంజమగు రవిమండలమును ధ్యానించాలి. ఈ సూర్యుని తేజోపుంజ రూపిణి యగు సముద్రమునందు మనం స్నానము చేస్తున్నాము, ఆ తేజోపుంజము మనచుట్టూ ఆవరించి ఉన్నది - ఈ విధంగా ధ్యానిస్తూ సవితాశక్తి యొక్క బ్రహ్మరశ్మి తనలో ప్రవేశించి శరీరమంతటా నిండుతున్నట్లు భావించాలి. బయట ముఖం మీద సూర్యరశ్మి పడటం లోపల ధ్యానాకర్షణ ద్వారా సూక్ష్మరశ్మిని పీల్చి ఉపత్యికలను సువికసితం చేయడానికి బాగా ఉపయోగపడుతుంది. ఈ సాధన 15 నుండి 20 నిమిషాలు చేయాలి. ఆరోజు తెల్లని వస్త్రములను అధికంగా ఉపయోగించాలి. ఇతర వస్తువులను కూడా తెల్లని వాటిని ఉపయోగించాలి. మధ్యాహ్నం 12 గం॥ తర్వాత ఫలాహారం చేయాలి. పూర్తిగా నిరాహారంగా ఉండగలిగిన వారు ఉండవచ్చు. లేనివారు పండ్లు, పాలు, శాకములు తీసుకోవచ్చు. బాలురు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు, రోగులు, బలహీనులు అన్నము లేక గోధుమరవ్వతో చేసిన ఉప్మా మధ్యాహ్నం తీసుకుని రాత్రికి పాలు తీసుకోవాలి. ఉప్పు, చక్కెర రుచిని కలిగించే ఈరెండు పదార్థాలను విసర్జించి భోజనం చేయడం ఒకరకం ఉపవాసమే. ప్రారంభంలో అస్వాదు ఆహారంతో అంశిక ఉపవాసం చేయడం వలనకూడ 'గాయత్రీ' సాధకుడు తన ప్రవృత్తులను పెంపొందించుకొన వచ్చును.

'గాయత్రీ మహావిజ్ఞానం' నుండి
అనువాదం : డి.వి.ఎన్.బి.విశ్వనాథ్

★ ★ ★

## 'మరో ప్రయత్నం చెయ్యి'

సోలన్ నదీ తీరాన రత్న రాశులున్నట్లు నిరూపణలు లభించాయి. రాఫిల్ కొంతమంది సహకారంతో వాటి అన్వేషణలో నిమగ్నమైనాడు. ఇలా ఒక సంవత్సరం గడిచింది. లక్షలాది వజ్రాలను పోలిన రాతి ముక్కలను అతను ఏరి, పరీక్షించి కాదని నిర్ధారణ జరిగాక విసరివేస్తూ ఉండేవాడు. ఎంతకీ వజ్రాలు లభించక అతడు అలసి, శారీరకంగా, మానసికంగా శిథిలమైపోయాడు. తోటి సహకారుల పరిస్థితి కూడా ఇదేవిధంగా ఉన్నది. పనిని ఆపివేసి వెనుతిరిగి వెళ్లాలని నిశ్చయించుకొన్నాడు. తిరుగు ప్రయాణానికి సన్నాహాలు జరుగుతున్నాయి. ఒక రాఫిల్ మాత్రం తన సంకల్పాన్ని విడనాడక ఆ ప్రయత్నంలోనే నిమగ్నుడైఉన్నాడు. "మరొక్క ప్రయత్నం చెయ్యి. ఓడిపోయి వెనుకకు తిరిగి వెళ్లకు" అని మనస్సు పదే పదే హెచ్చరించింది. సరిగ్గా తిరుగు ప్రయాణానికి ఒక్కరోజు ముందు అతనికి ఒక పెద్ద వజ్రం లభించింది. ఆ వజ్రం ఒకటి లక్షలాది డాలర్ల ధరకు అమ్ముడుపోయింది. ఆత్మ విశ్వాసంతో, కొత్త సరంజామాతో నదీ తీరానికి మరో దిశగా రాఫిల్ అన్వేషణ ఆరంభించాడు. కృషి ఫలించింది. వజ్రాల రాశులు హస్తగతమైనాయి. విశ్వ విఖ్యాతి చెందిన సంపన్నులలో ఒకడైనాడు.

ఈయన ఆఫీసుముందు బోర్డుపైన "నిరాశాపూరితమైన చిట్ట చివరి క్షణాలలో కూడా మరొక్కసారి పరిస్థితులతో పోరాడి చూద్దామని ఆత్మవిశ్వాసంతో ఆలోచించండి" అని వ్రాసి పెట్టబడి ఉంటుంది. ఇటువంటి గొప్ప వ్యక్తులు పరిస్థితులకు తాము దాసులు కాక పరిస్థితులచేత దాస్యం చేయిస్తారు. ఎలాంటి పరిస్థితులనైనా సరే శాసించి, కావలిసినట్లు చేయించుకోగలరు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**నిర్మల హృదయంలో కోమలత్వం, బుద్ధిపరమైన వెలుగు ఉంటాయి.**

బోధకథ

# ముఖ్యమంత్రికి కనువిప్పు

ఉపన్యాసాలు చేస్తూ తిరగడమే సమాజసేవని నీవు అనుకుంటున్నావా - అని అతడిని ఒక రోజు మరొకరు ప్రశ్నించారు. అప్పుడు అతడు ఒక జిల్లాకు సంబంధించిన పూర్తి ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నాడు. ఎన్నిసార్లు అతడు జైలుకు వెళ్లవలసి వచ్చిందో లెక్కలేదు. ఎటువంటి కష్టాలనైనా ఎదుర్కొనడానికి సిద్ధంగా ఉన్నాడాయన.

"మా సేవ సామాన్య గృహసేవలకు కొంచెం భిన్నంగా ఉంటుంది" - అని అతడు తడుముకోకుండా జవాబిచ్చాడు. "మేము స్వచ్ఛతను, సావధానతను, జీవనవిద్యను ప్రచారం చేస్తుంటాం. మేము సరిగా ఉండకపోతే ఇతరుల కెలా నేర్పగలుగుతాము? ప్రజల ఆలోచనలను జాగృతం చేసి క్షాళన చేయాలి. సరియైన దిశను అందచేయాలి. అక్కడకు చేరుకునేటందుకు ప్రేరణనీయాలి. ఇదే మా సేవ. జన జాగరణను మించిన సేవ వేరే ఏమున్నది?" అన్నాడు.

ఆయన ప్రతిభ చాలా విలక్షణమైనది. యుక్తిగా సమాధాన మీయడం ఆయన స్వాభావిక విశేషత. వక్తృత్వ శక్తిని గురించి అడగ నక్కరలేదు. ఆయన మాటలను విన్నవారు మాట్లాడటం చేతగాక పోతే సమాజసేవ ఎలా చేస్తాడనుకున్నారు. మామూలు మాటలలో గూడా ఆయన చాతుర్యం కనిపిస్తున్నది. ఉపదేశాలు ఇస్తున్నాడు. ఉపన్యాసం ఇస్తాడు. గాంధీబాబా ఏ ఆత్మ పరీక్ష, ఏ ఆత్మ శోధన గురించి ప్రబలమైన ప్రేరణ నిస్తున్నాడో దానిని ఇతరులు ముక్కకు ముక్క అప్పజెప్పలేరు. ఎంతవరకూ దానిని గ్రహించారో తెలియదు. కాని మాటలు చాలా గంభీరంగా ఉన్నాయి. ఈ ప్రేరణను గూడా ఆయన రాజకీయరంగం నుండి పొందారు అని చెప్పటం అసంగతం కాదు. సమాజసేవను, ఆత్మశుద్ధిని ఆయన ఒక సాధనగా భావించారు. ఈ ఆత్మశోధనకు ప్రేరణ ఆయనలో జీర్ణించి ఉన్నా, నిద్రాణంగా లేదు. అది ఎంత జాగృతమై ఉన్నదో ఇప్పటికీ తెలియదు.

ఉపన్యాసం ఇవ్వటంతోనే సమాజ కల్యాణం జరుగుతుందా? ప్రతిరోజూ ఎంతోమంది ఈ ప్రశ్న వేస్తారు. ఆయన జవాబిస్తూనే ఉన్నారు. జవాబు విన్నవారు మారుమాట పలుకలేరు. ఆయన ఎక్కడికి వెళ్లినా జనం గుంపులుగట్టి, జయ జయ ధ్వానాలతో పుష్పమాలలతో స్వాగతమిస్తున్నారు. ఈ ప్రశ్న ఆయన మనస్సులో గట్టిగా నాటుకుంటుందా? ఆయన హృదయంలో నిలిచి ఎవరు పదే పదే హెచ్చరిస్తారు? ఎవరు జవాబిస్తారు?

మనం స్వచ్ఛత, సావధానత, అనుశాసనాల గురించి ప్రచారం చేస్తున్నాం. వాటిని మన జీవితంలో పొందుపరుచుకోకపోతే మనము ప్రజలకెలా నేర్పగలం? ఈ ప్రశ్న ఆయన మస్తిష్కాన్ని పదేపదే చుట్టుముట్టి వేధింపసాగింది.

ఎంతమంది నా ఉపన్యాసాలను విని స్వచ్ఛతను నేర్చుకున్నారు? ఎంతమంది సావధానతను నేర్చుకున్నారు? ఎంత మంది అనుశాసనాన్ని పాలిస్తున్నారు? నిరాశతో ఆయన తల వంగి పోయింది.

స్వచ్ఛంద సేవకులకు నా తలకట్టు మాదిరి తలకట్టుంటుంది. నాకు మాదిరి బోడిగుండు కలిగి ఉంటారు. ఇటువంటి చెప్పులే వేసుకుంటారు. ఇటువంటి గడియారమే పెట్టుకుంటారు. అందరూ తన వేషభాషల ననుకరిస్తున్నారని ఆయనకు గర్వం కలిగింది. ఆయన వలె పంచ కట్టుకుంటున్నారు. ఆయన కుర్తాలాంటిదే వేసుకుంటున్నారు. ఆయన వలెనే గుండీలు పెట్టుకుంటున్నారు. అందరూ ఆయన వేషాన్ని అనుకరిస్తున్నారు!

ఆయనలో చాలా లోటుపాట్లున్నాయి. మాట్లాడేటప్పుడు మెడను ఒక ప్రక్కకు వంచుతాడు. నడిచేటప్పుడు చేతులు కొంచెం ఎక్కువగా ఊపుతాడు. చేతులు కడిగేటప్పుడు చేతులు... సరే ఆయనలోని లోపాలను ఒక ప్రక్కన పెట్టండి. ఎవరిలో లోపాలుండవు? అయితే ఏమిటి? ఆయనలోని లోపాలు ఇంతమందికి ఎలా ఇష్టంగా మారాయి? ఎందుకు అందరూ ఆయనను అనుకరిస్తున్నారు?

ఆయన దోషాలు వ్యాపక, వ్యాపకతర, వ్యాపకతమము లైపోతున్నాయి. ఆయన దోషాలతో భూమ్యాకాశాలు, నలుదిక్కులు నిండిపోతున్నాయి. ఆయన కనులు మూసుకున్నాడు. వజ్రకఠోరమైన ప్రశ్న ఆయనలో ప్రతిధ్వనించింది - "ఇదేనా నీ ఉపన్యాసాల ప్రభావం? ఇదేనా సమాజానికి నీవు చేసే సేవ?"

ఆయన ఒక్కడే ఉన్నాడు. వెంటనే ఆయనకు తన మిత్రుడు గుర్తుకు వచ్చాడు. దుర్బల శరీరి. గోధుమ రంగు శరీరం. గంభీరమైన గుండ్రటి ముఖం. వంగిన తల. పెద్దజుట్టు. పగిలిన అరికాళ్లు. చెప్పులు లేని పాదాలు. మాసిన ఖద్దరు చొక్కా. ముతక ధోవతి. విద్యాపీఠంలో అందరూ అసహ్యించుకునేవారు. తోలు చెప్పులకు బదులుగా కొయ్యపాదుకలు వేసుకునేవాడు. పిలక, జంధ్యం నవ్వు పుట్టించేవి. కాని చాలా గంభీరంగా ఉండేవాడు. ఆయన గాంభీర్య ప్రభావమేమో, విద్యాపీఠంలో కొందరు విద్యార్థులు పిలక పెట్టుకుని సంధ్య వార్చేవారు.

ఇద్దరూ విద్యాపీఠంలో కలిసి చదివారు. అప్పుడు ఆ విద్యాపీఠంలో ప్రమాణ పత్రం సమాజసేవ. దేశ సేవ గురించిన ప్రబల ప్రేరణ ఆ సంస్థకు పునాది. దేశ స్వాతంత్ర్య సమరంలో ఈ సంస్థ విద్యార్థులు, శిక్షకులూ ఎందరో బలిదానం చేశారు. ఆయన అందులో ఒకరని అందరికీ తెలుసు.

కాని ఆయన మంచి వక్త కారు. స్మృతిరేఖలు ఆయన మనస్సనే కాన్వాస్ మీద ఒక చిత్రాన్ని తయారు చేస్తుండేవి. అవి మామూలు సంభాషణలో గూడా నోటి నుండి వస్తుండేవి. మాటలు ఖర్చు

సత్కర్మలనే పువ్వులతో పరమేశ్వరుని పూజ జరుగుతుంది.

చేయడంలో ఆయన పరమలోభి. పది మాటల బదులు ఒక మాట మాట్లాడేవాడు. విద్యాపీఠం నుండి ఆయన ఇంటికి వెళ్లిపోయాడు. అప్పుడప్పుడు ఆయన గురించి వివరాలు తెలుస్తుండేవి.

గ్రామప్రజలు ఆయనను ఎంత ప్రశంసించినా తృప్తిపడేవారు గాదు. ఆయన పొలం పనులు చేసుకునేవాడు. మధ్యాహ్నం విశ్రాంతి సమయంలో రాట్నం వడికేవాడు. ఇంట్లో చరఖా తీసుకువచ్చి పెట్టుకున్నాడు. చేలో ప్రత్తి విత్తనాలు నాటాడు. వాటితో నూలు తీసి రాట్నం వడికితే, బజారులో దుస్తులు కొనుక్కునే పని లేదు.

అప్పుడప్పుడు చుట్టుపక్కల రహదార్లను, గల్లీలను శుభ్రం చేసేవాడు. ప్రజలు ఆయనను అంతగా ఎందుకు గౌరవించేవారో తెలియదు. ప్రతిరోజూ సాయంత్రం పూట రావి చెట్టు క్రింద కూర్చొని రామాయణం చదివి వినిపించేవాడు. మీరు గూడా స్వయంగా చదువుకోగలిగితే ఎంతటి ఆనందం కలుగుతుందని శ్రోతలకు చెప్పేవాడు. ముసలివారు ఆయన వద్ద అక్షరాలు దిద్దుకుంటున్నారు. భోజనానంతరం ఆయన రాత్రి పాఠశాల నడిచేది. రాత్రి దారిలో పాములు, తేళ్ల గురించి ప్రజలు భయపడుతుంటే, చీపురు పుచ్చుకుని అందరూ శుభ్రం చేసుకున్నారు, ఆయన వెంట. దాంతో ఊరు ఊరంతా శుభ్ర పడింది.

ప్రాతఃకాలంలో ఒక మైలు నడిచివెళ్లి గంగాస్నానం చేసేవాడు ప్రతిదినం. సంధ్యావందనం, గీతాపఠనం ఆయన నిత్య జీవితంలో భాగాలు. ఇప్పుడు ఆ గ్రామంలో అందరూ గంగాస్నానం చేసేవారే, అందరూ సంధ్యావందనం చేసేవారే. స్త్రీల విషయం చెప్పే పని లేదు. వారికి అపరిమితమైన శ్రద్ధ నిచ్చాడు భగవంతుడు. స్నానం చేసి సూర్య భగవానునికి అర్ఘ్యమిచ్చిన తరువాతగాని వారు ముద్ద నోట పెట్టరు.

అంతా గుర్తుకు వస్తున్నది. భూత, వర్తమానాలు కలిసి ఒక రంగుల హరివిల్లును తయారు చేస్తున్నాయి. ప్రతీకను చూచి అసలు వస్తువులో కలిసిపోవాలని అభిలాష జాగృతం కావటం సహజమే. ఒకవంక మిత్రుని కలవాలని కోరిక. మరొక వంక ఆయన ఎవరో సాధువుతో కలిశారని వార్త విని విషయం తెలుసుకోవాలని కోరిక.

అతడు ఆ గ్రామానికి వెళ్లాడు. అక్కడి పారిశుద్ధ్యం, ప్రజలలో తత్పరత అతడిని ఆశ్చర్య చకితుని చేశాయి. ఎంత మంది స్వచ్ఛంద సేవకులు ఉన్నారిక్కడ అని అడిగాడు. ఇది ఆయన అధికారయాత్ర గాదు, హఠాత్తుగా వచ్చాడు. స్వాగత, సత్కారాలకు అవకాశం లేదు.

బాబూ ఇక్కడ అందరూ స్వచ్ఛందసేవకులే - మిత్రుడు దయానందుడు క్లుప్తంగా జవాబిచ్చాడు.

అప్పుడతనికి పూర్తిగా అర్థమైంది. ఇంకా స్పష్టంగా తెలియాలి. ఇది ఆశ్రమం కాదు. ఒక సజ్జనుడు తన ఖాళీ ఇంటిని గ్రామానికిచ్చాడు. మాకు అవకాశం కలిగింది. అది సాకారమయ్యింది. ఇదే మా రాత్రి మకాం. పంచాయతీ, అతిథిశాల, సామూహిక కార్యక్రమాలన్నీ ఇక్కడే జరుగుతాయని చెప్పాడు దయానంద.

స్వచ్ఛందసేవకులెవరూ లేరు. నాయకులెవరూ లేరు. నలువైపులా ఒక్కసారి దృష్టిసారించాడు. బాపూ మాటలలోని మర్మాన్ని దేవదత్తుడు గ్రహించాడని అవగతం చేసుకున్నాడు.

ఇక్కడి వారంతా నిన్నే అనుకరిస్తున్నారా అని అడిగాడు. అందరూ అలా అనుకరిస్తే బాపూజీ కల నిజమయ్యేదిగదా అనుకున్నాడు.

అదేం కాదు అన్నాడు దేవదత్తుడు. మంచిపనులు అందరూ అర్థం చేసుకుంటారు. అనుకరణగాదిది అని. అంతా కలయజూచాడు. అంతా గ్రహించే తెలివి తేటలున్నాయతడికి. కాని ఇక్కడ పరిస్థితి వేరు. ఎవరూ దేవదత్తుని అనుకరించటం లేదు. దేవదత్తుడు కొంచెం ముందుకు వంగి నడుస్తున్నాడు. చొక్కా గుండీలు రెండు తెగిపోయి ఉన్నాయి. మాట్లాడేటప్పుడు కొంచెం పిడికిలి బిగిస్తున్నాడు. కాని ఎవరూ అతడిని అనుకరించటం లేదు, కారణం? అతనికి అర్థంగాలేదు.

నీవెవరో సాధువు వద్దకు పోతున్నావట? అని అడిగాడు. దేవదత్తుడు నవ్వుతూ గంగానదీ తీరానికి పద, ఆయనను కలుద్దువుగాని - అన్నాడు. దేవదత్తుణ్ణి మిత్రునిలో మార్పు ఆశ్చర్యపరిచింది.

ఒక్క పిడికెడు ఆవుపేడ తీసుకురండి అన్నాడు సాధువు, తెల్లటి ఖద్దరు దుస్తులు ధరించి వచ్చిన పెద్దమనిషి కనిపించగానే. ఎవరో తెలియదు. వచ్చిన వ్యక్తి సామాన్యుడు గాదు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి.

మీరు కూర్చోండి, అని దేవదత్తుడు స్వయంగా లేవటానికి ఉద్యమించాడు. నీవు కూర్చో ఆయననే తేనీ! గోమయం పవిత్రమైనది, అన్నాడు సాధువు.

నాకు శుభ్రం చేయటం, పాచి ఊడవటం అలవాటైన పనే అని ఆయన లేచి పేడ తీసుకు వస్తుంటే అది చొక్కా మీద కొంచెం పడింది. ఆ చిత్రం పేపర్లలో పడితే! హాస్యాస్పదంగదా!

పేడ తెచ్చిన తర్వాత ఆ పుస్తకం తీసి తుడువు అని ఆజ్ఞాపించాడు సాధువు. నేను చేతులు కడుక్కువస్తానన్నాడు. కడుక్కో బోయినాడు. "చేతులు కడగడం తర్వాత, ముందు పుస్తకం తుడు" అన్నాడు సాధువు. "పుస్తకానికి పేడ అంటుకుని పాడవుతుంది స్వామీ" అన్నాడు. స్వామీజీ ముఖ్యమంత్రి సంపూర్ణానందతో అన్నాడు. - "నాయనా! పేడ చేతులతో పట్టుకుంటే పుస్తకం పాడవుతుంది. నీలోపల చెడుంటే సమాజంలో నీ క్షేత్రం విస్తరించిన కొద్దీ అదంతా పాడవుతుంది."

సాధుమహరాజ్ మాటలు అర్థమైనాయి. సాధువు గొప్పతనం, తన క్షుద్రత తెలిశాయి. గొప్పతనం వేపు దారి చూపి సాధువాయనకు గురువైనాడు. ఆయన మాట గురుమంత్రమయింది. ఆ మంత్రం జీవితాంతం ఆయన చెవులలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నది. ముందు తన దోషాలను కడుక్కున్న తర్వాతనే సమాజంలో దోషాలను కడిగి వేయడానికి ప్రయత్నం చేయాలి.

వాస్తవానికి ఆత్మసాధనే సమాజసేవకు పాదు వంటిది.

అనువాదం : డి.వి.ఎస్.బి.విశ్వనాథ్

★★★

**ముందుకు వెళ్లడం కన్న ముందుకు తీసుకువెళ్లడం మిన్న.**

## శతసూత్ర కార్యక్రమం - 1

# ఆరోగ్య రక్షణకై ఆహార విహారాలలో కట్టుబాట్లు

యుగ నిర్మాణానికి ఆవశ్యకమైన భావ విప్లవాన్ని శరీరానికి అమలుచేస్తే - చెడిపోయిన మన ఆరోగ్యం బాగుపడుతుంది. రోగాలు నిర్మూలం అవుతాయి. రేపటి నుంచే శరీర పరిస్థితిలో ఆశాజనకమైన మార్పు ప్రారంభం అవుతుంది. అనారోగ్యానికి కారణాలు సంయమనం లేకపోవడం, నియమపాలన లేకపోవడం. ప్రకృతి ఇచ్చే ఆదేశాలను ఉల్లంఘించడం వల్లనే మన ఆరోగ్యం చెడిపోతున్నది. మన శరీరం బలహీనం అవుతున్నది. ప్రభుత్వ చట్టాలవలె ప్రకృతికి కూడా చట్టాలు ఉన్నాయి. ప్రభుత్వ చట్టాలను ఉల్లంఘిస్తే మనిషి జైలు పాలవుతాడు. అలాగే - ప్రకృతి చట్టాలను నిర్లక్ష్యం చేసి విచ్చలవిడిగా ప్రవర్తిస్తే, వ్యక్తి రోగాల బారిన పడతాడు. అతడి బలం తగ్గిపోతుంది. పూర్వజన్మల ప్రారబ్ధంవల్ల శిక్షగాను, ప్రకృతి వైపరీత్యాలు, మహమ్మారులు, సమాజంలో అల్లకల్లోలం, ప్రమాదాలు, ప్రత్యేక పరిస్థితులు కారణంగాను ఒకోసారి నిగ్రహం కలిగిన వ్యక్తులుసైతం శారీరకంగా కష్టాలు అనుభవించవలసివస్తుంది. కానీ, శారీరక కష్టాలలో 90 శాతం ముఖ్యంగా మన చెడు అలవాట్లవల్ల, నియమాల నిర్లక్ష్యంవల్ల కలుగుతాయి.

సృష్టిలోని జీవ జంతువులన్నీ ఆరోగ్యంగా ఉంటాయి. పశువులు, ఆకాశంలో స్వేచ్ఛగా విహరించే పక్షులు, చివరికి చిన్న చిన్న క్రిమికీటకాలు సమయం వచ్చినపుడు చనిపోతాయి నిజమే. కాని అవి రోగాలకూ, బలహీనతలకు గురి కావు. మనిషి ఆయా పశువులను బంధించి ప్రకృతికి అనుకూలంకాని అలవాట్లను వాటిపై బలవంతాన రుద్దినప్పుడు మాత్రం అవి రోగాల బారిన పడక తప్పదు. నిజానికి రోగం, బలహీనత అనేవి ఈ ప్రపంచంలో లేవు. విచ్చలవిడిగా ప్రవర్తించి మనం వాటిని స్వయంగా కొని తెచ్చుకుంటున్నాం. సంయమనాన్ని పాటిస్తే, నియమాలను అనుసరిస్తే - రోగము ఉండదు, బలహీనతా ఉండదు. నిగ్రహాన్నీ, ఆహార విహారాలలో క్రమ పద్ధతినీ పాటించే అలవాట్లను మనం ప్రయత్న పూర్వకంగా ఏర్పరచుకోవాలి. ఈ అలవాట్లను ఏమేరకు ఏర్పరచుకుంటే ఆ మేరకు ఆరోగ్యం, ఆనందం మనకు అందుతాయి. ఇందుకు అవసరమైన సూత్రాలు పది :

**1. రెండు మార్లు భోజనం :** మధ్యాహ్నం, సాయంత్రం భోజనం చేయాలి. ఉదయం పాలు, మజ్జిగ, పండ్ల రసం, సూప్ వంటి తేలికైన ద్రవ పదార్థాలు తీసుకుంటే చాలు. మాటిమాటికీ తింటూ ఉండే అలవాటును పూర్తిగా వదులుకోవాలి.

**2. భోజనాన్ని బాగా నమిలి తినాలి :** భోజనాన్ని బాగా నమలాలి. అది సహజంగా గొంతులోకి దిగేలా నమలాలి. ఈ పని అలవాటు కావాలంటే ఇలా చేయాలి. కూర లేకుండా అన్నం విడిగా తినాలి. కూర విడిగా తినాలి. రెంటినీ కలిపి తిన్నపుడు అన్నం బాగా నమలకపోయినా గొంతు దిగుతుంది. విడి విడిగా తిన్నప్పుడు వాటిని ఎక్కువసేపు నమలవలసివస్తుంది. అలవాటు ఏర్పడడం కోసం ఇలా చేయాలి. బాగా నమలడం అలవాటయిన తర్వాత అన్నం, కూర కలిపి తినవచ్చు.

**3. అతిగా తినకూడదు :** కడుపులో సగం భోజనం, నాల్గవవంతు నీళ్లు ఉండాలి. గాలి వచ్చిపోవడానికి కడుపులో నాల్గవవంతు ఖాళీగా ఉండాలి. అంటే - భోజనంతో కడుపులో సగమే నిండాలి.

**4. జిహ్వాచాపల్యాన్ని వదులుకోవాలి :** నిలవ పచ్చళ్లు, మిర్చిమసాలా, మిఠాయిలు, కారపు సరుకులు అతిగా తింటే పొట్ట చెడిపోతుంది. రక్తం చెడిపోతుంది. కనుక వీటిని వదిలివేయాలి. కొద్దిగా ఉప్పు, అవసరమైతే కొద్దిగా ధనియాలు, సువాసన కోసం జీరా వాడవచ్చు. అవసరమైనంత ఉప్పు, పంచదార అన్నంలో, కూరలలో సహజంగానే ఉన్నాయి. మనం జిహ్వాచాపల్యాన్ని వదులుకోవాలి. నాలుకను అదుపుచేయాలి. అభ్యాసం కోసం కొద్ది రోజులు ఉప్పు, తీపి పూర్తిగా వదిలివేయాలి. అస్వాద వ్రతాన్ని పాటించాలి. అలవాటు చక్కబడ్డ తర్వాత కొద్దిగా ఉప్పు, నిమ్మరసం, అల్లం, పచ్చి ధనియాలు, పొదీనా వంటి వాటిని ఆహారంలో కలిపి దానిని రుచికరంగా చేయవచ్చు. ఎండిన మసాలా ఆరోగ్యానికి శత్రువు. తీపి వస్తువులు వీలైనంత తక్కువగా తినాలి. అవసరాన్నిబట్టి బెల్లం, తేనెలతో పని జరుపుకోవాలి.

**5. కూరగాయలు, పండ్లు ఎక్కువగా వాడాలి :** కూరగాయలకు భోజనంలో ప్రముఖ స్థానం ఇవ్వాలి. భోజనంలో సగం లేదా మూడవవంతు అన్నం ఉంటే చాలు. మిగితా భాగంలో కూరగాయలు, పండ్లు, పాలు, మజ్జిగ ఉండాలి. ఏ ఋతువులో దొరికేవి ఆ ఋతువులో తినాలి. అవి చౌకగా ఉంటాయి, ఆరోగ్యానికి మంచివి. మామిడి, జామ, రేగు, నేరేడు, బొప్పాయి, అరటి, దోస, పుచ్చ, టమోటా, పాలకూర వంటి వాటిని భోజనంలో ఎక్కువగా వాడాలి. మొలకెత్తిన గోధుమలు, శెనగలు వంటి వాటికి బాదంపప్పు అంత పోషక విలువ ఉంటుంది. వాటిని పచ్చివిగా తింటే అరగకపోతే ఉడికించి వండి తినవచ్చు. తవుడులో, కాయగూరలు, పండ్ల పైతోలులో జీవన తత్వాలు (విటమిన్లు) ఎక్కువగా ఉంటాయి. మామిడి, అరటి, బొప్పాయివంటి పండ్ల పైతోలు తీసివేయాలి. మిగతా

**కార్యసరళిలో క్రమబద్ధత బుద్ధితీవ్రతకు దోహదకారి.**

పండ్లను పైతోలుతో సహా తినడం మంచిది.

**6. హానికర వస్తువులను సేవించకూడదు :** మాంసం, చేపలు, గ్రుడ్లు, పిండివంటలు, పకోడీల వంటి హానికర వస్తువులకు దూరంగా ఉండాలి. టీ, భంగు, మద్యం వంటి మత్తు పదార్థాలు ఆరోగ్యానికి శత్రువులు. పొగాకు వాడకం ఆర్థికంగా, శారీరకంగా హానికరం. పాచిపోయిన, కుళ్లిపోయిన, అపరిశుభ్రమైన వస్తువులను తినకూడదు.

**7. ఆవిరిమీద ఉడికించిన భోజనం ప్రయోజనకరం :** పప్పు, కూరలు ఆవిరిమీద ఉడికించడం ప్రయోజనకరం. మూతలేని పాత్రలో నూనెతో వంట వండడంవల్ల కూరలలోని జీవన తత్వాలలో 70శాతం నశిస్తాయి. తిరగలితో విసిరిన పిండిని వాడాలి. యంత్రాలతో విసరడంవల్ల జీవనతత్వాలలో అధికభాగం నశిస్తాయి. తిరగళ్ళు, ఆవిరితో ఉడికించే పాత్రల వాడకం ఇంటింటా అలవాటు కావాలి. బట్టలు పరిమితంగా ధరించాలి. అవి వదులుగా ఉండాలి. చలినీ, ఎండ వేడిమినీ తట్టుకునే సామర్థ్యాన్ని నిలిపిఉంచుకోవాలి. చింతలు, ఆందోళనలు లేకుండా ప్రతి క్షణం సంతృప్తిగా, సంతోషంగా ఉండాలి.

**8. పరిశుభ్రత :** ఒంటిని గట్టిగా రుద్దుకుని స్నానం చేయాలి. శరీరాన్ని అంటి ఉండే బట్టలను రోజూ ఉతకాలి. పక్కబట్టలను త్వరత్వరగా ఉతుకుతూ ఉండాలి. ఇంటిలో ఈగలు, సాలీళ్లు, దోమలు, నల్లులు, పేలు, చుంచులు, ఎలుకలు ఉండకుండా చూడాలి. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ ఉండాలి. కాలువలలో మురుగు నిల్వ ఉండకుండా చూడాలి. ఆహార పదార్థాలను మూతపెట్టి ఉంచాలి. నిద్రపోయేటప్పుడు ముఖాన్ని కప్పుకోకూడదు. ఇంటికి తలుపులూ, కిటికీలు పెద్దవిగా, తగినంతగా ఉండాలి. వాటి నుండి గాలీ వెలుతురూ బాగా రావాలి. వంటపాత్రలు శుభ్రంగా తోమి ఉంచాలి. వాటిని ఉంచే స్థలం శుభ్రంగా ఉండాలి. గోడలకు తరచు వెల్ల వేయించాలి. తలుపులకు తరచు రంగు వేయించాలి. ప్రతిచోటా పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. భోజనం చేసిన తర్వాత పుక్కిలించి ఉమ్మాలి. రాత్రి నిద్రపోయే ముందు పళ్లను శుభ్రపరచుకోవాలి. మరీ చల్లని, మరీ వేడి పదార్థాలను సేవించకూడదు.

**9. ఆరుబయట గడపాలి :** రాత్రి త్వరగా నిద్రపోయి, ఉదయం త్వరగా లేవడం అలవాటు చేసుకోవాలి. ఇందువల్ల ఆరోగ్యం మెరుగవుతుంది. ఉదయం చేసే పని సఫలం అవుతుంది. ఉదయం నడక, వ్యాయామం, మసాజు చేసిన తర్వాత బాగా ఒళ్లు రుద్దుకుని స్నానం చేయాలి. ప్రాతఃకాలంలో ఆరుబయట నడిచి వ్యాయామం చేస్తే ఆరోగ్యం ఎన్నడూ దెబ్బతినదు. స్త్రీలకు నడక కుదరకపోతే, వారు తిరగలి విసరాలి. లేదా చెమటపట్టే మరో శారీరక శ్రమ చేయాలి.

**10. బ్రహ్మచర్య పాలన :** బ్రహ్మచర్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వివాహితులు, అవివాహితులు కూడా నిగ్రహాన్ని పాటించాలి. ఈ విషయంలో ఎంత ఖచ్చితంగా ఉంటే ఆరోగ్యం అంత మెరుగుగా ఉంటుంది. బుద్ధిజీవులకూ, విద్యార్థినీ విద్యార్థులకూ ఇది మరింత అవసరం. ఎందుకంటే - ఇంద్రియ నిగ్రహాన్ని కోల్పోతే మానసిక దౌర్బల్యం ఏర్పడుతుంది. అలాంటివారు తమ లక్ష్యాన్ని చేరుకోవడం కష్టసాధ్యం అవుతుంది.

☆☆☆

## శ్రమ శీలత మహిమ

శ్రమశీలత, దీక్ష, ప్రచండమైన సంకల్ప బలముల సమన్వయం వలన పరాక్రమానికి సార్థకత సిద్ధిస్తుంది.

ధన్వంతరీ విశ్వవిద్యాలయంలో వాగ్భట్టు ఆయుర్వేదం అభ్యసిస్తూ ఉండేవాడు. ఆయన వీపుమీద లేచిన ఒక భయంకరమైన కురుపును తగ్గించటానికి ఒక వేరు అవసరమైంది. గురువుగారు ఆ వేరు ఆకృతిని వివరించి చెప్పి వనంలో వెదకి తీసికొని రమ్మని పంపించారు. 3 నెలల కాలం వాగ్భట్టు జాగ్రత్తగా వనమంతా వెదకి అనేక క్రొత్త ఔషధాలను, వాటి తత్వాలను చూచి తెలుసుకొన్నాడు. కానీ కావలసిన ఔషధం మాత్రం లభించలేదు. ఆ నిరుత్సాహంగానీ, కురుపు బాధగాని కాలాతీతం అయిపోతోందన్న ఆలోచనగానీ మనసులోనికి రానీయక వాగ్భట్టు లభించిన వర్తమానాన్ని మహద్భాగ్యంగా భావించి సద్వినియోగం చేసికొని వెనక్కి తిరిగి వచ్చాడు. గురువు వాగ్భట్టుయొక్క జ్ఞానవృద్ధి, కొత్త అన్వేషణలపట్ల అత్యంత ప్రసన్నుడై అక్కున చేర్చుకొన్నాడు.

మర్నాడు ప్రక్కనున్న మైదానంలోకి తీసికొనివెళ్లి అతనికి కావలసిన ఔషధాన్ని క్షణంలో భూమినుండి పెకిలించి, తీసి శిష్యునిచేత సేవింపచేశాడు. అతడు అనతి కాలంలోనే ఆరోగ్యవంతుడయ్యాడు. వాగ్భట్టు గురువుతో "స్వామీ! ఔషధం ఇంత సమీపంలో ఉండగా మీరు నన్ను ఇంతటి శ్రమకు, ప్రయాసకు గురిచేయటానికిగల కారణం ఏమిటో తెలిసికోవాలని కుతూహలంగా ఉన్నది" అన్నాడు. దానికి గురువైన ధన్వంతరి, "వత్సా! ప్రయోజన లాభంతో పోలిస్తే జ్ఞానానుభవ సంపద విలువ అమూల్యమైనది. నీవు ప్రయోజన లాభం కారణంగా ఇంతటి పురుషార్థాన్ని నిర్వర్తించ గలిగేవు. ఈ మహత్తరమైన లాభం సునాయాసంగా ఎలా లభిస్తుంది? అందుకే తెలిసినవారు ఈ విధంగా చేసి కావాలనుకున్నవారిని లాభాన్వితుల్ని చేస్తూ ఉంటారు" అని వాగ్భట్టుకు వాస్తవికతను తెలియజేస్తాడు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**ఆపదలనే అగ్ని మన ఎముకలను ఉక్కులా చేస్తుంది.**

## వ్యక్తి నిర్మాణం

# నిన్ను నువ్వే ఉద్ధరించుకో

ఆత్మ సంస్కరణకు సరైన పద్ధతి యోగ నిద్రాస్థితిలో అచేతన మనస్సుతో సంపర్కం కలిగించుకుని ఆ క్షేత్రంలో జమకూడి ఉన్న వికృతమైన అభిరుచులనూ, అలవాట్లనూ తగినంతగా చక్కదిద్దుకోవటం. సంస్కరించుకోవటం. "ఆటో సజషన్" అంటే స్వసంకేతం అనే ఒక విజ్ఞాన సమ్మతమైన శాస్త్రం ఉన్నది. దాని సహాయంతో తనను తాను కోరుకున్న దిశలో నడిపించుకోవడానికి ప్రశిక్షణ పొందవచ్చు. మరొకరిపై ఈ విద్యను ప్రయోగించి వారిని శారీరక, మానసిక దృష్టిలో సంస్కరించటంగూడా చాలా తేలిక. స్వసమ్మోహనం లేదా స్వసంకేతం అనే ప్రక్రియతో ఎవరైనా తమను తాము ఆరోగ్యవంతులనుగా, రోగరహితులనుగా, సమర్థవంతులనుగా, ప్రతిభాసంపన్నులనుగా భావిస్తూ, నిరంతరం ఈ భావనను తన 'ఆత్మ'కు అందిస్తూ ఉండాలి. ఈ భావనలలో తన సంపూర్ణమైన నిశ్చయము, విశ్వాసమూ నింపుకుని తనంత తాను సంకేతాల నిచ్చుకోవాలి. సరిగా, బలంగా ఈ విధంగా చేస్తుంటే నిదానంగా ఆ లక్షణాలన్నీ సమకూరుతాయి. సంకేతాలు నిరంతరంగా ఉండాలి. అవి ఎంత ఉత్కృష్టంగా, పరిపుష్టంగా ఉంటాయో అంతటి మహత్తరమైన పరివర్తన కలుగుతుంది. అంతటి ఉన్నత తత్వాలు లభిస్తాయి.

సజషన్ - సంకేతం అంటే ఏమిటో ముందుగా అర్థంచేసుకోవాలి. ఉత్కృష్టమైన, పుష్టిగల, దృఢమైన ఆలోచన, స్పర్శ, ధ్వని, శబ్దం, దృష్టి, కొన్ని ఆసనాలు, ప్రక్రియలు - వీటి ద్వారా కార్యక్రమాన్ని పూర్తి చేయటం తన మీదా, ఇతరుల మీదా గూడా ప్రభావాన్ని చూపుతుంది. వాటి ద్వారా తన కోరికను నెరవేర్చుకోటం పేరే సంకేతం చేయటం. ఈ సంకేతంలో అపూర్వమైన దృఢత్వం, గట్టి శ్రద్ధ, శబ్దశబ్దంలోనూ శక్తి నిండి ఉంటాయి. సాధకుడు తడవ తడవకూ కొన్ని శబ్దాలనూ, వాక్యాలనూ, సూత్రాలనూ తీసుకుని మంత్ర జపంలా పదే పదే మనస్సులో భావన చేస్తూ తన ఆలోచనా ప్రక్రియను దృఢం చేసుకోటం జరుగుతుంది. పునరావర్తనతో కొంత సేపటికి ఆలోచనలు స్థాయీ స్వభావంలోనికి పరిణతి చెందుతాయి. పదేపదే మనస్సుకు ప్రబోధాన్ని ఇచ్చినట్లయితే, కొంత కాలానికి అది స్థాయీ సంపత్తి అవుతుంది. మనసే మన సంపూర్ణ శారీరక, మానసిక కార్యకలాపాలను సంచాలన చేస్తుంది. అది ప్రచండ శక్తి గలిగిన యంత్రం వంటిది. ఆలోచనలను ఉత్పత్తి చేసి, పరివర్తన చేసే పని ఈ సంచాలక యంత్రంతోనే జరుగుతుంది. అందువల్ల స్వసంకేతం యొక్క ప్రభావం మన మనస్సు మీద పడుతుంది. ఎప్పుడైతే ఈ మనస్సు ఈ సంకేతాలతో తాదాత్మ్యం చెందుతుందో, ఎప్పుడు స్వీకరిస్తుందో, అప్పుడు దాని క్రియా కలాపాలు దానిననుసరించి జరుగుతుంటాయి. అప్పుడు సాఫల్యత, సిద్ధి కలుగుతాయి.

ప్రాచీన కాలంలో భారతీయ ఋషి, మనీషులు దీని మీద లోతుగా అధ్యయనం చేసి అద్భుతమైన సాఫల్యాన్ని పొందారు. ఆధునిక విజ్ఞాన వేత్తలు, మనోవైజ్ఞానికులు గూడా పై తథ్యాలను ప్రయోగ పూర్వకంగా అంగీకరిస్తున్నారు. శరీర విజ్ఞానం, మనో విజ్ఞానం దృష్టిలో ఎటువంటి పరివర్తన కనిపిస్తున్నది? దీనివల్ల మన జాగృత చేతనా గర్భంలో పొరల, పొరలలోనికీ చొచ్చుకు పోవడమెలా జరుగుతున్నది? దీనిని విఖ్యాత రచయిత, మనోవైజ్ఞానికుడైన ఛాల్స్‌టి.టార్ట్ తన రచన 'ఆల్టర్డ్ స్టేట్ ఆఫ్ కాన్షస్ నెస్''లో వివరంగా వర్ణించారు.

పైరచనలో టార్ట్ రష్యాకు చెందిన సరేగీ స్విమనీనోవ్ అనే పేరుగల ఒక పియానో విద్వాంసుని గురించి వర్ణిస్తూ తాను కోల్పోయిన సామర్థ్యాన్ని ఆటోసజషన్ (స్వసంకేతం)తో అతడు ఎలా తిరిగిపొందగలిగాడో, సంగీత సామ్రాజ్యంలో అగ్రగణ్యుడుగా కీర్తి పొందాడో చెప్పారు. 21 సంవత్సరాల వయసులో అతడు తన మొట్ట మొదటి కచ్చేరీ చేసి సాఫల్యం పొందలేక, నిరాశతో క్రుంగి, ఆలోచనలను పక్కదోవ పట్టించుకున్నాడు. చివరికి హిప్నటిక్ చికిత్స కోసం విఖ్యాత చికిత్సకుడు డాక్టర్ నికోలాయిదావ్ వద్దకు చేరాడు. ఆయన స్విమనీనోవ్‌కు మూడు నెలల పాటు రోజుకు అరగంటసేపు సెషన్సులో సామాన్య హిప్నటిక్ చికిత్సతోపాటు పదేపదే ఒక సజషన్ ఇచ్చేవాడు - "నీవు తిరిగి సంగీతంలో గొప్ప ప్రావీణ్యాన్ని పొందగలుగుతావు. అతి సులభంగా కచ్చేరీ చేయగలుగుతావు" అని.

ఈ హిప్నటిక్ సజషన్ గొప్ప ప్రభావం చూపింది. మెల్ల

**మహాపురుషులకు దుఃఖాలు ఊయలలు, ఆపదలు దిండ్లు.**

మెల్లగా మరిన్ని కొత్త కాంపొజిషన్లను రూపొందించ గలిగాడు. ఆయన మస్తిష్కంలో సంగీతం లోని కొత్త కొత్త సంగతులు విహరింపసాగాయి. కొత్త కాంపోజిషన్లను తయారు చేశాడు. వాటిలో విస్తృతమైన స్వరమాధురి ప్రవహింపసాగింది. 1901 సం॥లో స్విమనీనోవ్ మాస్కోలో జరిగిన పియానో, ఆర్కెస్ట్రా కాంపిటీషన్‌లో పాల్గొని బహుమతిని, ప్రశంసలను పొందాడు. ఆయన ఖ్యాతి నలుదిశలా విస్తరించింది. ఈనాటికీ ఆయన పేరు మొదట చెప్పుకుంటారు. ఆయన తయారుచేసిన మ్యూజిక్ స్వరరచనలకు డా॥స్విమనీనోవ్ అని నామకరణం చేయబడింది.

గత నాలుగు దశబ్దాలుగా విదేశాలలో, అనేక దేశాల్లో హిప్నసిస్, ఆటోసజషన్ మీద అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. చేతన యొక్క పొరలను సులభంగా చొచ్చుకుపోయి పరిష్కృతం చేయటం జరుగుతున్నది. విశ్వప్రసిద్ధుడైన మనోవైజ్ఞానికుడు ఆల్టస్ ఫాక్స్‌వే ననుసరించి - మనుష్యుని చేతనాక్షేత్రం సముద్రమంత లోతైనది, విశాలమైనది. పైనుండి లోపలకు పోయిన కొలదీ, ఈ పొరలు అచేతన, అవచేతన, అధిచేతనలుగా చెప్పబడుతాయి.

సక్రియ మస్తిష్కాన్ని నిద్రింపజేయటం, అచేతనను జాగృతం చేయటం సమ్మోహన, స్వసంకేతాల ద్వారా జరుపవచ్చు. ఈ విధమైన స్వసంకేతం, స్వసమ్మోహన ప్రక్రియలకు ఆటోజనిక్ ట్రెయినింగ్ అని పేరు పెట్టారు.

సమ్మోహనంలో సమ్మోహిత వ్యక్తి మరొకరిపై ఆధారపడాలి. నిర్దేశాల, సంకేతాల ఆధారంగా నడవాలి. దీనివల్ల వ్యక్తిత్వంపై చెడు ప్రభావం ఉంటుంది. ఇది అలాంటిది కాదు, ఒక రకమైన సైకోథెరపీ. ఇది తన ద్వారా తాను ప్రభావితం కావడం. జర్మనీకి చెందిన మనో వైజ్ఞానికుడు ఎచ్.షుల్జ్ తన రచన "ఆటోజనిక్ ఆర్గన్ ఎక్సర్‌సైజ్"లో ఈ విషయాన్ని విస్తృతంగా వివరించారు. ఆయన చెప్పిన దానిని బట్టి ఈ ట్రెయినింగులో ఎన్నోరకాలైన సంకేతాల మాధ్యమంతో శరీరము యొక్క విభిన్న అంగాలలో శక్తి సంచారము చేయడం జరుగుతుంది. ఈ క్రియల కారణంగా జరిగే శారీరక ప్రక్రియల్లో పరివర్తనను శరీరక్రియా విజ్ఞానులు అధ్యయనం చేశారు. పాత సంస్కారాలు అలవాట్లు నశించటం, కొత్త సంస్కారాలను, అలవాట్లను ఉత్పన్నం చేయటం - అన్నింటికీ సరళమైన, ప్రభావశాలియైన పద్ధతి స్వసంకేత అభ్యాసం

అనువాదం : డి.వి.ఎన్.బి.విశ్వనాథ్

★ ★ ★

## తుఫాను తగ్గడానికి కారణం

భయంకరమైన తుఫాను వలన నదిలోని నీరు ఎగిరెగిరి పడసాగింది. నీరు కెరటాల ద్వారా లోపల ప్రవేశించటంతో నావికులు, యాత్రికులు భయకంపితులవసాగేరు. నావలో మూలగా ఒక వ్యక్తి నిద్రపోవటం చూచి తోటి ప్రయాణికులు అతనిని మేల్కొలిపి పరిస్థితిని తెలియజేశారు. అతడు జాగ్రత్తగా ఒకసారి తుఫాను వంక దృష్టి సారించి తోటి ప్రయాణికుల వైపు తిరిగి "సోదరులారా! ఈ మాత్రానికి ఇంతగా భయపడ్డారెందుకు. తుఫానులు రావటం, మనుష్యులు మరణించటం సర్వ సాధారణమైన విషయమే కదా! అసాధారణమైన విషయమేమీ కానప్పుడు మీరింతగా గాబరా పడిపోయి, హడావుడి చేయటం దేనికి?" అని ప్రశ్నించాడు. ఆయన మాటలకు మిగిలివారు నిశ్చేష్టులై చూస్తూ ఉండిపోయారు. మళ్లీ ఆ వ్యక్తి వారి వంక ఆదరంగా చూస్తూ "సోదరులారా! విశ్వాసంతో కూడిన భావన తుఫానుకంటే ఎంతో శక్తివంతమైనది. అందువలన ఈ తుఫాను కొన్ని నిముషాలలోనే శాంతిస్తుంది, ఆగిపోతుందని భావన చేద్దాము" అని పల్కి వారి జవాబుకై ఎదురు చూడకుండా కన్నులు మూసుకొని తన లోపల ప్రవహించే సాగరంలోకి దిగి "ఓ మూర్ఖుడా! శాంతించు-కంగారు పడకు" అని గట్టిగా ఆదేశించాడు. ఒళ్లుమరచి గంతులు వేసే అల్లరి కుఱ్ఱవాడు మిఠాయి పొట్లం చూచి శాంతించినంత సహజంగా తుఫాను తక్షణం శాంతించింది.నావలోని, యాత్రికులు నిర్భయంగా శ్వాస తీసుకొన్నారు. ఈ యాత్రికుడు ఎవరోకాదు, జీసస్ క్రీస్తు.

ఎంతటి ప్రమాదకరమైన వ్యక్తులైనా సరే, ఎంతటి భయంకరమైన పరిస్థితులు ఎట్టెదుట నిలిచినా సరే - ఆత్మ విశ్వాసం కలవారిని ఏమీ చేయలేవు. ఆత్మ విశ్వాసం గల వ్యక్తి పూల పాన్పుమీద పరుండినంత హాయిగా, నిశ్చింతగా మృత్యు శయ్యపైన నిద్రపోగలడు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**డబ్బు ఎలా సంపాదించావు ఎలా ఖర్చుపెట్టావని పరమేశ్వరుడు ఒక రోజున అడుగుతాడు.**

## సూర్య విజ్ఞానం

# సమస్త బ్రహ్మాండం ఒక చైతన్య శరీరం

శరీరంలో ఏ భాగానికి దెబ్బతగిలినప్పటికీ దాని ప్రతిక్రియ వల్ల రోమరోమమూ కంపిస్తుంది. మనస్సు, మస్తిష్కం ఉద్విగ్నతను, చికాకును పొందుతాయి. ధ్యానమంతా నొప్పిపై కేంద్రీకరింపబడుతుంది. మనో మండలం సంతులనాన్ని కోలుపోతే శరీరం ఆరోగ్యాన్ని కోల్పోతుంది. శరీరంలోని ప్రతి అవయవమూ, మనస్సు ఒక దానిపై ఒకటి ప్రభావాన్ని చూపుతాయి. ఇది శరీర చైతన్యానికి, ఏకతకూ ప్రమాణం. దృశ్య, అదృశ్య ప్రకృతి, యావత్తు సౌరమండలం ఈ విధంగానే గంభీరమైన భావనాత్మక ఆకర్షణతో జోడింపబడి ఉన్నాయి. ఇందులో ఒక దానిపై ఏ సంఘటన జరిగినా, రెండవ దానిలో దాని ప్రతి క్రియ కనిపిస్తుంది.

ఈ విజ్ఞానమంతా భారతదేశంలో ప్రాచీన కాలం నుండి అమలులో ఉన్నది. దీనినే జ్యోతిష విజ్ఞానమంటారు. దీని లక్ష్యం, సౌరమండల మందలి సభ్యుల పారస్పరిక సంబంధంపై వైజ్ఞానిక వివేచన, ఒక దానిపై ఒకటి ప్రసరింపజేసే ప్రభావమును తెలుసుకోవడం. దాని ఫలితంగా, ఈ విద్య తోడ్పాటుతో, పృథివి నుండి, యితర గ్రహ నక్షత్రముల దానము నుండి లాభం పొందటం, దుష్ప్రభావం నుండి రక్షించుకోవటం సులభం. నేడు ఎంతో అభివృద్ధి చెందిన సైన్సుద్వారా అది సాధ్యపడదు. క్రమంగా ఈ విజ్ఞానం మరుగునపడిపోయి విస్మరింపబడి, దాని స్థానంలో మూఢ విశ్వాసాలూ, భ్రాంతులూ మిగిలాయి. జ్ఞానులు అందువలననే ఈ విద్యను ఉపేక్షించటం జరిగింది.

విజ్ఞానం ఎప్పుడైతే ప్రౌఢతను సంతరించుకున్నదో, అప్పుడు అంతరిక్షంపై దృష్టి సారించి, అన్వేషణ ప్రారంభించింది. గ్రహ నక్షత్రముల, సౌర మండలపు చలనాలను, పరస్పర సంబంధాలను, ఒకదానిపై మరొకటి చూపే ప్రభావాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. శతాబ్దాలకు పూర్వం తత్వవేత్తలు, మహర్షులు, జ్యోతిర్విజ్ఞాన మర్మములను విశదీకరించగా, వానిని యిప్పుడు సైన్సు ద్వారా మానవాళి కొద్ది కొద్దిగా అవగాహన చేసుకోగలుగుతున్నది.

జ్యోతిష విజ్ఞానాచార్యులు సౌరమండల సమస్యలను దేవతాశక్తుల రూపంలో ప్రతిష్ఠించారు. నవగ్రహములను తొమ్మిది దేవతాశక్తులుగా గౌరవించారు. జ్యోతిర్విజ్ఞానంలో ఈ గుర్తింపు శతాబ్దాలుగా నిలచి ఉన్నది. వారు సూర్యుని ఒక అగ్ని గోళంగా మాత్రమే భావించక, ప్రాణప్రదాతగా, తన ప్రభావంతో యితర గ్రహాలను నడిపించే మహాశక్తిగా మన్నించారు. సూర్యునితో పాటు గురుడు, బుధుడు మొదలైన గ్రహాలన్నీ భూమిపై తమ ప్రభావాన్ని ప్రసరింపజేస్తున్నాయి.

ఈ తథ్యాన్ని విశ్వమందలి ప్రసిద్ధ భౌతిక విదులు అంగీకరించారు. వారి అభిప్రాయాన్నిబట్టి సౌరమండల చలనాల ప్రభావం భూమి వాతావరణం మీద జీవ, పరిస్థితుల మీద మిక్కుటంగా ఉన్నది. యుగోస్లావియాకు చెందిన నాభికీయ (POLAR) భౌతికవేత్త (PHYSICIST) ఆచార్య స్టీవ్వెన్ డేడీజర్ కథనం ప్రకారం, ఈనాటి అంతరిక్ష విజ్ఞానం సుసంపన్నం కావడానికి జ్యోతిర్విజ్ఞానాన్ని (ASTROLOGY) ఆలంబన చేసుకోకతప్పదు. ప్రాకృతిక సంఘటనలను అంచనా వేయడంలో ఈనాటికీ సైన్సు పూర్తి సాఫల్యం పొందలేకపోతున్నది. ఆధునిక విజ్ఞానం అంతరిక్ష, సబ్‌న్యూక్లియర్ క్షేత్రాలలో అనితర సాఫల్యాన్ని పొందిన అనంతరం గూడా బ్రహ్మాండానికి సంబంధించిన సంఘటనల గురించి సరియైన వ్యాఖ్యానం చేయలేక పోతున్నది. దానికి కారణం క్షేత్రం పరిమితం కావడమే. మరోపక్క జ్యోతిషశాస్త్రం సూర్యుని గురించిన జ్ఞానం, బ్రహ్మాండములోని సూక్ష్మ కదలికలు, సూర్యుని ప్రభావం, అంతరిక్ష రహస్యాలు – వీటన్నిటిని గురించీ పూర్తిగా తెలియజేయడంలో అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉన్నది.

భౌతికశాస్త్ర సిద్ధాంతాల ననుసరించి ప్రతి పదార్థంలోని కణం ఈ విశ్వంలో ఒక దానితో మరొకటి సాపేక్ష గతిశీలతను కలిగి ఉన్నది. అవి తమ స్థానాలను పరస్పరం మార్పిడి చేసుకుంటాయి. అందువల్ల అవి ఉండే పర్యావరణం మారుతూ ఉంటుంది. ఒక అవిచ్ఛిన్న బ్రహ్మాండీయ క్రమంలో బంధింపబడిఉన్న కారణాన, కణసందోహం విశేష ప్రభావాన్ని కలుగజేస్తుంది. భూమి, యితర గ్రహాలు చరాచర పదార్థాల మీదా, ఖగోళ పిండముల మీద తమ ప్రభావాన్ని చూపుతూనే ఉంటాయి. ఈ తథ్యం పూర్తిగా తెలిసినప్పటికీ విజ్ఞానశాస్త్రం గ్రహ, నక్షత్రముల గతి, స్థితి, ప్రభావముల పూర్తి అవగాహనను కలుగజేయడంలో విఫలమవుతున్నది. పై వ్యాఖ్యానం చేస్తూ ప్రసిద్ధ భౌతిక శాస్త్రవేత్త ఆచార్య స్టీన్‌వెన్ డేడీజర్ సమగ్రమైన అవగాహన కొరకు విలుప్తమైన జ్యోతిష విజ్ఞానాన్ని పునరుజ్జీవితం చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని నొక్కి వక్కాణిస్తున్నారు.

ప్రఖ్యాత ఆస్ట్రియన్ వైజ్ఞానికుడు ఎర్నెస్ట్ మైక్ చెప్పే దాన్నిబట్టి, బ్రహ్మాండమందలి అనంత కణములు ఒకదానితో మరొకటి ముడివడి ఉన్నాయి. వాటి మధ్య పరస్పర సన్నిహిత సంబంధం ఉన్నది. సౌర జ్వాలలు గ్రహాలను తాకినప్పుడూ, చంద్రుని గతితో ఎంతో కొంత సంబంధం కలిగినప్పుడూ, భూమి జీవ అయస్కాంత శక్తిపై ఎన్నోరకాల వ్యతిరేకత ఉత్పన్నమవుతూ ఉంటుంది. గ్రహములు భూమి జీవ అయస్కాంత శక్తిపై (BIO MAGNETISM) తమ ప్రభావాన్ని చూపుతాయి. గ్రహముల అసంతులనం వల్ల ఉత్పన్నమైన అయస్కాంతపు తుఫానులు భూమిపై ప్రకృతి వైపరీత్యాలకు, జీవుల మానసికమైన, నరముల సంబంధమైన రుగ్మతలకు కారణాలు. భూమ్యాకర్షణ శక్తిలో కలిగే మార్పుల వల్ల మానవుల ఆలోచనలోనూ, ఆచరణలోనూ మార్పులు కలుగుతాయి.

రష్యన్ విజ్ఞానవేత్త దీనేవస్కీ ఈ రంగంలో చాలా కాలం పరిశోధన

**మంచికోసం కృషి చెయ్యి, చెడుకోసం సిద్ధపడు.**

చేసిన తరువాత గొప్ప విశేషాలను కనుగొన్నాడు. ఆయన చెప్పే దాని ప్రకారం, సౌరమండలంలో కలిగే మార్పులకూ భూమిపై జరిగే సంఘటనలకూ సంబంధం ఉన్నది. పదకొండు సంవత్సరాల కొకసారి సూర్యునిలో అణువిస్ఫోటం జరుగుతుంది. అప్పుడు భూమి మీద యుద్ధాలు, విప్లవాలు జరుగుతాయి. ప్రకృతి వైపరీత్యాలు, అంటు వ్యాధులు ప్రబలుతాయి.

జియోజార్-జి-గియోర్ట్ అనే వైజ్ఞానికుడు జ్యోతిషశాస్త్ర ప్రేరణతో విజ్ఞాన శాస్త్రంలో ఒక కొత్తశాఖను ప్రవేశపెట్టారు. దానిపేరు బ్రహ్మాండ రసాయనశాస్త్రం. ఆయన కథనం ప్రకారం, బ్రహ్మాండం మొత్తం ఒక శరీరం వంటిది. అందులో జరిగే ప్రతిసంఘటనా ఏకాకిగా కాక, సంయుక్తంగా జరుగుతుంది. అందువలన ఏ గ్రహం ఎంత దూరాన ఉన్నా దాని ప్రభావం తప్పనిసరిగా భూమి మీద పడితీరుతుంది.

ప్రొ॥ బ్రౌన్ ననుసరించి - భూమి సౌరమండలంలోని ఒక సభ్య గ్రహం, చంద్రుడు ఉపగ్రహం. వైజ్ఞానిక దృష్టితో చూస్తే భూమి, చంద్రుల ఉత్పత్తి సూర్యుని నుండే జరిగింది. సూర్య చంద్రులేగాక కుజ, బుధ, గురు, శుక్ర, శనుల ప్రభావంగూడా భూమిపై పడుతుంది. దానికి అంతర్గ్రహ ప్రభావ సానుభూతి అని పేరు.

మూడవ అంతర్జాతీయ విషువతీయ వాయుగోష్టి విజ్ఞాన గోష్టిలో జరిగిన ప్రకటనకు ప్రతిగా అహమ్మదాబాదుకు చెందిన భౌతిక అనుసంధాన శాలలోని యిద్దరు వైజ్ఞానికులు ఆచార్య ఆర్.రామనాధన్, డా॥ ఎస్. ఒ. అనంతకృష్ణన్ చేసిన ప్రకటనను బట్టి, భూమి సౌరమండలంలోని ఒక అభిన్న అంశమే. ఆకాశమందలి పిండముల స్పందన భూమిని హెచ్చుగా ప్రభావితం చేస్తుంది. తమ పరిశోధనలో ఈ వైజ్ఞానికులు గ్రహించిన విషయం - వాయు మండలము యొక్క "డీ" క్షేత్రంలో, శక్తివంతమైన × కిరణాల ప్రవాహం స్కార్పియో 11ను తాకి, వనస్పతిని, జీవజంతువులను ప్రభావితం చేసి వాటికి హాని కలిగిస్తుంది.

ఎటామిక్ ఎనర్జీ మాజీ అధ్యక్షుడేగాక, విశ్వవిఖ్యాత అణుశాస్త్రవేత్త యైన డా॥ సారాభాయి విభిన్న దేశాల వైజ్ఞానికులతో జరిపిన గోష్ఠిలో సూర్యునిదేగాక, ఆకాశంలోగల యితర పిండముల ప్రభావంగూడా భూమిపై పడుతున్నదనీ, జ్యోతిషశాస్త్రమునందలి సూత్రాల నన్వేషిస్తే చాలా గొప్ప విషయాలను తెలుసుకోవచ్చునని ప్రకటించారు.

రష్యన్ శాస్త్రవేత్త వ్లాదిమిర్ రేశ్యాతోయ్ ఈ విషయంలో విస్తృతంగా పరిశోధన చేశాడు. ఆయన కథనం ప్రకారం, భూమిపై తరచుగా వచ్చే ఆకర్షణ తుఫానుల వల్ల భూమిపై నివసించే ప్రాణులలో స్నాయుసంబంధమైన, మనస్సుకు సంబంధించిన రుగ్మతలు ఎక్కువ అవుతున్నాయి. భూమిపై అయస్కాంత క్షేత్రం తీవ్రత, ఫ్రీక్వెన్సీ మారడం అనేది ఆకాశమందలి పిండముల నుండి వచ్చే శక్తి ప్రవాహం ప్రభావమే. తమ ప్రారంభిక పరిశోధనలలోనే వ్లాదిమిర్ గ్రహించిన విషయం - ఎప్పుడు సూర్యునిలో ఒక విలక్షణమైన జ్వాలా ప్రకోపం కలిగినా, దాని ప్రభావం వల్ల భూమి మీద ప్రచండమైన అయస్కాంత తుఫాను వస్తుంది. దాని ప్రభావం అందరి మీదా పడుతుంది గాని, బలహీనమైన మానసిక స్థితి గల వ్యక్తులపై అది హెచ్చుగా కనిపిస్తుంది. వారు ఆత్మహత్యలకు, హత్యలకు పాల్పడవచ్చు. అందువల్ల దుర్ఘటనలు పెరిగిపోతాయి.

ఈ ఆధారంతో వైజ్ఞానికులు చెప్పేది - మస్తిష్క క్రియాశక్తికి మూలమైన ఆల్ఫా ఎనర్జీ భూఅయస్కాంత క్షేత్రంతో ముడిపడి ఉన్నది. భూఅయస్కాంతశక్తి ఆకాశమునందలి పిండములతో సంబంధం కలిగి ఉన్నది. అందువల్ల మానవ జీవితం అంతరిక్ష ఘటనా క్రమములతోనూ, శక్తులతోనూ విలక్షణమైన సంబంధాన్ని కలిగి ఉన్నది. అంతరిక్షంలో ఉత్పన్నమయే గందరగోళం భూమిపై నివసించే మానవుల ప్రకృతిలోనూ, మనస్సులోనూ, బుద్ధిలోనూ, చేతనలోనూ మార్పులను తీసుకువచ్చి ప్రభావితం చేస్తుంది.

ఖగోళ శాస్త్రవేత్త పాస్కల్ పరిశోధనా ఫలితాలను గమనిస్తే - సూర్య చంద్రుల ప్రభావం వల్ల సముద్రాలలో ఆటుపోట్లు రావడం మాత్రమే గాకుండా జీవులలో గూడా మార్పులు వస్తాయి. జీవులన్నీ ఒక చలిస్తున్న సమిష్టి గత ఊర్జా (శక్తి) మహాసముద్రంలో నివసిస్తున్నాయని ఆయన ప్రతిపాదించారు. అటువంటప్పుడు విభిన్న గ్రహాల నుండి వచ్చే ఊర్జా ప్రభావం ఎందుకు పడదని ప్రశ్నిస్తారు. భౌతిక విజ్ఞాన క్షేత్రంలో భూమిపై కనిపించే జీవులకు, అంతరిక్షంలోని గ్రహ, నక్షత్రాలకు సంబంధం ఉన్నదని త్వరలోనే నిరూపింప బడుతుంది.

కొన్ని వేల సంవత్సరాలకు పూర్వం మహర్షులు ప్రతిపాదించిన సిద్ధాంతాలలోని సత్యాన్ని ఆధునిక విజ్ఞానం యిప్పుడిప్పుడే అవగాహన చేసుకోగలుగుతున్నది. బ్రహ్మాండమంతా ఒక చైతన్య శరీరమే. సూర్యుడు దాని ఆత్మ. అందలి ప్రతిస్పందన అన్నిటినీ ప్రభావితం చేస్తుంది. ఇందులో భూమి, అందలి జీవ జంతువులు, వృక్ష - వనస్పతులు ఉన్నాయి. ప్రాచీన కాలంలో జ్యోతిష శాస్త్రం ఈ దిశలో ప్రమాణాలను చూపింది. గ్రహాల మధ్యగల సంబంధాన్ని అంచనా వేసి, మానవ జాతికి లాభాన్ని చేకూర్చింది.

విజ్ఞానశాస్త్రం యిప్పుడు ముందంజవేసి అంతర్గ్రహ సంబంధాలను అంచనావేస్తున్నది. ఇది మెచ్చుకోదగ్గ శుభలక్షణమే. అయినప్పటికీ జ్యోతిషశాస్త్రం లేకుండా అంతరిక్షాన్ని విజ్ఞానశాస్త్రం అంచనా వేయలేదు. అంతటి సూక్ష్మశక్తిని విజ్ఞానశాస్త్రం సంతరించుకోలేదు. ఇప్పటికీ యిందుకు ప్రాచీన భారతీయ జ్ఞానమే దారి చూపగలుగుతున్నది. ఆర్యభట్టుని జ్యోతిష సిద్ధాంతాల క్రియాపద, గోళపద సూర్యసిద్ధాంతములు, దానిపై నారతీవ బహుగుప్తుని సంశోధన, పరివర్ధన, భాస్కరస్వామి రచించిన మహాభాస్కరీయము - ఈ గ్రంథాలు దుర్లభములు, అమూల్యములు. పంచ సిద్ధాంతికలో వరాహమిహిరుడు పౌలిశ, రోమక, వాశిష్ఠ, సౌర, పితామహనాయక పంచ జ్యోతిష సిద్ధాంతములను వర్ణించాడు.

తత్వవేత్తలైన మహర్షులు సూర్యుని, బ్రహ్మాండపు భౌతిక కదలికలను మాత్రమే చెప్పి ఊరుకోలేదు. వాస్తవమైన తత్వ, ఊర్జా ప్రవాహముల దైవీయ విజ్ఞానం గూడా ఉన్నది. అవి తెలిసికొని వ్యక్తి తాను ఓజస్వి కావచ్చు. ఈ రెండూ సూర్యసాధనలో తెలుపబడ్డాయి. అందలి రహస్యాలను గ్రహిస్తే ఎంతో లాభం పొందవచ్చు.

అనువాదం: డి.వి.ఎస్.బి.విశ్వనాథ్

**ఆరోగ్యకరమైన శరీరం, ఉదార హృదయం, నిర్మల మనస్సు కలిగినవాడు సంపన్నుడు.**

## ముఖచిత్ర కథనం

# గురు నానక్ ఉదారత

శిక్ సాంప్రదాయం ఆది గురువు గురు నానక్ ప్రారంభం నుండి ఎంతో ఉదారస్వభావి, దయకలిగినవాడు. ఎవరికీ కష్టం కలిగించడం తెలియనివాడు. సాధువుల సేవా సత్సంగాలలో వారికి ఎంతో ఆనందం కలిగేది. అవకాశం లభించినప్పుడల్లా వాటిని సద్వినియోగం చేసుకునేవారు. వారి ఈ గుణాలే వారిని ఒక గొప్ప మహాత్ముడుగా రూపొందించాయి. వారు తమ జీవితమంతా సన్మార్గంలో నడిచేందుకు జనులకు ప్రేరణ ఇచ్చారు.

గొప్ప జ్ఞాని, సంత్ అయిన గురు నానక్ తమ కర్తవ్యాలను ఎన్నడూ నిర్లక్ష్యం చేయలేదు. ఇవ్వబడిన ఏపనినైనా సంకోచించకుండా చేసేవారు. బాగా పంట పండించారు. కాపలా పని అప్పగిస్తే దానిని కూడా చేయటం మొదలుపెట్టారు. ఒకసారి కొన్ని ఆవులు పైరును తినసాగాయి. వాటిని మందలించారు. కాని అవి లెక్కచేయకుండా పైరును పూర్తిగా తినివేసాయి. తండ్రికి తెలిసి కోపగించారు - "నీవు ఆవులను ఎందుకు పారద్రోలలేదు?" నానక్ చెప్పారు - "నేను ఎంతో మందలించాను, అవి ఎంతో ఆకలిగా ఉన్నాయి, అందుకే నన్ను లెక్కచెయ్యలేదు." తండ్రి కోప్పడ్డాడు - "ఓరి మూర్ఖుడా! మందలిస్తే పోకపోతే, కర్రతో నాలుగు కొట్టాలి కదా." నానక్ - "నేను ఆకలితో ఉన్న ఆవులను ఎలా కొట్టగలను? పాపం, అవి తమంత తాము పండించుకోలేవు కదా! భగవంతుడు మన పొలంలో వాటికి కూడా వాటా ఇచ్చి ఉండవచ్చు." తండ్రి వదిలివేసి ఊరుకున్నాడు.

ఒకసారి నానక్ పొలం కాపలా కాస్తూ చెట్టుక్రింద విశ్రమించారు. కునుకు పట్టింది. ఆ గ్రామస్థుడు ఒకరు ఆ దారినే వెళుతున్నాడు. నిద్రిస్తున్న నానక్ తలపై ఒక పాము పడగవిప్పి ఉండటం ఆ వ్యక్తి కంటిలో పడింది. అలికిడికి ఆ పాము అక్కడి నుండి వెళ్ళిపోయింది.

ఆ వ్యక్తి ఒక విషయం విని ఉన్నాడు. ఎవరి శిరస్సు మీద పాము పడగ నీడ పడుతుందో అతడు ఎంతో అదృష్టవంతుడు, భవిష్యత్తులో గొప్ప వ్యక్తి అవుతాడు. నిదానంగా అతడు ఈ సంఘటన నానక్ తండ్రికి చెప్పి అన్నాడు - సోదరా! నీ కుమారుడితో అటువంటి, ఇటువంటి పనిచేయించవద్దు. గొప్ప నక్షత్రంలో పుట్టాడు. ప్రపంచంలో గొప్ప కీర్తి పొందుతాడు. ఏదైనా మంచి పనిలో పెట్టు.

నానక్ తండ్రి అతనికి కొంత డబ్బు ఇచ్చి అన్నాడు - నీవు గొప్ప జాతకుడి వంటున్నారు. ఏదో ఒక పని చేసి డబ్బు సంపాదించు. నువ్వు గొప్ప జాతకుడివని తెలుసుకుంటాను.

గురునానక్ డబ్బు తీసుకొని వ్యాపారం కోసం బయలుదేరారు. దారిలో మొదటగా అతనికి ఆకలితో నగ్నంగా ఉన్న యాచకులు ఎదురయ్యారు. నానక్‌కు వారి దశ చూసి ఎంతో దయ కలిగింది. వారికి భోజనం పెట్టించాడు, బట్టలు కొనిపెట్టాడు. కొద్దిగా డబ్బు మిగిలింది. అది తీసుకొని ముందుకు వెళ్తుంటే అనేక మంది సాధువులు, సత్పురుషులు ఎదురయ్యారు. వారితో సత్సంగం చేసి వారి మాటలలో, బోధనలో ఉన్న సారాన్ని పొందాడు. నానక్ చాలా కాలం వారి సత్సంగంలోనే గడిపి మిగిలిన డబ్బునంతా వారి సేవలో ఖర్చుచేశాడు. వట్టి చేతులతో ఇల్లు చేరుకున్నాడు.

తండ్రి అడిగాడు - ఏం వ్యాపారం చేశావు? లాభానికి అవకాశమున్నదా? లేదా? నానక్ ఎంతో విశ్వాసంతో సంతోషంతో సమాధానమిచ్చారు - ఎవరికీ త్వరగా దొరకనటువంటి అరుదైన, జన్మ జన్మాంతరముల వరకు లాభించే వ్యాపారము చేశాను.

తండ్రికి ఏమీ అర్థం కాలేదు. ఆయన అన్నాడు - సరిగ్గా అర్థం అయేటట్లు చెప్పు. ఏం సంపాదించావు? సంపాదించినది ఎక్కడ, అది ఇవ్వు.

నానక్ అంతా చెప్పగా విని తండ్రి హతాశుడై అన్నాడు - నువ్వు ఎటువంటి జాతకుడివిరా?

త్యాగం, సేవ అనే ఈ గుణాలు కారణంగానే నానక్ గొప్ప సాధువుగా ప్రఖ్యాతి పొందారు.

* * *

## హరిభజన చేయించి ఉంటే ....

ఒక వ్యక్తి పెద్ద భూతాన్ని ఆహ్వానిస్తాడు. అది - నన్ను ఏదో ఒక పనిలో నిమగ్న మయ్యేటట్లుగా చేస్తే బాగానే ఉంటానుగాని పని లేకపోతే నీమీద దాడి చేసి సర్వనాశనం చేస్తానని షరతు పెట్టింది. వ్యక్తి షరతుకి అంగీకరించాడు. భూతం ఇచ్చిన ప్రతి పనినీ ఇచ్చిన తక్షణమే పూర్తి చేసి క్రొత్త పనికోసం ప్రత్యక్షమయ్యేది. వ్యక్తి పనిని వెతుక్కోలేక సతమతమై, బాగా ఆలోచించి పెరట్లో ఉన్న ఒక పెద్ద స్తంభాన్ని ఎక్కి దిగుతూ ఉండమని ఆదేశించాడు. సమస్య ఆ విధంగా పరిష్కరించబడింది.

కానీ ఖాళీగా లభించిన సమయాన్ని హరిభజనలో వినియోగించేటట్లు చేస్తే భూతంలోని పైశాచిక లక్షణం నశించి అది ఉద్ధరించబడేది.

- ప్రజ్ఞాపురాణం నుండి

**అంతరిక చింతనవల్ల మనస్సు బలపడుతుంది.**

భాగవత బోధ

# కర్మఫల వ్యవస్థ తిరుగులేనిది - 2

*(గత సంచిక తరువాయి)*

స్వర్గం, నరకం అనేవి ఏమిటి? అవి వేరే లోకాల పేర్లని మనం భావిస్తాం. కానీ, నిజానికి స్వర్గం, నరకం ఈ పృథివిలోనే ఉన్నాయి. మన ఆలోచనలోనే ఉన్నాయి.

ఉత్కృష్టమైన ఆలోచనయే స్వర్గం, నికృష్టమైన ఆలోచనయే నరకం. **స్వర్గః సత్వగుణోదయః** మన ఆలోచనలో సద్గుణాలు ఉన్న సమయంలో మన హృదయంలో సత్వగుణానికి ప్రాధాన్యం ఉన్న సమయంలో మనం స్వర్గంలో నివసిస్తూ ఉంటాము. **నరకస్తమ ఉన్నా హో.** మన ఆలోచనలో దుర్గుణాలు ఉన్న సమయంలో, మన హృదయంలో తమోగుణానికి ప్రాధాన్యం ఉన్న సమయంలో మనం నరకంలో నివసిస్తూఉంటాము. మనం స్వర్గంలో నివసించాలా, నరకంలో నివసించాలా అన్నది మన కార్యవిధానంపై ఆధారపడి ఉంటుంది. అలాగే, మన సత్కర్మ సుఖం రూపంలో, మన దుష్కర్మ దుఃఖం రూపంలో మనకు లభిస్తుంది. కనుక సుఖం కావాలనుకుంటే మనం సత్కర్మలే చేయాలి. హరివంశంలో కంసవధ తర్వాత కృష్ణభగవానుడు ఉగ్రసేనునితో ఇలా చెప్పాడు - మనం చేసిన శుభ, అశుభ కర్మలే సమయం వచ్చినపుడు సుఖ దుఃఖాల రూపంలో మనముందు నిలుస్తాయి.

కనుకనే సత్కర్మ చేయవలసిందని శాస్త్రకారులూ, మహాపురుషులూ సలహా ఇచ్చారు. కానీ, ఈ రహస్యాన్ని తెలుసుకోకపోవడంవల్ల మనం ఇతరులను ప్రాధేయపడతాము. ఇతరులు కాని, ఇతర కర్మకాండలు కాని మనల్ని దుఃఖంనుండి రక్షిస్తాయని భావిస్తాం. అయితే ఇది అసాధ్యమైన విషయం. కనుక మన కర్మల ఫలితంగా లభించిన సుఖ దుఃఖాలను మనం నిబ్బరంగా అనుభవించాలి. సత్కర్మలు చేస్తూపోవాలి. దుష్కర్మలు చేయకపోతే మనం పాపరహితులం అయిపోతాం. అప్పుడు దుఃఖం కలుగుతుందనీ, నరకం లభిస్తుందనీ ఎలాంటి భయమూ మిగలదు. భాగవతంలో ప్రహ్లాదుడు తన మిత్రులైన అసుర బాలకులతో ఇలా అంటాడు - ప్రారబ్ధాన్ని అనుసరించి జీవులకు ఇంద్రియ సుఖాలు లభిస్తాయి.

ప్రారబ్ధం లేక అదృష్టం ఒక దేవత పేరు కాదు. అది మనం గతంలో చేసిన సంచిత కర్మల (కర్మల సముదాయం) పేరు. మనం ఎప్పుడూ ఇంద్రియ సుఖాలకోసం వెంపర్లాడుతూ ఉంటాం. వాటిని పొందడంకోసం మనం మన శ్రమనూ, సమయాన్నీ, మనోబలాన్నీ మొత్తాన్ని వినియోగిస్తూ ఉంటాం. అయితే మనం కోరుకున్న సుఖం మనకు లభిస్తోందా? మనం పూర్వం చేసిన కర్మలకు ఫలితాలు, ప్రయత్నం లేకుండానే మనకు లభిస్తూ ఉంటాయి. కనుక ఆ సుఖాల వేటను వదిలి మనం మన అసలు లక్ష్యంవైపు ముందుకుపోతూ ఉండాలి. మన ఈ జన్మ మన అనంత జన్మల పరంపరలో ఒక భాగం. కనుక మనం దూరదృష్టితో ఆలోచించాలి. తాత్కాలిక తృప్తిని ఇచ్చే ఇంద్రియ సుఖాల వాంఛను వదులుకోవాలి. మన భవిష్యత్తును అందంగా మలచుకునే ప్రయత్నం చేయాలి. మనం మన మిత్రులను మనవాళ్లుగా పరిగణిస్తాం. వారి కోసం పాపాలు చేస్తాం. వారంతా ఇక్కడే విడిపోతారు. మనం అనంత పథంలో యాత్రికులం. ఆ యాత్ర అంతా మనం ఒంటరిగానే సాగించవలసిఉంది. మహాభారతంలో శ్రీకృష్ణుడు యుధిష్ఠిరునితో ఇలా చెపుతాడు - జీవుడు ఒంటరిగా పుడతాడు. ఒంటరిగా చనిపోతాడు. ఒంటరిగా పుణ్య ఫలం, పాప ఫలం అనుభవిస్తాడు.

మన కుటుంబ సభ్యులు, మన సహచరులు ఎప్పుడూ మనతో ఉంటారనీ, మన పాప పుణ్యాల ఫలాలను అనుభవించడంలో మనకు తోడుగా ఉంటారనీ మనం భ్రమపడుతున్నాం. కానీ, అది సాధ్యమయే పని కాదు. మనం వారిని విడిచి వెళ్లిపోతాం, లేదా వారు మనల్ని విడిచి వెళ్లిపోతారు. బందిపోటు దొంగ రత్నాకరునికి కూడా ఇలాంటి భ్రమే కలిగింది. తన కుటుంబాన్ని సుఖపెట్టడానికి అతడు దొంగతనం చేస్తూవచ్చాడు. ఆ పాపంలో తన కుటుంబ సభ్యులు పాలు పంచుకుంటారని అతడు ఆశించాడు. నారద మహర్షి సలహామేరకు అతడు తన కుటుంబ సభ్యులను ఆ విషయం అడిగాడు. అతడి పాపాల ఫలితాలను పంచుకోవడానికి వారు అంగీకరించలేదు. అప్పుడు రత్నాకరుని భ్రమ తొలగిపోయింది. అతడు దుష్కర్మలను వదిలి సత్కర్మలను చేపట్టాడు. వాల్మీకి మహర్షిగా మారాడు. కనుక మన భ్రమలు కూడ ఎంత త్వరగా తొలగిపోతే అంత మంచిది.

కర్మఫల వ్యవస్థ ఎంతో జటిలమైనది. మనం చేసిన చిన్న చిన్న దుష్కర్మలకు కఠినమైన శిక్ష లభించవచ్చు. నృగ మహారాజు శ్రీకృష్ణునికి తన పూర్వజన్మ గురించి ఇలా తెలిపాడు - 'నేను సద్బ్రాహ్మణులకు గోదానాలు చేశాను. ఆ విధంగా పాత్రులైనవారికి కోట్లాది గోవులను దానం చేశాను. ఒక చిన్న అజాగ్రత్తవల్ల నేను ఊసరవిల్లి జన్మ ఎత్తవలసి వచ్చింది. నా పాపానికి శిక్ష అనుభవించిన తర్వాతనే నాకు విముక్తి లభించింది, తన పుణ్య కర్మలవల్ల ఆయనకు భగవంతుని దర్శనం లభించింది. ముక్తికూడా లభించింది. కానీ, ఒక చిన్న పాపానికి ఫలంకూడా ఆయన అనుభవించవలసివచ్చింది.

ఈ వ్యవస్థ ఎంత బలీయమైనది! మన ప్రయత్నం ఎంత హాస్యాస్పదం అయినది! చిన్నచిన్న కర్మకాండలు జరిపి, దాన దక్షిణలు ఇచ్చి దుష్కర్మలవల్ల వచ్చే శిక్షనుండి తప్పించుకుంటామని మనం ఆశిస్తాం. కానీ, మనకు ఆశాభంగమే మిగలడం ఖాయం.

భాగవతంలో ఒక కథ ఉంది. భగవంతుడు ఆవుగా మారి మాయాసురుని అమృత కుండాన్ని త్రాగివేశాడు. రక్షకులు దాన్ని అడ్డుకోలేకపోయారు. అప్పుడు మాయాసురుడు ఆ సంఘటన అంతటిపై తన అభిప్రాయాన్ని ఇలా వ్యక్తం చేశాడు - దేవతలైనా, అసురులైనా తమ ప్రారబ్ధం నుండి తప్పించుకోలేరు.

**కష్టాన్ని మించిన అధ్యాపకుడు లేడు.**

సూర్యునివలె స్పష్టమైన ఈ సత్యాన్ని మనం గుర్తించాలి. ఈ సత్యం వెలుగులో మన ప్రస్తుత కార్యాలనూ, భావి కార్యాలను నిర్ణయించుకోవాలి. మన భూతకాలం చేజారిపోయింది. మనం దాన్ని మార్చలేము. అయితే, మన వర్తమానం, భవిష్యత్తు మన చేతుల్లో ఉన్నాయి. గతంలో చేసిన కర్మల ఫలితాలను దేవతలుసైతం నాశనం చేయలేకపోయారు. కనుక మనం వాటిని గురించిన ఆలోచన వదులుకోవాలి. మన దుష్కర్మలవల్ల మనకు పడిన శిక్ష నుండి గుణపాఠం నేర్చుకుని, ఇకముందు సత్కర్మనే చేయాలి. ఇలా మేలుకుని పాఠం నేర్చుకోకపోతే మనం మూర్ఖులమే అవుతాం.

వాస్తవానికి మన దుర్బుద్ధియే మనల్ని నరక యాతనలకు గురిచేస్తుంది. జీవుని గర్భావస్థను వర్ణిస్తూ శ్రీకృష్ణుడు గరుడునికి ఇలా చెపుతాడు – (జీవుడు తనకు తాను ఇలా చెపుతాడు) ఓ జీవుడా! వాస్తవానికి సుఖ దుఃఖాల దాత ఎవ్వడూ లేడు. మరొకడు మనకు సుఖ దుఃఖాలను ఇస్తాడని అనుకోవడం మూర్ఖత్వం. మన పూర్వ కర్మల ఫలాన్నే మనం ఎప్పుడూ అనుభవించవలసివస్తుంది.

మన అదృష్టాన్ని నిర్మించుకునేది మనమే. కనుక, మనం ఇతరులమీద నిందవేయడం మానుకోవాలి. మన బాధ్యతను గుర్తించాలి. ఇతరుల మీద ఆధారపడడం మానుకోవాలి. మన కాళ్లమీద మనం నిలబడాలి. మన భావనలు కలుషితం అయితే, మన కర్మల వెనుక మన ప్రయోజనాలు, ఇతరులకు హాని కలిగించాలనే ప్రవృత్తి దాగి ఉంటే – మనం బయటికి ఎంత సూత్రబద్ధంగా పని చేసినా కోరుకున్న ఫలితం లభించదు. కేవలం క్రియయే సర్వస్వం కాదు. దాని వెనుక ఉన్న భావనకూ ఆలోచనకూ కూడ ప్రాధాన్యం ఉంది. సముద్ర మథనం తర్వాత దాని ఫలితాలను వ్యాఖ్యానిస్తూ శుక మహర్షి పరీక్షిత్తుతో ఇలా చెపుతారు – పరీక్షిత్తూ! చూడు. దేవతలూ, అసురులూ ఒకే సమయంలో, ఒకే స్థలంలో, ఒకే వస్తువు కోసం, ఒకే పని చేశారు. ఫలితం మాత్రం వేరుగా ఉంది. దేవతలకు సులువుగా అమృతం లభించింది. ఎందువల్లనంటే – వారు భగవానుని పాద ధూళిని ఆశ్రయించారు. దానికి విముఖులు అయినందువల్ల అసురులు శ్రమించికూడా అమృతాన్ని పొందలేకపోయారు.

**మనం ఏమి చేస్తాం అన్నదానికి విలువ తక్కువ. మనం ఏ భావంతో చేస్తాం అన్నదానికి విలువ చాలా హెచ్చు.** క్షుద్రమైన మన అహంకారాన్నీ, మనవాళ్లు అనుకునే కొందరు వ్యక్తులనూ తృప్తిపరచాలనే భావనతో, ఇతరులకు దుఃఖం కలిగించాలనే భావనతో కర్మ చేస్తే – మనం ఎన్నటికీ సాఫల్యం పొందలేము. పై వ్యాఖ్యానంలో శుక మహర్షి ఇంకా ఇలా చెప్పారు – మనిషి తన ప్రాణం, ధనం, కర్మ, మనస్సు, వాణి మున్నగు వాని ద్వారా శరీరం కోసం, పుత్రాదుల కోసం చేసేవన్నీ నిరర్థకాలు అవుతాయి. ఎందుకంటే – వాటి వెనుక భేద బుద్ధి నిలిచి ఉంటుంది. అయితే, ఆ వస్తువుల ద్వారా భగవంతుని కోసం చేసేవన్నీ భేదభావ రహితములు కావడంవల్ల తన శరీరానికీ, పుత్రులకూ, ప్రపంచం అంతటికీ సఫలం అవుతాయి. చెట్టు వ్రేళ్లకు నీరు పోయడంవల్ల దాని కొమ్మలు, రెమ్మలూ, ఆకులూ అన్నిటికీ నీరు అందుతుంది. అలాగే – భగవంతుని కోసం చేసే కర్మ అందరికీ అందుతుంది.

ఈ సృష్టి అంతటి వెనుక ఉన్నవాడు భగవంతుడే. భగవంతుని కోసం కర్మ చేయడం అంటే అర్థం అందరి శ్రేయస్సునూ కోరుతూ ఈశ్వరీయ ఆదర్శాలను దృష్టిలో ఉంచుకుని కర్మ చేయడం. కనుక మనం సంకుచిత పరిధిని దాటి విస్తృతమైన లోక కళ్యాణాన్ని దృష్టిలో ఉంచుకుని నిష్కామ కర్మ చేయాలి. మనం మన కర్తవ్య పాలనపై దృష్టిని నిలపాలి. మరెవరో సంతోషిస్తారని కాని, విచారిస్తారని కాని భావించి కర్మ చేయకూడదు.

ఈ సిద్ధాంతాన్ని అర్థం చేసుకుంటే మనం ఎంత నిర్భయంగా, నిశ్చింతగా ఉండగలుగుతాము! అప్పుడు మరొకరిని సంతృప్తిపరచడానికి వారికి అడుగులకు మడుగులు ఒత్తవలసిన అవసరం ఉండదు. కర్మ విలువను వివరిస్తూ, ఇంద్ర పూజను వ్యతిరేకిస్తూ శ్రీకృష్ణుడు నందునితో ఇలా అంటాడు – ప్రాణులమైన మన మందరం మన మన కర్మల ఫలాలను అనుభవిస్తున్నాం. కనుక మనకు ఇంద్రుని అవసరం ఏముంది? నాన్నగారూ! పూర్వ సంస్కారాలకు అనుగుణంగా మనుష్యులకు లభించే కర్మఫలాన్ని మార్చలేనపుడు, అతడివల్ల ప్రయోజనం ఏముంది? జీవుడు తన కర్మకు అనుగుణంగా ఉత్తమ జన్మలను, అధమ జన్మలను ఎత్తుతూ ఉంటాడు, వదులుతూ ఉంటాడు. తన కర్మలకు అనుగుణంగానే 'ఇతడు శత్రువు, ఇతడు మిత్రుడు, ఇతడు తటస్థుడు' అని వ్యవహరిస్తాడు. ఇంతెందుకు? కర్మయే గురువు, కర్మయే ఈశ్వరుడు.

ఎంత స్పష్టమైన ప్రతిపాదన ఇది! వ్యవస్థయే వ్యవస్థాపకుడు (వ్యవస్థ నిర్మాత) అయినపుడు – మనం వ్యవస్థాపకుని వెంట పరుగెత్తకుండా వ్యవస్థనే గౌరవించాలి, వ్యవస్థనే పాటించాలి. వ్యవస్థాపకుడు ఎక్కడో దూరంగా లేడని మనం అప్పుడు గుర్తిస్తాం. అతడి వరద హస్తం మన శిరస్సుపై ఉన్నదని గమనించగలుగుతాం. కర్మ వ్యవస్థను ఉల్లంఘించి మనం దాని వరాలకు ఆటంకం కల్పిస్తున్నాం. మనం సరైన మార్గాన్ని అనుసరించగలిగితే వరాలతో మన సంచీ నిండిపోయేదే. మనం వరాల గురించి, ఫలితాలను గురించీ తాపత్రయపడకూడదు. మనం నిష్కామ కర్మయోగం అనే రాజమార్గంలో పయనిస్తే, గమ్యం తనకు తానుగా మన వద్దకు వస్తుంది. ఇందులో ప్రత్యామ్నాయం ప్రసక్తే లేదు. ఎందుకంటే దానికి ప్రత్యామ్నాయం లేనే లేదు. పై వ్యాఖ్యానంలో శ్రీకృష్ణుడు ఇంకా ఇలా చెప్పాడు – కర్మయే సర్వస్వం అని నమ్మకుండా జీవుల కర్మలకు ఫలాన్ని ఇచ్చేవాడు ఈశ్వరుడని నమ్మినా – కర్మ చేసేవారికే దానికి అనుగుణంగా అతడు ఫలం ఇవ్వగలుగుతాడు. కర్మ చేయని వారిపై అతడి ఆధిపత్యం సాగదు.

కర్మ చేయకుండా మనం ఒక్క క్షణమైనా ఉండలేము. నహి కశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్ అకర్మకృత్ – అని భగవద్గీత చెపుతోంది. మనం సత్కర్మ చేయకపోతే దుష్కర్మ చేస్తాం. కనుక జాగరూకతతో, మెలకువతో క్షణక్షణం ఆత్మపరీక్ష చేసుకుంటూ మనం బంధనం కలిగించని కర్మ చేయాలి. మనం ఆత్మవికాసం పొందుతూ నిష్కామ కర్మయోగాన్ని నిరంతరం అభ్యాసం చేయాలి. అలా చేస్తే, జీవాత్మ ఎంతో విలువైన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తన లక్ష్యాన్ని చేరుకుంటుంది. రండి, సాహసంతో ఈ సత్యాన్ని జీర్ణం చేసుకోండి. జీవితాన్ని సార్థకం చేసుకోండి.

– సమాప్తం –

**ఆపదలు మన వివేకానికీ, పురుషార్థానికీ సవాళ్లు.**

## బోధకథ

# అహంకారం ఒక మురికి కూపం

అనుభవంతో పండిన తీయని పలుకులు శ్రోతల భావనలను ఉఃత్రూతలూగిస్తున్నాయి. శ్రావస్తి నగర ప్రజలు, పరిసర గ్రామాల ప్రజలు తాము ధన్యులు అయినామని సంతోషిస్తున్నారు. బుద్ధ భగవానుని శిష్యులు సారిపుత్ర, మౌద్గల్లాయన్‌ల వచనామృతం వారి ఆంతరిక చేతనలను ఏవో లోకాలలోకి కొనిపోతోంది. బుద్ధ భగవానుడు ఈ సమయంలో శ్రావస్తి నగరంలో ఉన్నారు. భిక్షు సంఘం సభ్యులు సూర్య కిరణాలవలె ఆయన ప్రభను నలుగడలా వ్యాప్తి చేస్తున్నారు. బుద్ధ భగవానుని రాకతో శ్రావస్తి నగరం ఒక వెలుగుల వెల్లువగా భాసించింది.

ఆ భిక్షు సంఘ సభ్యులలో సారిపుత్ర, మౌద్గల్లాయన్‌ల భావ దశ అపూర్వమైనది. వారిద్దరూ బుద్ధ భగవానునికి తమను తాము సంపూర్ణంగా సమర్పించుకున్నవారు. నగర ప్రజలు, పరిసర గ్రామాల ప్రజలు వారిని ప్రశంసిస్తున్నారు. వారి వాణిలోని మాధుర్యం అపూర్వం. వారి బోధన అపూర్వం. వారి సమాధి అపూర్వం. వారి వచనాలు అందరికీ మేలుకొలుపులుగా పని చేస్తున్నాయి. అవి నిద్రిస్తున్నవారిని మేలుకొలుపుతున్నాయి, మృతులకు ప్రాణం పోస్తున్నాయి. వారి దగ్గర కూర్చోవడం అమృత సరోవరంలో మునకలువేయడమే. కనుక - అందరూ వారిపై ప్రశంసలు కురిపించడం సహజమే.

ఈ ప్రశంసల వర్షం జిజ్ఞాసువులకు ఆనందం కలిగిస్తోంది. కానీ, లాలుదాయికి ఆ వర్షపు జల్లులు ములుకులవలె, ముళ్లవలె గుచ్చుకుంటున్నాయి. అతడు వాటిని సహించలేకపోతున్నాడు. అసూయ అతడి మనస్సును దహించివేస్తోంది. తనలో లేనిదీ, ఆ ఇద్దరిలో ఉన్నదీ ఏమిటని అతడి మనస్సు ప్రశ్నిస్తోంది. తాను వారికన్న తీవ్రమైన స్వరంతో ప్రసంగించగలడు. తనకున్న జ్ఞానం తక్కువదేమీ కాదు. ఈ ఆలోచనలతో అసూయ అతడిని కలచివేసింది. అతడి మనస్సు వికలం అయింది. అసూయ అనే పొర అతడికి సత్యం కనబడకుండా చేసింది.

ఇలా అసూయ విజృంభించడంతో, అతడిలో అహంకారం పడగ విప్పి బుసలు కొట్టసాగింది. అతడి మనసు నుండి క్రోధం అనే విషం పొగలు క్రక్కుతూ వెలికి రాసాగింది. మరొకరు తనకన్న తెలివికలవారని అతడు ఎన్నడూ అంగీకరించలేదు. అతడు బుద్ధ భగవానుని చరణాలకు వంగి నమస్కరిస్తున్నాడు. అయితే అదంతా నటన. బుద్ధ భగవానుడు తనకన్న గొప్పవాడని అతడి మనసు ఒప్పుకోదు. అతడి అహంకారం నిప్పులు చెరగుతోంది. అవకాశం దొరికినప్పుడు బుద్ధ భగవానుని సైతం పరోక్షంగా విమర్శించడానికి అతడు వెనుదీయలేదు. ఇవాళ భగవానుడు చెప్పినది సరిగా లేదని, ఆయన అలా చెప్పకుండా ఉండవలసిందనీ ఒకోసారి అనేవాడు. భగవంతుడు అయిఉండి ఆయన అలా మాట్లాడకూడదని ఒకోసారి అనేవాడు.

తన సద్గురువునే విమర్శించే లాలుదాయి తోడి శిష్యులపై కురుస్తూన్న ప్రశంసలను ఎలా సహించగలడు. ఒక రోజున అతడు ఒక స్థలానికి వెళ్లాడు. అక్కడ ప్రజలు సారిపుత్ర, మౌద్గల్లాయన్‌లను పొగడుతున్నారు. లాలుదాయి తీవ్ర స్వరంతో ఆ ప్రజలను ఇలా మందలించాడు - "ఇలాంటి చెత్త వాగుడు కట్టిపెట్టండి. ఈ సారిపుత్ర, మౌద్గల్లాయన్‌లు పొడిచేసింది ఏమిటి? ధర్మంలోని అసలు తత్వాన్ని గ్రహించలేని మీరు కంకర రాళ్లను చూచి రత్నాలని భ్రమపడుతున్నారు. రాళ్లకు విలువ కట్టాలంటే వజ్ర పరీక్షకులు రావాలి. నగలను విలువ కట్టాలంటే నగల వ్యాపారిని పిలవండి. నన్ను అడగండి. మీరు పొగడ దలుచుకుంటే నా ధర్మోపదేశాన్ని పొగడండి."

లాలుదాయి గొంతు పెద్దది. ఆ స్వరంలో తీవ్రత ఉన్నది. ఇవి ఆ ప్రజలను ప్రభావితం చేశాయి. అతడు సమాధి స్థితిని సాధించిన గొప్పవ్యక్తి ఏమోనని వారికి అనిపించింది. ధర్మోపదేశం ఇవ్వమని వారంతా అతడిని ప్రార్థించారు. అయినా అతడు ఏదో సాకు చెప్పి తప్పించుకుంటూ వచ్చాడు. అతడు ఇలా అనేవాడు - "తగు సమయంలో, తగు సందర్భం వచ్చినప్పుడు మాట్లాడతాను. జ్ఞానులు ప్రతివాడికీ ఉపదేశం ఇవ్వరు. వినేవాళ్లు ఉండాలి. అమృతాన్ని అర్హతను చూడకుండా అందరికీ పంచడం జరుగదు."

ఇవన్నీ తెలివైన మాటలే. ప్రజలు మరింతగా ప్రభావితులు అయ్యారు. తన ప్రభావాన్ని పెంచుకోడానికి అతడు ఇలా అన్నాడు - "జ్ఞాని మౌనంగా ఉంటాడు. మాట్లాడేవాడు తెలిసినవాడు కాదని శాస్త్రం చెపుతోంది. ఆ సంగతి మీకు తెలియదా? మహాజ్ఞాని అసలు మాట్లాడతాడా?" ప్రజలలో అతడి పలుకుబడి మరింతగా పెరిగింది. వారిలో నిజంగానే ఉత్సుకత ఏర్పడింది. ఈలోగా లాలుదాయి తన ప్రవచనాన్ని తయారు చేసుకున్నాడు.

ప్రవచనాన్ని పూర్తిగా బట్టీ పట్టిన తర్వాత, అతడు ఒక రోజున ధర్మాసనంపై కూర్చున్నాడు. నగర ప్రజలు, పరిసర గ్రామాల ప్రజలు ఆయన ప్రవచనం వినడానికి గుమిగూడారు. లాలుదాయి ఉపన్యసించడానికి మూడు సార్లు ప్రయత్నించాడు. కానీ, నోటినుంచి మాట ఊడిపడ లేదు. ఉపాసకులారా! అన్న సంబోధన మాత్రమే నోటినుండి వెలువడుతోంది. ఆతర్వాత మాట పెగలడం లేదు. పలుమారులు గొంతు సవరించుకున్నాడు. కానీ, గొంతులోని మాట వెలికి రాలేదు. ఏదో అడ్డుపడుతోంది. ఏమీ పాలుపోవడం లేదు. చెమటలు కారిపోతున్నాయి. నాలుగోసారి ప్రయత్నించినప్పుడు

**ప్రగతి అనే గూడు చిన్నచిన్న అలవాట్ల గడ్డిపరకలతో నేయబడుతుంది.**

ఉపాసకులారా! అన్న మాటకూడ నోటిలోనే ఉండిపోయింది. అతడి తెలివి తెల్లారిపోయింది. బట్టీ పట్టిన మాటలను గుర్తు చేసుకోవడానికి విశ్వ ప్రయత్నం చేశాడు. ప్రయోజనం లేకపోయింది. కాళ్లూ చేతులూ వణుకుతున్నాయి. ఎక్కిళ్లు వస్తున్నాయి. ప్రజలందరిముందూ తన బండారం బయటపడింది.

లాలుదాయి వేదిక దిగి పారిపోయాడు. జనం అతడిని వెంబడించారు. అతడు సారిపుత్ర, మౌద్గల్లాయన్‌ల ప్రశంస సహించలేకపోయాడనే విషయం అందరికీ తెలిసిపోయింది. బుద్ధ భగవానుణ్ణి సైతం విమర్శిస్తాడనీ, కానీ అతడి దగ్గర సరకు లేదనీ ప్రజలు గుర్తించారు. ప్రజల ఆగ్రహానికి గాబరాపడి పారిపోతున్న లాలుదాయి మల మూత్రాలతో నిండిన ఒక గుంటలో పడిపోయాడు. ఆ మురికి అతడి ఒంటికి అంటుకుంది. అతడి అవస్థ చూచి నవ్వుకుని ప్రజలు తమతమ ఇండ్లకు తిరిగివెళ్లారు.

ఈ వార్త బుద్ధ భగవానునికి అందింది. అపుడాయన ఈ సూక్తులు వినిపించారు -

**అసంజ్ఞాయమలా మంతా అనుట్ఠానమల ఘరా ।**
**మలం వణ్ణస్స కోసజ్జం పమాదో రక్షతో మాలా ॥**
**తతో మలా మలతరం అవిజ్జా పరమం మలం ।**
**ఏతం మలం పహత్వాన్ నిమ్మలా హోథ భిక్ఖవే ॥**

అనగా -

స్వాధ్యాయం చేయకపోవడం మంత్రాల మురికి. ఉద్యుక్తపోవడం ఇంటికి మురికి. సోమరితనం సౌందర్యానికి మురికి. ప్రమత్తత కాపలాదారుకు మురికి. అన్నింటినీ మించినది అవిద్య అనే పరమ మురికి. భిక్షువులారా! ఇన్ని రకాల మురికిని వదులుకొని నిర్మలులు కండి.

ఈ సూక్తిలోని అంతరార్థాన్ని వివరిస్తూ బుద్ధ భగవానుడు ఇలా అన్నారు - "భిక్షువులారా! ఈ లాలుదాయి జన్మ జన్మలుగా ఇలాంటి మురికిలో పొర్లాడుతూ వచ్చాడు. భిక్షువులారా! అహంకారం బురద, మురికి. భిక్షువులారా! మిడిమిడి జ్ఞానం ప్రమాదకరం. వట్టి శబ్ద జ్ఞానం ప్రమాదకరం. అనుభవం లోపించిన శాస్త్రజ్ఞానం ప్రమాదకరం. ఈ లాలుదాయి కొన్ని మాటలు వల్లెవేశాడు. కానీ, అనుభవం లోపించినప్పుడు వట్టి మాటలు బంధనాలు అవుతాయి. ఈ లాలుదాయి ధర్మానికి సంబంధించిన కొన్ని మాటలు విన్న మాట నిజమే. కానీ, ఇతడు సక్రమంగా స్వాధ్యాయం జరుపలేదు. ఇతడు ధర్మం గురించి శ్రద్ధగా విని ఉంటే, ఇతడికి ఇలాంటి దురవస్థ కలిగేది కాదు."

భగవానుడు గంభీరుడై ఇలా అన్నారు - "మీరంతా అతడి దురవస్థ నుండి గుణపాఠం నేర్చుకోండి. విమర్శించడం సులువు. ఆత్మజ్ఞానాన్ని పొందడం కష్టం. అహంకారం పోటీ తత్వాన్ని మేలుకొలుపుతుంది. ఈ పోటీవల్ల అసూయ జనిస్తుంది. అసూయవల్ల ద్వేషం, శత్రుత్వం నిర్మాణం అవుతాయి. అలాంటి స్థితిలో అంతర్ బోధ ఎలా మేలుకుంటుంది? కనుక - పరనిందను పరిహరించండి. ఇతరులను గురించి ఆలోచించకండి. ఉన్న సమయం కొద్దిపాటిదే. మిమ్మల్ని మీరు నిర్మించుకోండి. లేని పక్షంలో - మీరు మళ్లీ మళ్లీ మురికి గుంటలో పడిపోతూ ఉంటారు. భిక్షువులారా! మీరే ఆలోచించండి. మళ్లీ మళ్లీ గర్భంలో పడడం మల మూత్రాల గోతిలో పడడం తప్ప మరేమిటి?

✷ ✷ ✷

## ఆశ్రమం ఏదయినా...

ఒక గృహస్థు సన్యాస ధర్మాన్ని స్వీకరించి ఒక కుటీరాన్ని నిర్మించుకొని గంగ ఒడ్డున నివసించసాగేడు. సదా సాధు సత్పురుషుల సంపర్కం లభించేది. ఒకరోజున ఇద్దరు సాధువుల మధ్య దాన దక్షిణలలో పది పైసలు తేడా రావటం వలన అభిప్రాయభేదం ఏర్పడి వివాదం పెరిగి వారు తలలు పగులకొట్టుకోవటం ఈయన కంటపడింది. ఇలాగే మరొకరోజు ఈయన నిత్యం వింటున్న ప్రసంగం ఇకపైన సాగదని, తాను మహాత్ముడుగా భావిస్తున్న ఆ ఉపన్యాసకుడు ఒక స్త్రీని లేవదీసుకొని రావటం వలన పోలీసులు ఆయన్ని అరెస్టుచేసి తీసికొని వెళ్లారనే విషయం కూడ ఈయన చెవిన పడింది. ఈ విధంగా సాధువుల అనేక కుకర్మలు చూచి ఆయన విరక్తి చెంది ఇటువంటి సన్యాసాశ్రమం కంటె గృహస్థ ధర్మం ఎంతో గొప్పదని నిశ్చయించుకొని ఇంటికి తిరిగి వెళ్లిపోయాడు.

కొందరు ఇది తప్పని అన్నా, కొందరు ఇది ఒప్పని అన్నా ఇతడు ఏదీ పట్టించుకోలేదు. గృహస్థాశ్రమంలోనే ఉంటూ సన్యాసిగా జీవయాత్ర సాగించ నారంభించాడు. ఇంటింటికి వెళ్లి గుప్పెడు బియ్యం చొప్పున ప్రోగుచేసి కేవలం ఆ ఆదాయంతోటే 20 పాఠశాలలు నిర్మించాడు. ధర్మాన్ని రక్షిస్తూ, ధర్మబద్ధమైన జీవితం గడపడానికి ఆశ్రమం ఏది స్వీకరించినా తప్పు లేదు. ఏదో గొప్పగా భావించి సన్యాసి ఆశ్రమమే కావాలని ప్రాకులాడకండి. సేవచేస్తూ పవిత్రంగా గృహస్థాశ్రమంలో ఉండటం ఎంతో ఉత్కృష్టమైన స్థితి. ఈ విధంగా అందరిలో అంతరాత్మ ప్రబోధం జరగాలి.

- ప్రజ్ఞాపురాణం నుండి

**నిజమైన ప్రయత్నం ఎన్నడూ విఫలం కాదు.**

## యుగగీత

# ముక్త పురుషునికి ఉజ్వల ఉదాహరణ పరమపూజ్య గురుదేవులు

*(గత సంచిక తరువాయి)*

కర్మ ఎలా యజ్ఞమయం అవుతుందో 24వ శ్లోకంలో తెలుస్తుంది.

**బ్రహ్మార్పణం బ్రహ్మహవిర్ బ్రహ్మాగ్నౌ బ్రహ్మణా హుతమ్ ॥**
**బ్రహ్మైవ తేన గంతవ్యం బ్రహ్మకర్మ సమాధినా ॥**

అనగా - బ్రహ్మ అనే అగ్నిలో బ్రహ్మ అనే కర్త ఆహుతి ఇవ్వడం కూడా బ్రహ్మయే. ఎందుకంటే - దానిలో అర్పణలు స్రువ మొదలైనవి కూడ బ్రహ్మయే. హవనం చేయబడే ద్రవ్యాలు కూడ బ్రహ్మయే. ఈ విధంగా కర్మలో బ్రహ్మను దర్శించడం వల్ల పొందేదికూడ బ్రహ్మనే.

భారతీయ గృహాలలో భోజనానికి ముందు ఈ శ్లోకంతో ప్రభువును స్మరిస్తారు. బ్రహ్మార్పణం అంటే అర్థం అది తప్ప మరేదీ లేదని. అంతా శిఖరాగ్రమైన ఈ పరమాత్మ కోసమే ఉండాలి. ఇస్తున్నదీ, ఇవ్వడంలోని ఉద్దేశ్యం, ఆహుతి ఎందులో ఇవ్వబడుతున్నదో, ఇచ్చే వ్యక్తి - అన్నీ అదే. బ్రహ్మలోని అంశ అదే. దివ్య కర్మ చేసే వ్యక్తి మనోదశ ఇలా ఉండాలి. అలాంటి స్థితిలో ద్వైత భావనయే ఉండదు.

యద్ ద్వైత తద్ భయం - రెండవ వ్యక్తి వస్తే భయం వచ్చినట్లే. కర్మయోగంలో రెండవది ఉండకూడదు. బంగారం ఒక్కటే. ఆ బంగారంతోనే ఉంగరాలు, గాజులు, బాజాబందులు తయారవుతాయి. అంతా బ్రహ్మకర్మ అనే తాత్విక దృష్టి అలవడాలి. అప్పుడే మనకు కర్మయోగ సమాధి లభిస్తుంది.

స్వామి వివేకానంద సిద్ధి పొందిన తర్వాత రామకృష్ణ మఠం పనిని ఎలా కొనసాగించాలన్న సమస్య ఆయన సహచర స్వాములకు ఎదురయింది. శ్రీమతి ఓవీ బుల్ ఇచ్చిన దానంతో భూమి కొనుగోలు జరిగింది. మఠం నమూనా తయారయింది. ఇక నిర్మాణం జరుగవలసి ఉంది. రామకృష్ణ మిషన్ ప్రధాన కార్యదర్శి బాధ్యతను స్వామి శారదానందజీ స్వీకరించారు. ఆయన 'రామకృష్ణ లీలా ప్రసంగ' గ్రంథాన్ని వ్రాయడం ప్రారంభించారు. దాని భాగాల ప్రచురణ జరుగుతూ వచ్చింది. ఆ గ్రంథం ప్రజలలోకి వెళ్లింది. ధనం అందసాగింది. ఆయన రోజంతా వ్రాసేవారు. అలా వ్రాస్తూఉండగా ఆయన మోకాళ్లలో విపరీతమైన నొప్పి ప్రారంభమయింది. అయినా, తాను సమాధి స్థితిలో వ్రాస్తున్నట్లు ఆయనకు అనిపించింది. మోకాళ్లు బిగుసుకుపోయాయి. అయినా ఆయన వ్రాయడం ఆపలేదు. ఆయన ఇలా వ్రాస్తారు - "ఆ సమయంలో నేను సమాధి స్థితిలో జీవించాను." కర్మలో ఏకాగ్రత, మానసిక కేంద్రీకరణ, భక్తి ఏకమయితే సమాధి స్థితిలోని ఆనందం లభిస్తుంది. 24వ శ్లోకంలోని భావం ఇదే. స్వామి శారదానందజీ జరిపిన వ్రాయడం అనే యజ్ఞకర్మ రామకృష్ణమిషన్ భవన నిర్మాణానికి పునాది అయింది. రామకృష్ణ లీలామృతం, వచనామృతం, కథామృతం ప్రజలకు అందాయి. ఆ గ్రంథాల ద్వారా 110-120 సంవత్సరాలకు ముందు జరిగిన సంఘటనలన్నీ మనకు తెలిశాయి. ఒక క్రొత్త చరిత్ర రచించబడింది.

ఇలాంటిదే మరో సంఘటన. రామకృష్ణ మిషన్ అగ్రనాయకులు స్వామి విజ్ఞానానందజీ (శ్రీ హరి ప్రసన్న చటర్జీ) వాల్మీకి రామాయణాన్ని ఆంగ్లభాషలోకి అనువదించారు. ఆ రచన చేస్తున్న సమయంలో రాముడు, సీతా తన ఎదుట కూర్చొని ఉన్నట్లు తనకు అనుభూతి కలిగిందని ఆయన వ్రాశారు. భావనలో, ఈశ్వర ప్రేమలో మునిగి కర్మ చేయడం అన్నింటినీ మించిన పని. అదే యజ్ఞ కర్మ. ప్రేమలో, శ్రద్ధలో మునిగిపోయి తన్మయత్వంతో చేసే ప్రతిపనీ యజ్ఞం అవుతుంది.

ఈ శ్లోకంలో 'బ్రహ్మకర్మ సమాధిన' అనే పదం ఉంది. సమాధి మూడు విధములు - యోగ సమాధి, జ్ఞాన సమాధి, కర్మ సమాధి. యోగ సమాధి పతంజలి యోగశాస్త్రం ప్రకారం యోగం సర్వోన్నత స్థితి. జ్ఞానం సర్వోన్నత స్థితి జ్ఞాన సమాధి. కర్మ చేస్తూ చేస్తూ అకర్మను పొందడం, బ్రహ్మను పొందడం, బ్రాహ్మీ స్థితిని చేరడం కర్మ సమాధి. అన్నింటినీ పరమాత్మకు సమర్పించడం, హవిస్సు, అగ్ని, ఆహుతి, యజ్ఞం అన్నీ పరమాత్మమయం కావడం, యజ్ఞ భావంతో జరగడం - ఇదే కర్మ సమాధి.

యజ్ఞంలోని బాహ్య అనుష్ఠానం జీవితపు అంతరాంతరాలలో జరిగే ప్రక్రియలకు బాహ్యమైన రూపం మాత్రమే. స్వామి చిన్మయానందజీ ప్రస్తుత శ్లోకాన్ని వ్యాఖ్యానిస్తూ ఇలా అన్నారు - "మన లోపల చైతన్యం అనే అగ్ని దేదీప్యమానంగా వెలిగినపుడు మన జ్ఞానేంద్రియాలు చుట్టుప్రక్కల ఉన్న ప్రాపంచిక విషయాలను తెలుసుకుని మనస్సు అనే కుండంలో వాటిని ఆహుతి చేస్తాయి. మన సమస్త కార్యాలనూ మనలో ఉన్న పరమాత్మకు సమర్పణ చేయడమే యజ్ఞ భావంతో కర్మలను సక్రమంగా వినియోగించడం."

అన్ని కర్మలలో బ్రహ్మను, జగదీశ్వరుని, ఆయన క్రీడా విలాసాన్ని దర్శించడం విలక్షణమైన ఒక అనుభూతి. మనం మన

**నిశ్చయాత్మక ప్రవృత్తి కలిగినవానికే సాఫల్యం లభిస్తుంది.**

లోపలా బయటా జరుగుతూన్న సంఘటనలలోనికి ప్రభువును నిరంతరం ఆహ్వానించాలి. ఆ అనుభూతి పొందాలి. మన దైనిందిన కార్యకలాపాలన్నింటిలో దివ్యత్వాన్ని నింపాలి. మనం ఏ క్షణంలోనూ విశ్రాంతి తీసుకోకూడదు. ప్రతి క్షణం భక్తిమయం కావాలి, పరమాత్మమయం కావాలి. ఇలా ప్రతిక్షణమూ సమర్పణ భావంతో గడపడం మన దేవ సంస్కృతిలోని ఒక విలక్షణ విషయం. వ్యక్తి దివ్య జాగరూకతతో కూడిన ఇలాంటి వాతావరణంలో ఉన్నప్పుడు అతడు చేసే పనులన్నీ, మామూలుగా కనిపించే రోజువారీ పనులు సైతం, అతడికి తెలియకుండానే పరిపూర్ణ సమర్పణగా పరిణమిస్తాయి. "సర్వం ఖల్విదం బ్రహ్మ." నిరంతరం బ్రహ్మను గురించి ఆలోచించడం వల్ల బ్రహ్మదర్శనం జరుగుతుంది. రామకృష్ణ శివాశ్రమానికి చెందిన స్వామి అపూర్వానంద ఇలా వ్రాశారు - "రామకృష్ణ పరమహంస శ్రీకృష్ణ సాధన జరిపే సమయంలో ఆరునెలలపాటు అంతటా శ్రీకృష్ణుడినే దర్శించారు. కాళీ మందిరంలో పూజ చేస్తూన్నపుడు ఆయనకు అంతా చైతన్యమయంగా కానవచ్చేది. మందిరమూ చిన్మయమే, దేవీ చిన్మయమే."

కర్మలను యజ్ఞ పురుషునికి సమర్పణ చేయాలి. కర్మ సన్యాసం అంటే కర్మలను బ్రహ్మకు అర్పించడమే. అయిదవ అధ్యాయం, 10వ శ్లోకంలో ఇదే విషయాన్ని "బ్రహ్మణ్యాధాయ కర్మణి" అని వర్ణించారు. అనగా - ఆసక్తి లేకుండా కర్మలను బ్రహ్మకు అర్పించడం. అలా అర్పించే వ్యక్తికి పాపం అంటదు. తామరాకు మీద నీటి బొట్టు అంటని విధంగా. బ్రహ్మలో కలియడంవల్లనే ముక్తి లభిస్తుంది. శ్రద్ధలో, ఆసక్తిలేని ప్రేమలో మునిగి సమర్పణ భావంతో చేసే కర్మద్వారానే ముక్తి లభిస్తుంది. ఎందుకంటే - దానివల్ల ప్రతి పనీ యజ్ఞమయం అవుతుంది.

పరమపూజ్య గురుదేవులు ఇదే చేశారు. ఇలాగే జీవించారు. ఆయన రచనా సాధనకూడా యజ్ఞ కర్మ సమాధియే. వారు 'అఖండ జ్యోతి' లో ఇలా వ్రాశారు - "మనిషి తాను ప్రేమించినవాటి సుఖం కోసం, శ్రేయస్సుకోసం గొప్ప గొప్ప త్యాగాలు చేయడానికి సిద్ధపడతాడు. తన శరీరం, మనస్సు, అంతఃకరణ, భౌతిక సాధనాలు అన్నింటిలో అత్యధిక భాగాన్ని సమాజ సేవకు, సంస్కృతి సేవకు అంకితం చేయడానికి ఏమాత్రం వెనుకాడడు. తన వద్ద ఉన్న దానిని తనకు నచ్చిన ఆదర్శాలకోసం ధారపోయడంలో ఎలాంటి ప్రాపంచిక ప్రలోభమూ అతడికి అడ్డు రాదు. ఇతరులు తాము చేసిన చిన్న చిన్న సేవలను గురించి మాటి మాటికీ ప్రస్తావిస్తారు. వాటికి ప్రతిఫలం అందలేదని ఫిర్యాదు చేస్తారు. మనం ఇలా ఆలోచించడం జరగని పని. ఎందుకంటే - స్వాంతః సుఖాయ, అనగా ఆత్మతృప్తి కోసమే మానవ సేవ చేయాలి. తమ ప్రత్యేకతను ప్రదర్శించుకోవడానికి చేయకూడదు. మానవసేవకు ప్రతిఫలం ఆత్మసంతృప్తి రూపంలో వెంటనే లభించినప్పుడు, మరోదాన్ని కోర నవసరం లేదు." ('ప్రేమ్‌సాధన ఔర్ ఉసకీ పరిణతి' - అఖండ జ్యోతి మే 1969).

పరమపూజ్య గురుదేవులు బ్రహ్మకు అర్పించబడిన కర్మకు, ఉపాసనకోసం చేసే కర్మకు సేవా సాధన, లోక ఆరాధన అనే రూపం ఇచ్చారు. తద్వారా గాయత్రీ పరివార్ అనే మహా సంస్థను నిర్మాణం చేశారు. తమ స్వంత ఉపాసనకు ఒక విరాట్ రూపాన్ని ఇచ్చారు. పరమార్థంలోనే నిజమైన స్వార్థం ఉన్నదని చెప్పారు. సమష్టిలో ఉన్న బ్రహ్మకు అర్పించబడే ప్రతి పనీ బ్రహ్మార్పణ - బ్రహ్మకర్మ సమాధి స్థితికి వ్యక్తిని తీసుకువెళుతుంది. విప్లవాత్మక దృక్పథంతో వారిలా వ్రాశారు - "ప్రతి యుగంలో ఎగుడు దిగుడులు ఉంటూ ఉంటాయి. అయితే వాటి పాప పుణ్యాల బరువు ఆనాటి ప్రతిభామూర్తులలో అగ్రగణ్యులపై పడుతుంది. వారి ముందు నడక ఎందరెందరికో ఊపిరి పోస్తుంది. వారు పతనం చెందితే - అందరూ కుప్పకూలిపోతారు. కాళ్లు ముడుచుకుని కూర్చునేవారు శాంతిప్రియులూ కారు, నిరపేక్ష వ్యక్తులూ కారు, అనాసక్తులూ కారు. అవసర సమయంలో ముఖం చాటు చేసుకోవడానికి శాంతి, భజన, బ్రహ్మజ్ఞానాల ముసుగు కప్పుకునేవారు తమను తాము ఏదోవిధంగా సరిపుచ్చుకోవచ్చు. ఆపద సమయపు యాతనలు మాత్రం వారిని క్షమించవు. దుర్ఘటనలు, మహమ్మారులు, అగ్ని ప్రమాదాలు, ఆక్రమణలు, పరపీడనలతో ప్రజలు హాహాకారాలు చేస్తున్న దారుణ పరిస్థితులలో ఏకాంత సాధన గురించి ఆలోచించే వ్యక్తిని బ్రహ్మజ్ఞాని అని ఎవరంటారు? పాషాణ హృదయుడని తప్ప మరోపేరుతో అతడిని పిలువ కూడదు. (అఖండ జ్యోతి, ఏప్రిల్ 1982)

ఈ 24వ శ్లోకంలోని అంతరార్థాన్ని తెలుసుకోవాలంటే - కర్మలో బ్రహ్మను దర్శించే యోగి అయిన పరమపూజ్య గురుదేవుల "ఆత్మకథ"ను చదవాలి. ఎవరి జీవితం యావత్తూ యజ్ఞమయం అయిందో, ఎవరి ప్రతి శ్వాసా సంస్కృతికి సమర్పించబడిందో, ఎవరి జీవితం యావత్తు కోట్లాది వ్యక్తులను సమష్టి కోసం జరిగే కర్మలలో నిమగ్నులను చేసిందో - ఆ గురుదేవుల జీవన దర్శనంలో ఈ శ్లోకం స్వరం ప్రతిధ్వనిస్తుంది. ఆ స్వర లహరిలో సాక్షాత్తు శ్రీకృష్ణుడే కానవస్తాడు. భగవానుని శక్తియే ప్రకృతిలోకి వచ్చి దివ్య కర్మలు చేస్తుంది. అలాంటి కర్మలు మాత్రమే ముక్త పురుషుని కర్మలు అవుతాయి, సిద్ధ కర్మయోగి కర్మలు అవుతాయి. ఈ కర్మలు ఆత్మలో ఉదయిస్తాయి. ఆత్మకు ఎలాంటి వికారమూ కలిగించకుండా ఆ కర్మలు నశిస్తాయి.

* * *

*(తరువాయి వచ్చే సంచికలో)*

**విప్లవాలు ఆయుధాల ద్వారా కాక ఆదర్శాల ద్వారా వస్తాయి.**

# కృష్ణావతారం-12

# సాందీపని ఆశ్రమంలో విద్యాభ్యాసం

**త్వాం బ్రహ్మ కే చిదవయన్త్యుత ధర్మమేక**
**ఏకే పరం సదసతోః పురుషం పరేశమ్ ।**
**అన్యేఽవయన్తి నవశక్తియుతం పరం త్వాం**
**కేచిన్మహా పురుష మవ్యయమాత్మతన్త్రమ్ ॥**

దేవా! కొందరు నిన్ను బ్రహ్మయనియు, కొందరు ధర్మమనియు, కొందరు ప్రకృతి పురుషులకంటె పరమైన పరమేశ్వరుడవనియు, కొందరు నిన్ను (విమల, ఉత్కర్షిణి, జ్ఞానము, క్రియ, యోగము, ప్రహ్వి, సత్యము, ఈశానము, అనుగ్రహము అను) తొమ్మిది శక్తులతో గూడిన మాయాశక్తికి పరమైన వాడవనియు, క్లేశము కర్మ మున్నగు బంధనములు లేనివాడవనియు, పూర్వజులకు పూర్వజుడవనియు, నాశరహితుడవనియు, స్వతంత్రమైన మహాపురుషుడవనియు విశేషముగ తలంచుచున్నారు.

1. ఒకే తత్త్వము వేరువేరు నామములతో తెలిసికొన బడును. నామరూపముల వివాదమున పడక సారమును గ్రహింపవలెను.

కంసుని సంహరించి ఉగ్రసేనుని రాజుగా జేసి కృష్ణ బలరాములు నందుని కడకు వెడలి ఆయన పాదములకు ప్రణమిల్లి ఇట్లు పలికిరి - తండ్రిగారూ! మీకు గోపాలురతో కలసి వ్రజమునకు వెళ్ళుడు. తల్లికి ఇతర బంధువులకు మా నమస్కారములను చెప్పుడు. మాకు మీరు చేసిన ఉపకారమునకు ప్రత్యుపకారమును ఎప్పుడును చేయజాలము. ఆపదలో మీరు మమ్ము పెంచి పోషించి నిజమైన తల్లి దండ్రుల పాత్ర నిర్వహించిరి.

**స పితా సా చ జననీ యౌ పుష్ణీతాం స్వపుత్రవత్ ।**
**శిశూన్ బన్ధుభిరుత్సృష్టా న కల్పైః పోషరక్షణే ॥**

తండ్రిమున్నగు ఆత్మీయులు శిశువులను పోషించుట యందు, రక్షించుటయందు అసమర్థులై వదలినచో ఆ శిశువులను తమ పుత్రులవలె ఆత్మీయతతో పోషించినవారే నిజమైన తల్లిదండ్రులుగ పరిగణింపబడుదురు.

1. సత్పురుషులు తమవారు పరులు అను భేదభావమును కలిగియుండరు, అందరిని సమానముగ ప్రేమింతురు. పిల్లలను పెంచి పోషించి వారికి తగిన సంస్కారము నొసంగువారే తల్లిదండ్రులనెడు గౌరవమును పొందగలుగుదురు, కాని జన్మనిచ్చుటవలన మాత్రము పొందలేరు.

ఇట్లు కృష్ణ బలరాములు నందుని ఇతర గోపాలురను సగౌరవముగ సాగనంపిరి. కొంతకాలము తరువాత వసుదేవుడు సంరక్షకుల బాధ్యతలను నిర్వహించుచు తన యిరువురు కుమారులకు ఉపనయన సంస్కారమును చేయించెను.

**అథ శూరసుతో రాజన్ పుత్రయోః రామకారయత్ ।**
**పురోధసా బ్రాహ్మణైశ్చ యథావద్ద్విజసంస్కృతిమ్ ॥**

రాజా! అటుతరువాత వసుదేవుడు తన పురోహితుడైన గర్గాచార్యునితోను బ్రాహ్మణులతోను ఇరువురు పుత్రులకు యథావిధిగ ద్విజత్వము నొసంగునట్టి ఉపనయన సంస్కారమును చేయించెను.

1. జన్మనా జాయతే శూద్రః సంస్కారాద్ద్విజ ఉచ్యతే (పుట్టుకచే అందరును శూద్రులే, సంస్కారము వలననే వారికి ద్విజత్వము లభించును.)
2. పురోహితుడు తల్లిదండ్రులు తగిన సమయములో పిల్లలకు సంస్కారమును చేయింపవలెను.
3. ఇక్కడ ఉపనయన సంస్కారము విశిష్టతను, వివరణనుగూడ చేయవచ్చును.

**తతశ్చ లబ్దసంస్కారౌ ద్విజత్వం ప్రాప్య సువ్రతౌ ।**
**గర్గాద్ యదుకులా చార్యాద్ గాయత్రం వ్రతమాస్థితౌ॥**

ఇట్లు యదువంశమునకు ఆచార్యుడైన గర్గునిచే సంస్కారమును పొంది బలరాముడు శ్రీకృష్ణ భగవానుడు ద్విజత్వమును పొంది, గాయత్రీ వ్రతమున (బుద్ధిని సన్మార్గమున ప్రతిష్ఠించు దృఢసాధనయందు) లగ్నమైరి.

1. ఇక్కడ గాయత్రిని, దాని అర్థమును వివరింపవలెను.
2. ద్విజత్వము ఒక వ్రతము, జాతి కాదు.
3. గాయత్రీ ఉపదేశములను జీవితములో నిలుపుకొనుటయే గాయత్రీ ఉపాసన, గాయత్రీవ్రతము.
4. వ్రత శీలమగు జీవితమే నిజమగు జీవితము.

యజ్ఞోపవీత సంస్కారము తరువాత సోదరులిరువురికి విద్యాభ్యాసము ఏర్పాటు చేయబడినది. వారిని యోగ్యుడగు గురువు దగ్గరికి పంపిరి. మథురలోనే వారి విద్యాభ్యాసమునకు తగిన ఏర్పాట్లు చేయవచ్చును. కాని ఇంటికంటె ప్రేరణనొసంగు వాతావరణమున నొసంగబడిన శిక్షణ అధిక ప్రభావవంతమగును. అందువలన వారిని ఇంటికి దూరముగ గురుకులమునకు పంపుట జరిగినది.

**అథో గురుకులే వాసమిచ్ఛన్తా వుపజగ్మతుః ।**
**కాశ్యం సాన్దీపనిం నామ హ్యవన్తిపురవాసినమ్ ॥**

**పరమేశ్వరునితో భాగస్వామ్యం ఎలా చూచినా లాభదాయకమే.**

ఇప్పుడు వారు ఇరువురు గురుకులమున నివసించుటకు, శిక్షణను పొందుటకు కాశ్యపగోత్రీకుడైన సాందీపనిముని దగ్గరకు వెళ్ళిరి. ఆయన అవంతీపురమున (ఉజ్జయినీ నగరమున) నివసించుచుండెను.

1. పిల్లలను తమదగ్గరే ఉంచుకొనవలెనను మోహమును వదిలి వారిని ప్రేరణానొసంగు వాతావరణమున ఉంచవలెను.
2. విద్యపట్ల శ్రీకృష్ణ బలరాముల కున్న ఉత్సాహము వంటి ఉత్సాహము పిల్లలకు ఉండవలెను.

సాందీపని ఋషి తేజస్సులగు ఆ బాలురను సంతోషముతో తన ఆశ్రమములో ప్రవేశపెట్టెను. గురుకులమున దేశములో వివిధ ప్రాంతములకు చెందిన విద్యార్థులు నివసించుచుండిరి. శ్రీకృష్ణ బలరాములు గూడ యోగ్యులైన విద్యార్థులవలె అక్కడ క్రమశిక్షణతో మెలగసాగిరి.

**యథోపసాద్య తౌ దాన్తౌ గురౌ వృత్తిమనిన్దితామ్ ।**
**గ్రాహయన్తావుపేతౌ స్మ భక్త్యాదేవమివాదృతౌ ॥**

అప్పుడు వారు జితేంద్రియులై తమ లీలలను పూర్తిగ నిగ్రహించియుండిరి. గురువు వారిని ఆదరించుచుండెను. శ్రీకృష్ణ భగవానుడు బలరాముడు గురువునెట్లు చక్కగా సేవింపవలెనను ఆదర్శమును జనులయెదుట ఉంచుచు గొప్పభక్తితో ఇష్టదైవమును వలె ఆయనను సేవింపసాగిరి.

1. నిగ్రహము గలిగిన క్రమశిక్షణ కలిగిన విద్యార్థియే విద్యను పొందగలడు.
2. యోగ్యుడగు విద్యార్థి గురువు హృదయమున తన స్థానమును సంపాదించుకొనును.
3. భగవానుడు తన ప్రవర్తనను ఆదర్శముగా చూపి లోకమునకు ఉపదేశించును. కృష్ణభక్తుల పద్ధతిగూడ ఇదియే.

**తయోర్ద్విజవరస్తుష్టః శుద్ధభావానువృత్తిభిః ।**
**ప్రోవాచ వేదానఖిలాన్ సాంగోపనిషదో గురుః ॥**

గురువర్యుడగు సాందీపని శుద్ధభావముతో గూడిన వారి ప్రవర్తనకు చాల సంతసించెను. ఆయన ఆ సోదరులిరువురికి ఆరు అంగములతోపాటు, ఉపనిషత్తులతో పాటు వేదములను ఉపదేశించెను.

1. శిష్యుని యోగ్యతయే గురుతత్త్వమును ప్రభావితము చేయును.
2. విద్య ఏకాంగము కాక జీవితమునకు చెందిన అన్ని పక్షములను తెలుపునదై యుండవలెను.

మనఃపూర్వకముగ శ్రమతో అధ్యయనము చేయుటవలన ఇరువురు సోదరులు త్వరగానే జ్ఞానవిజ్ఞానములయందు పారంగతులైరి. శిక్షణ పూర్తియైన పిమ్మట గురువు ఆజ్ఞను పొంది సోదరులిరువురు మథురకు తిరిగివచ్చిరి. మథురానగర పౌరులు వారి యెడబాటు వలన వ్యాకులురైరి. వారు అందరిని ప్రేమతో కలిసికొనిరి, రాజ్యవ్యవస్థను నిర్వహించుటలో ఉగ్రసేనునికి సహకరించుచు మథురలో నివసింపసాగిరి.

శ్రీకృష్ణ భగవానుడు ఒకనాడు తన మిత్రుడగు ఉద్ధవుని పిలచి యిట్లు పలికెను - "ఉద్ధవా! వ్రజమునండి వచ్చునప్పుడు నేను మరల త్వరలోనే తిరిగివచ్చెదనని నా తల్లిదండ్రులకు, మిత్రులకు, ఇతర స్నేహితులకు నచ్చ జెప్పితిని. కాని ఈ ఘటనలు వ్రజమునకు పోవుటకు వీలులేకుండ చేసినవి. ఇప్పటికిని రాజ్యనిర్వహణము వలన నేను వ్రజమునకు వెళ్ళలేక పోవుచున్నాను. అందువలన నీవు అక్కడకు వెళ్ళి నా తల్లిదండ్రులకు, నా బంధువులకు నా సందేశమును వినిపింపుము. వారి క్షేమసమాచారమును అడిగిరమ్ము." కృష్ణుని ఆదేశమును పొంది ఉద్ధవుడు వ్రజమునకు వెళ్ళెను. అక్కడ అందరిని కలసికొని ఆయన కృష్ణుని సందేశమును వినిపించి నందునితో నిట్లు పలికెను.

**ఏతౌ హి విశ్వస్య చ బీజయోనీ**
**రామో ముకున్దః పురుషః ప్రధానమ్ ।**
**అన్వీయ భూతేషు విలక్షణస్య**
**జ్ఞానస్య చేశాత ఇమౌ పురాణౌ ॥**

శ్రీకృష్ణ బలరాములు పురాణ పురుషులు. వారీ విశ్వమునకు ఉపాదాన కారణము, నిమిత్త కారణము. శ్రీకృష్ణ భగవానుడు పురుషుడు, బలరాముడు ప్రధానము (ప్రకృతి). వీరు ఇరువురు సర్వశరీరులలో ప్రవేశించి పంచభూతములను, అత్యంత విలక్షణ జ్ఞాన స్వరూపులైన జీవులను నడుపుచున్నారు.

1. జడము చేతనము రెండును ఈశ్వరుని నుండియే పుట్టినవి.
2. ఈశ్వరుని అంశయగుట వలన జీవుడు సహజముగనే జ్ఞాన స్వరూపుడు.

భగవానుని సర్వవ్యాపక రూపమును గూర్చి చెప్పి ఉద్ధవుడిట్లు పలికెను - తత్త్వరూపమున భగవానుడు అన్నిచోట్ల ఉన్నాడు. కాని కృష్ణుడు తాను చెప్పిన దానిననుసరించి కొన్ని దినముల తరువాత తప్పక రాగలడు. యశోదామాత, మీరు ధైర్యము వహించుడు. మీరిద్దరు చాలా అదృష్టవంతులు.

శ్రీకృష్ణునకు జ్ఞాపకమున్నదని యెరింగి అందరు సంతోషించిరి. కాని ఆయన వ్రజమునకు రానందుకు అందరు దుఃఖించిరి. ఎవరో తమ సంపదను హరించినట్లుగ వారు భావించిరి. వారి మోహమును పోగొట్టుచు ఉద్ధవుడిట్లు పలికెను.

**యథా భ్రమరికా దృష్ట్యా భ్రామ్యతీవ మహీయతే ।**
**చిత్తే కర్తరి తత్రాత్మా కర్తే వాహం ధియా స్మృతః ॥**

చిన్నవారు కాని పెద్దవారు కాని వేగముగ తిరుగుచున్నపుడు వారికి ఈ భూమియంతయు తిరుగుచున్నట్లు తోచును.

**స్వప్న జగత్తులో కాల్పనిక పరమేశ్వరుణ్ణి పూజించడంకన్న శ్రమను పూజించడం మరింత పవిత్రమైనది.**

అట్లే సర్వమును చేయునది చిత్తమే. కాని ఆ చిత్తమున అహంకారము ప్రవేశించినంతనె భ్రమవలన జీవుడు తన్ను కర్తగా భావించు కొనును.

1. జడ చేతనముల సంయోగము వలన పుట్టు చిత్తమే కర్త.
2. దుఃఖమునకు కారణము భ్రమ. అందువలన భ్రమను నివారింపవలెను.

**యువయోరేవ నైవాయమాత్మజో భగవాన్ హరిః ।**
**సర్వేషా మాత్మజో హ్యాత్మా పితా మాతా స ఈశ్వరః ॥**

శ్రీ కృష్ణ భగవానుడు మీయిరువురికే పుత్రుడు కాడు, సర్వప్రాణులకు ఆత్మ, పుత్రుడు, తల్లి, తండ్రి, పాలకుడు.

1. భగవంతునితో ఎవడైన బంధుత్వమును పెట్టుకొన వచ్చును. ఆయనయే సర్వస్వము.
2. ఈశ్వరుడనగా అందరిని శాసించువాడు. ఆయన దండించనుగలడు, సత్కరించనుగలడు. అందువలన ఆయన వ్యవస్థపట్ల జనులు సావధానముగ ఉండవలెను.

యశోదానందులవలె వ్రజవాసులైన స్త్రీ పురుషులందరు శ్రీకృష్ణ స్మరణమున వ్యాకులురైరి. వారికి ఆహారము గూడ రుచించలేదు. జ్ఞానియగు ఉద్ధవుడు ఆయనను ఆత్మ స్వరూపునిగా చెప్పుచు - "శ్రీకృష్ణునితో శారీరక స్థాయి సంబంధమును పెట్టుకొనక ఆత్మస్థాయి సంబంధమును పెట్టుకొనుడు, దీనివలన ప్రాపంచిక దుఃఖముల నుండి దాటగలరు'' అని పలికెను. ఉద్ధవుడిట్లు చెప్పెను -

**ఆత్మా జ్ఞానమయ శ్శుద్ధో వ్యతిరిక్తోఽ గుణాన్వయః ।**
**సుషుప్తి-స్వప్న-జాగ్రద్భిర్మా యావృత్తి భిరీయతే ॥**

ఆత్మ మాయకంటెను, మాయ కార్యముల కంటెను వేరైనది. అది పూర్తిగ జ్ఞానస్వరూపము, అవాంతర భేదములు లేనిది, పూర్తిగా శుద్ధమైనది. ఏ గుణముగూడ దానిని స్పృశింపలేదు. అది జాగ్రత్-స్వప్న-సుషుప్తులనెడు మూడు స్థితులను దాటియున్నది.

1. మానవుడు తనను ఆత్మ రూపమున అనుభవించునపుడు సాంసారికములైన సుఖ దుఃఖములు వానిని ప్రభావితము చేయజాలవు. అతడు పారమార్థిక పథమున ముందుకు పోవుచు దివ్యమగు ఆనందమును పొందును.

'నా విశ్వరూపమును స్మరించుటవలన భిన్నత్వ కల్పనవలన కలుగు దుఃఖము శాంతమగు'నని కృష్ణుడు చెప్పెను.

ఆయన సందేశమును ఆయన మాటలలోనే చెప్పుచు ఉద్ధవుడిట్లు పలికెను.

**ఏతదన్తః సమామ్నాయో యోగః సాంఖ్యం మనీషిణామ్ ।**
**త్యాగస్తపో దమస్సత్యం సముద్రాన్తా ఇవాపగాః ॥**

శ్రీ కృష్ణ భగవానుడిట్లు పలికెను - నదులన్నియు ఇటు తిరిగి అటు తిరిగి చివరకు సముద్రమును చేరునట్లు బుద్ధిమంతులగు పురుషుల వేదాభ్యాసము, యోగసాధనము, ఆత్మా నాత్మ వివేకము, త్యాగము, తపస్సు, ఇంద్రియ నిగ్రహము, సత్యము మున్నగు ధర్మములన్నియు నన్ను పొందుటలోనే సమాప్తమగును. అన్నింటి నిజమైన ఫలము నా సాక్షాత్కారమే. ఎందుకనగా అవి అన్నియు మనస్సును నిరోధించి నా దగ్గరకు చేర్చునట్టివే.

1. కర్మ కాండమున్నగు వానినె సర్వస్వమని భావింపరాదు. ఇవియన్నియు జీవిత లక్ష్యమును పొందుటకు సాధనములు మాత్రము.
2. అల్పత్వము మహత్వముగా మార్పు చెందుటయే ఆత్మ సాక్షాత్కారము లేదా భగవద్దర్శనము.

వ్రజవాసుల భక్తి భావన. ఉద్ధవుని జ్ఞానము యొక్క ఆదాన ప్రదానము చాలదినముల వరకు సాగుచునే యుండెను. దీనివలన రెండు పక్షముల వారికి చాలా సంతోషము కలిగెను. ఉద్ధవుడు చాలాదినముల వరకు వ్రజములో ఉండి పిదప మథురకు వెళ్ళుటకు యశోదానందులను, ఇతర వ్రజవాసులను అనుమతి వేడెను. అందరి దగ్గర సెలవు తీసికొని అతడు రథము నధిరోహించెను. నందుడు ఇతర గోపాలురు కృష్ణునకు ఎన్నియో కానుకల నొసంగిరి, కన్నుల వెంట నీరు కార్చుచు ఉద్ధవునితో నిట్లు పలికిరి -

**కర్మభిర్భ్రా మ్యమాణానాం యత్ర క్వాపీశ్వరేచ్ఛయా ।**
**మంగళా చరితై ర్దానై రతిర్నః కృష్ణ ఈశ్వరే ॥**

ఉద్ధవా! మాకు మోక్షకాంక్ష ఏ మాత్రము లేదు. మేము భగవదిచ్ఛ వలన మా కర్మల ననుసరించి ఏ జన్మ మెత్తినను చక్కగా ప్రవర్తింతుము గాక! దాని వలన మాకు శ్రీకృష్ణ భగవానునియందు పరమప్రీతి కలుగుగాక!

1. నిజమైన ప్రేమ ప్రతిఫలమును కోరదు.
2. ఈశ్వరుని తన చెడు కర్మలను క్షమించమని కాక ఉత్తము కర్మ చేయుటకు శక్తిని, ఆయన పాదములయందు భక్తిని కోరవలెను.
3. సిద్ధాంతమును తెలిసినవారు ధైర్యముగ తమ కర్మఫలమును అనుభవించుటకు సిద్ధముగా నుందురు.
4. ఉత్తమ ప్రవర్తనలపై ఆసక్తి కలుగుటయే ఈశ్వరకృప.

ఉద్ధవుడు వ్రజవాసుల స్నేహముచే ప్రభావితుడై మథురకు వచ్చి కృష్ణుని కలిసికొనెను. వ్రజవాసు లొసంగిన కానుకలను శ్రీకృష్ణునకు అర్పించి వారి సందేశమును కృష్ణునకు వినిపించెను. శ్రీకృష్ణుడు వారి స్నేహమును సద్భావమును జ్ఞాపకము చేసికొని గద్గదుడయ్యెను.

★ ★ ★

**సంస్కరించబడిన ఆంతరిక చైతన్యమే మానవ జీవితానికి గొప్ప వరం.**

## గురు దేవుల అమృతవాణి

# దేవతలు ఇచ్చేవి దైవీగుణాలు మాత్రమే

దేవతల అనుగ్రహ విషయము మీరంతా వినే ఉంటారు. వారు ఇస్తూ ఉంటారు కాబట్టే వారికి దేవతలని పేరు పెట్టారు. పొందాలనే కోరికతో ఎంతోమంది వారి పూజ చేస్తూ ఉంటారు. ఉపాసన, భజన చేస్తూ ఉంటారు. తద్వారా దేవతలు తమకేదైనా ఇచ్చి వెళతారని. ఈ విషయం సరియైనదా తప్పా ఆలోచిద్దాం.

దేవతలు ఇస్తారు. దీనిలో ఏ సందేహమూ లేదు. వారు ఇచ్చేవారు కాకపోతే వారి పేర్లు దేవతలని పెట్టి ఉండేవారు కాదు. దేవతయొక్క అర్థమే ఇచ్చేవారు అని. ఇచ్చేవారిని ఒక వేళ అడిగేవారు ఏదైనా అడిగినట్లైతే దానిలో తప్పేమీ లేదు. కానీ ఆలోచించవలసింది ఏమిటంటే దేవతలు అసలు ఇచ్చే వస్తువేమిటి? దేవతలు తమదగ్గర ఏమున్నదో అదే ఇస్తారు. ఎవరిదగ్గర ఏమున్నదో అదేకదా వారివ్వగలిగేది. దేవతల దగ్గర ఒకే వస్తువు ఉన్నది. అది దేవత్వము. గుణము, కర్మ, స్వభావం ఈ మూడింటి మంచితనము, శ్రేష్ఠతనే దేవత్వము అంటారు. ఇదంతా ఇచ్చిన తర్వాత దేవతలు నిశ్చింత పొందుతారు. నివృత్తులౌతారు. వారంటారు- మేమేదైతే మీకివ్వగలమో అదంతా ఇచ్చేశాము. మేమిచ్చినదానిని ఎక్కడ సముచితమో అచట ఉపయోగించి సఫలతను పొందటమే మీరు చెయ్యవలసిన పని.

ప్రపంచములో సఫలత ఒక వస్తువుకు బదులుగా దొరుకుతుంది. దాని పేరు మనుష్యుని ఉత్కృష్ఠ వ్యక్తిత్వము. దీనికంటే తక్కువలో ఏ వస్తువూ లభించదు. ఒకవేళ ఎక్కడినుండైనా దిగజారిన వ్యక్తిత్వంలో, తన నాణ్యం నిరూపించుకోకుండానే, తన యోగ్యతకు ప్రమాణం చూపకుండానే, శ్రమపడకుండానే గుణ రహితంగా ఏదైనా వుస్తువును పొందినా, అది అతనివద్ద నిలవదు. శరీరంలో జీర్ణించుకునే శక్తి లేకపోతే మీరు తిన్న రుచికర పదార్థాలన్నీ మిమ్మల్ని హైరానా పెడతాయి, ఇబ్బంది పెడతాయి. గుణాలు లేకపోతే, ఎలా ఎలా సంపద పెరుగుతూ పోతుందో అలా అలా మీలోపల దోషాలు, వ్యసనాలు పెరుగుతూపోతాయి. అహంకారం పెరుగుతుంది, మీ జీవితాన్ని సర్వనాశనం చేస్తుంది.

దేవతలు ఏమి ఇస్తారు? ఏ వస్తువులనైతే మీరు అడుగుతారో, సుఖం కలిగిస్తాయని భావిస్తారో వాటిని జీర్ణంచేసుకునే శక్తినే దేవతలు ఇస్తారు. ఆ వస్తువులన్నిటిని జీర్ణం చేసుకోవటానికి విశేషత కావాలి. దాని పేరే దేవత్వము. దేవత్వము ఎప్పుడైతే మీకు ప్రాప్తిస్తుందో మీరు ప్రపంచములోని ప్రతి వస్తువు నుండి, చిన్నదాని నుండి పెద్దవాని వరకు లాభం పొందగలుగుతారు.

ఒకవేళ ఆ వస్తువులు లేకపోయినా మీకు పని నడుస్తుంది. ఎక్కువ వస్తువులున్నా మంచిదే, ఒకవేళ లేకపోయినా ఇబ్బందిలేదు. మేము వెనుకబడి ఉన్నాము, ఇలాగే ఉంటామని నిశ్చయించుకుంటే చెప్పగలిగిందేమీ లేదు. మనుష్యుని శరీరంలో సామర్థ్యం ఉండాలి, తెలివి ఉండాలి. వానిపై వివేకం నియంత్రణ ఉండాలి. వివేకము లేకపోతే అగ్నిలో ఆజ్యం వేసినట్లు, ఇంధనం వేసినట్లు ప్రపంచంలో కష్టాలను మాత్రం ఉత్పన్నం చేసుకుంటారు. దేవతలు ఎవరికీ సంపత్తి ఇచ్చే తప్పుమాత్రం చెయ్యరు. ఒక వేళ ఇస్తున్నారు అంటే దాని అర్థం నాశనం చేస్తున్నట్లే. మానవునికి భగవంతుడు ఒకవేళ ఇచ్చినట్లైతే అది విశేషత, నవోత్సాహము. మానత్వమంటే మానవుని చింతన, దృష్టికోణము, ఆకాంక్షలు, ఉన్నతస్థాయి కార్యకలాపాలే. మానవత్వమనేది ఒక గొప్ప విషయం.

మనోకామనలు పూర్తిచేసుకొనుట చెడ్డ కార్యకలాపమేమీ కాదు, కానీ ఒక షరతు- ఏ పని కొరకు, ఏ వస్తువుకొరకు అడిగాము అనేది. ఒక వేళ ప్రాపంచికత కొరకు అడిగిఉంటే, ఆ సంపత్తి ఎలా జీర్ణము చేసుకోగలమో మొదట తెలుసుకోవలసి ఉంటుంది. మనుష్యులు పొరపాటు చేయవచ్చు, కానీ దేవతలు పొరపాటు చేయరు. దేవతలు మీకు వస్తువులు ఇవ్వలేరు. నా అభిప్రాయంలో దేవతల సంపర్కములో వచ్చినవారికి భౌతిక వస్తువులు లభించలేదు. ఏమి దొరికింది? దేవత్వం లభించింది. సద్గుణాల ఆధారంగా మానవుడు వికాసం చెందటానికి అవకాశం లభించింది. గుణాలు వికసించుట వలన, సామాన్య మానవులు ఉన్నత శిఖరాన్ని అధిరోహించగలుగుతారు. అది ప్రాపంచికమైనా లేదా ఆధ్యాత్మికమైనా గుణాలను ఉపయోగించుకునే పద్ధతి మాత్రము ఒకటే. గుణాలు తమంత తాము శక్తిపుంజాలు. అలాగే కర్మ, స్వభావం కూడ తమంత తాము శక్తిపుంజాలే. వీటినెక్కడ ఉపయోగించాలి : ఇది మీ ఇచ్ఛకు సంబంధించిన విషయం.

సాహసికత వలన సఫలత లభిస్తుంది. ఇది ఒక ఆధ్యాత్మిక గుణం. దీని ఆధారంగానే యోగికి, తాంత్రికునికి, మహాపురుషునికి కూడా సాఫల్యం లభిస్తుంది. ప్రతి ఒక్కరికి ఈ సాహసికత ఆధారంగానే సఫలత లభించింది. ఒక వేళ బందిపోటైనాసరే. మీరు యోగులు, నాయకులు, మహాపురుషులైనా దీని ఆధారంగానే సాఫల్యం పొందగలరు. ఇది ఒక దైవీగుణం. దీన్ని మీ కోరిక ననుసరించి ఉపయోగించుకోవచ్చు. మీమీద ఆధారపడి ఉంటుంది. మానవుని లోపల ఏ విశేషత ఉందో అది గుణాల విశేషతయే. దేవతలు మనిషికి ఒకవేళ ఇస్తే గుణాల విశేషత, గుణసంపద ఇస్తారు. గాయత్రి మాత ఎవరినైతే మీరు ఉపాసన చేస్తున్నారో, అనుష్ఠానం చేస్తున్నారో ఒక వేళ ఎవరికైనా ఇచ్చినట్లైతే గుణాల విశేషతను ఇస్తుంది. గుణాల వలన ఏమవుతుంది? గుణాలవలననే అంతా అవుతుంది. భౌతికమైనా, ఆధ్యాత్మికమైనా వ్యక్తి ఉన్నతి పొందాడని అంటే కేవలం గుణాల వలననే. శ్రేష్ఠగుణాలు లేకపోతే భౌతిక ఉన్నతీ దొరకదు,

**నాయకత్వం అంటే పెత్తనం చెలాయించడం కాదు, సరైన దారి చూపడం.**

ఆధ్యాత్మిక ఉన్నతీ దొరకదు.

మనుష్యుడు ఎంత తెలివిగలవాడో, అంతకంటే తెలివి లేనివాడుకూడా. దేవతలు మనోకామనలు పూర్తిచేస్తారు, డబ్బు ఇస్తారు, సంతానం ఇస్తారు, సంపద ఇస్తారు, ఉద్యోగం ఇస్తారు అనే భ్రాంతి ఆధ్యాత్మిక క్షేత్రంలో ఎందుకు చొరవడిందో తెలియటం లేదు. ఆధ్యాత్మిక క్షేత్రంలో ఎంత లాభం, ఎంత పెద్ద ఉపయోగము సంభవమో, ఎంత సుఖము సంభవమో వాటన్నిటికి ఈ ఒక్క భ్రాంతి చాలా పెద్ద నష్టము కలుగజేసింది. దేవతలు మనుష్యునికి ఒకే వస్తువు ఇస్తారు. ప్రతి ఒక్కరికి ఒక్కటే ఇచ్చారు. ప్రాచీన కాలంలో చరిత్రలో, భవిష్యత్తులో కూడా దేవతలు జీవించి ఉంటే, భక్తి జీవించి ఉంటే, ఉపాసనాక్రమం ఒకవేళ జీవించి ఉంటే, ఒకే వస్తువు లభిస్తుంది. అదేమిటంటే దేవత్వగుణం. దేవత్వగుణం వచ్చినట్లైతే అప్పుడు ఎన్ని సాఫల్యాలు కోరుకుంటే వాటికి వేల, లక్షల రెట్లు సాఫల్యాలు మీకు లభిస్తాయి.

మీరు ఏమి కోరుకుంటారు? మీకు దేవత్వానికి బదులు 3,4 వందల రూపాయల నౌకరి ఇప్పించాలా ఎవరైనా దేవత లేదా సాధువు. మంత్రము లేదా ఆశీర్వాదము అనేది వస్తువు కాబోదు. కానీ ఒక వేళ దేవతలు దేవత్వాన్ని ప్రదానం చేసినట్లైతే, అపుడు ఎంత విలువైన నౌకరి మీకు ఇప్పించగలరంటే అప్పుడు మీ అదృష్టానికి మీరు పొంగిపోవాల్సిందే. వివేకానందుడు శ్రీరామకృష్ణ పరమహంస వద్దకు నౌకరి అడగటానికి వెళ్లాడు. కానీ దొరికిందేమిటి? దేవత్వము, భక్తి, శక్తి, శాంతి. ఇవి గుణములు. మనుష్యులపై ఎప్పుడైనా సాధువులు దయ చూపిస్తారు. సాధువులెవరికైనా ఇచ్చారంటే ఒకటే వస్తువు. అది ఉల్లాసము. ఎటువంటి ఉల్లాసమంటే, మనుష్యుని అది సిద్ధాంతాలవైపు లాక్కొని వెళ్తుంది. ఎప్పుడైతే మనుష్యునికి సిద్ధాంతాల మత్తు వ్యాపిస్తుందో అపుడు అతని అయస్కాంత తత్వము, ఆకర్షణ, అతని వాణి, అతని ప్రామాణికత ఎంత ఎత్తు కెదుగుతాయంటే ప్రతి మనిషీ దగ్గరికి లాగబడతాడు. ప్రతిఒక్కరూ సహాయం చేస్తారు. వివేకానందునికి గౌరవము, సహకారము రెండూ లభించాయి. ఇది ఎవరు ఇచ్చారు - కాళికాదేవి. కాళిక ఎవరికైనా ఏదైనా ఇచ్చినట్లైతే అది ఇదే. ఒక వేళ ప్రపంచంలో మళ్లీ రామకృష్ణుడు జీవిస్తే, జన్మిస్తే, ఈ విధమైన ఆశీర్వాదమే ఇస్తాడు. దానివలన మానవుని వ్యక్తిత్వం వికసిస్తూ పోతుంది. ఎప్పుడైతే వ్యక్తిత్వం వికసిస్తుందో మీరు కోరుకొనే సహకారం వర్షిస్తుంది. సహకారము అడగబడేది కాదు, వర్షిస్తుంది. మనుష్యుడు ఇస్తూ ఉంటాడు. సహకారం వస్తూ ఉంటుంది. దేవత్వము ఎప్పుడైతే వస్తుందో అప్పుడు సహకారం వర్షిస్తుంది. బాబా సాహెబ్ ఆమ్టే ఉదాహరణ మీ ముందు ఉన్నది. ఆయన కుష్ఠురోగుల కొరకు, వికలాంగుల కొరకు తన సర్వస్వాన్ని అర్పించారు, ఇది ఏమిటి? సిద్ధాంతం, ఆదర్శము, వరదానము. ఇంతకంటే తక్కువలో ఎవరికీ లభించదు. అడుక్కోవటము వలన ఎవరికీ ఏదీ లభించలేదు. భవిష్యత్తులో లభించదు.

దేవతలు ఒక పని చేస్తూ ఉంటారు. ఏమి చేస్తారు? పూలు కురిపిస్తారు. రామాయణంలో కనీసం 50 సార్లైనా ఈ ప్రస్తావన వస్తుంది. దేవతలు పూలు కురిపించడం గురించి. పూలేమి కురిపిస్తారు? సహకారం కురిపిస్తారు. పూలు అని సహకారాన్నంటారు. దేవత్వం జీవించే ఉంటుంది. దేవత్వం మరణించేది కాదు. భూతాలు, సైతానులు మరణించకపోతే భగవంతుడెందుకు మరణిస్తాడు? మానవుడెందుకు మరణిస్తాడు? మానవుడు మానవుణ్ణి చూసి ఆకర్షితుడౌతాడు, భగవంతుడు భగవంతుణ్ణి చూసి, దేవతలు దేవతల్ని చూసి ఆకర్షితులైతే, శ్రేష్ఠత్వానికి సహకారం ఆకర్షితమౌతుంది. ఇప్పుడు కూడా ఇలాగే జరుగుతుంది. ముందు ముందు కూడా ఇలాగే జరుగుతుంది.

'దేవతలు మనిషి లోపల ఒక విధమైన ఆకాంక్ష, ఒక విధమైన ఉత్సాహం, ఒక విధమైన ఆవేదన కలిగిస్తారు. అన్ని వలలనూ, సాలెగూటి దారాలను త్రెంచుకొని సిద్ధాంతాలవైపు అగ్రగామి అయ్యేటట్లు మనిషిని బలపరుస్తారు. దేవతలంటే అలా ఉంటారు. దేవతల వరదానమని దీన్నంటాము. మనుష్యుని లోపల ఎప్పుడైతే గుణ, కర్మ, స్వభావ విశేషతలు ఉద్భవిస్తాయో అప్పుడు అతని ఉన్నతికి ద్వారాలు తెరుచుకున్నాయని విశ్వసించండి. ప్రపంచ చరిత్రలో ఇప్పటివరకు ఎంతమందయితే వికసితులైనారో, ఏ క్షేత్రంలోనైనా సఫలత పొందారో, ఎవరు గౌరవించబడ్డారో వారందరూ గుణాల ఆధారంగానే అభివృద్ధి చెందారు. దేవతల వరదానం గుణముల, చింతనల ఉత్కృష్టతయే.

ప్రపంచములోని మహాపురుషులలో ప్రతి సఫలుడైన వ్యక్తి ఇతిహాసము ఈ విధంగానే ఉన్నది. అందరూ చిన్న చిన్న వంశములలోనే జన్మించారు. చిన్న చిన్న ఇళ్లలో మామూలు పరిస్థితులతోనే జన్మించారు. కాని ఉన్నత శిఖరాలను, అత్యున్నత స్థానాలను అధిగమిస్తూ ముందుకు వెళ్లారు. ఎవరు చేరుకోగలిగారు? లాల్‌బహదూర్ శాస్త్రిని తీసుకోండి. వారిపై దేవతానుగ్రహం ఉన్నది. దేవతల అనుగ్రహాన్ని ఎలా పరీక్షించాలి? అనుగ్రహం చూపారా?లేదా? అనుగ్రహించారనటానికి ఒక గుర్తు ఉన్నది. బాధ్యతాయుతంగా ప్రవర్తించగలుగుటయే అది.

పూజ అర్థమేమిటంటే- మానవీయ గుణాల వికాసము, మానవీయ కర్మల వికాసము, మానవీయ స్వభావ వికాసము. పూజ వలన ఇది దొరుకుతుంది, అది దొరుకుతుంది అని మీరు ఏదైతే భావిస్తూ వచ్చారో, అదంతా తప్పుగా అర్థంచేసుకోవటం వలన ఉత్పన్నమైంది. పూజ వలన దయ, మర్యాద, నిజాయితీ లభిస్తాయి. మనుష్యునికి ఉన్నతమైన దృష్టికోణం లభిస్తుంది. ఒకవేళ పూజ తక్కువగా చేసి ఉంటే దారి తప్పి తిరుగుతూ ఉంటారు. పూజ వలన లాభము ఇంతవరకు చరిత్రలో మనుష్యులకు ఎలా లభిస్తూ వచ్చిందో మనకు కూడా ఆవిధంగా లభించాలి. మన గుణ, కర్మ, స్వభావ వికాసం, భావనా వికాసం జరగాలి. దీనిపేరే దేవత్వం. దేవత్వం ఒకవేళ మీ వద్దకు వస్తే, మీ వద్దకు సాఫల్యాలు వస్తాయి. హిందూ దేశ ఇతిహాసమువైపు దృష్టి సారించండి.ఆ పుటలలో ఆకర్షణీయంగా

**నిరంతర పురోగమనమే జీవితం.**

కనపడే వ్యక్తులు తమ యోగ్యతల ఆధారంగా, తమ విశేషతల వలననే గొప్పవారయ్యారు. మహామహులు మాలవ్యాజీ ఉదాహరణ విన్నారా. వారు ఎటువంటి మహోన్నత వ్యక్తి. వారి మీద దేవతలు అనుగ్రహం కురిపించారు, సామాన్య వ్యక్తి మహావ్యక్తి అయ్యారు.

మిత్రులారా! భగవానుడు ప్రసన్నుడైనప్పుడు, మీరు అడిగేటటువంటి వస్తువులు ఇవ్వడు. మరి ఏ వస్తువులు ఇస్తాడు? దేనివలన మనుష్యుడు స్వశక్తి చేత నిలబడతాడో, నలువైపులా సఫలతలే లభిస్తూపోతాయో - అటువంటి వస్తువు నిస్తాడు. మహాపురుషులందరినీ చూడండి. దైవీ సహకారం లభించనటువంటి వ్యక్తి ఎవరూ ప్రపంచపు తెరమీద కనపడలేదు. ప్రపంచములోని ప్రతిభాగంలో ఉండే ఎవరికి శ్రేయస్సు లభించిందో వారికి ధనం కూడా లభించింది. ఎక్కడ మనుష్యునికి శ్రేయస్సు లభిస్తోందో అక్కడ వైభవం లభించకుండా ఉండజాలదు. సంత్‌లు పేదవారు కాదు. వారు ఉదారులు. ఏది లభిస్తుందో అది తినరు. దానిని ఇతరులకు తినిపిస్తారు. దీనినే దేవత్వమంటారు.

మనుష్యుని అంతరంగంలో యోగ్యత ఎప్పుడు వికసిస్తుందో బాహ్య సంపదలు అతనికి దగ్గరౌతూ వస్తాయి. ఉదాహరణ చెప్పమంటారు. ప్రతి మహాపురుషుని జీవితమూ ఒక ఉదాహరణే. ప్రతి ఈశ్వరభక్తుని, ప్రతి సిద్ధాంతవాది జీవితం ఒక ఉదాహరణే. వారిని నేను దేవభక్తులంటాను, వారిని దేవోపాసకులని అంటాను. తమ గుణాలు ఆధారంగా దేవతలను తమ వైపు ఆకర్షించుకొనేవారి సామర్థ్యాన్ని సార్థకమైన దేవభక్తిగా అంగీకరిస్తాను. మీ భాషలో చెప్పాలంటే దేవతలు ఎప్పుడు ప్రసన్నులౌతారో అప్పుడు దేవత్వ గుణాన్నిస్తారు, దేవత్వపు కర్మలనిస్తారు, దేవత్వపు స్వభావాన్నిస్తారు, దేవత్వపు చింతన నిస్తారు. ఇది మీ భాషలో చెప్పాను. మా పరి భాష దీనికంటే భిన్నమైనది. మనుష్యుడు తన దేవత్వగుణాలు ఆధారంగా దేవతలను ఒత్తిడి చేయగలుగుతాడు అని నేను చెప్పగలను. తమకు సహాయం చేసేందుకు దేవతలను వివశులను చేస్తారు. తమకు సహాయం చేయవలసిందే అని అడుగుతారు. అలాగే వారు సహాయం చేయవలసి వస్తుంది. భక్తుడు ఎంత శక్తివంతుడంటే, భగవంతునిపై ఒత్తిడి చేయగలుగుతాడు. మీరు మాకు ఇవ్వవలసి ఉన్నది అని చెపుతాడు. తమకు సహాయం చేయవలసినదే అని అడుగుతాడు. అలాగే వారు సహాయం చేయవలసి వస్తుంది. మాకు సహాయం ఎందుకు చెయ్యరు? మాకు సహాయం చేయవలసిందే అని భగవంతునితో పోట్లాటకు సిద్ధమవుతారు.

కామనలు కోరేవారెప్పుడూ భక్తులు కాలేరు. భక్త శబ్దంతో పాటు, భగవంతుని ఇచ్ఛలు నెరవేర్చే విషయం జోడించబడింది. "కామనల పూర్తి మీది కాదు, భగవంతునిది." భక్తుని రక్షిస్తానని భగవంతుడు వ్రతం స్వీకరించాడు. 'యోగక్షేమం వహామ్యహమ్'. యోగక్షేమములు వహిస్తానని భగవంతుడు వ్రతం తీసుకున్న విషయం నిజమే కాని తృష్ణలు పూర్తి చేసే బాధ్యత ఆయన తీసుకోలేదు. మీ యోగక్షేమాలంటే అర్థం మీ శారీరక, మానసిక ఆవశ్యకతలను పూర్తిచేసే బాధ్యత స్వీకరించటం. తృష్ణల కొరకు పరుగెత్తవద్దు. భగవంతుని రీవిలో, భక్తుని రీవిలో, భజన రీవిలో ఒక అహంభావమున్నది. భగవంతునికీ, భక్తునికీ మధ్య సంబంధం ఇలాగే ఉంటూ ఉంటుంది. భక్తులు అడగరు, ఇస్తారు. భగవంతుడు మనిషి కాదు. అతడిని మనం తయారు చేశాము. సిద్ధాంతాల కొరకు, ఆదర్శాల కొరకు మనుష్యుని త్యాగము బలిదానము ఏదైతే ఉన్నదో అదే భగవానుని పట్ల భక్తి. దీని పేరే దేవత్వం.

ప్రామాణికత మనుష్యునికి ఎంత గొప్ప సంపద అంటే దాని వలన అతనికి ప్రజల సహకారం లభిస్తుంది. స్నేహం కురుస్తుంది, సమర్థన వర్షిస్తుంది. ఎక్కడైతే స్నేహము, సమర్థన, సహకారం వర్షిస్తాయో అక్కడ ఏ వస్తువుకూ కొరత ఉండదు. బుద్ధుని ప్రామాణికత వలన, సద్భావన వలన, ఉదారతవలన ప్రజలు డబ్బు రాసులు పోశారు. సద్భావన, శ్రేష్ఠకర్మలలో నిమగ్నత, ఉదారత, లోకహితం, వ్యక్తిగత జీవనంలో శ్రేష్ఠత, ప్రామాణికతతో ముందుకు వెళ్లటం వలన గాంధీజీ భక్తుల శ్రేణిలో చేరిపోయారు. ప్రజలంతా సహకారమందించారు, దానమిచ్చారు. ఆయన ఆజ్ఞను పాలించారు. లక్షలాదిమంది ఆయన మాటపై జైళ్లకు వెళ్లారు. లక్షలాదిమంది గుండెలపై గుండు దెబ్బలు తిన్నారు. ఇది సాధ్యమేనా? అవును. షరతు ఒక్కటే. మీరు ప్రకాశం వైపు వెళ్తూ ఉంటే నీడ మీ వెంబడే వస్తుంది. మీరు నీడ వెంబడి వెళుతుంటే నీడ మీకంటే ముందే ఉంటూ ఉంటుంది. నీడ అంటే అర్థం మాయ. మీరు ప్రకాశంవైపు నడవండి. భగవంతుని వైపు నడవండి. ఆదర్శాల, సిద్ధాంతాల పేరే హనుమాన్. వీటి పేరే భగవాన్.

మిత్రులారా! ఏ కాంక్షల పెత్తనం మీమీద ఉన్నదో, వాటి నుండి ప్రక్కకు తప్పుకోండి. తృష్ణల నుండి తప్పుకోండి. ఉపాసన ఉన్నత స్థానాన్ని అందుకోవటానికి కృషి చేయండి. దానివలన మీలోపల వ్యక్తిత్వంలో శ్రేష్ఠత వికసిస్తుంది. మీ లోపల శ్రేష్ఠత వికసిస్తే, మీకు జనతా వరదానం లభిస్తుంది. ఆత్మ వరదానం లభిస్తుంది, భగవంతుని వరదానం లభిస్తుంది.

మీరు నిజమైన వరదానం పొంది సంతృప్తి చెందవచ్చు. ఇంతవరకు భక్తులు దేనిని పొంది సంతృప్తి చెందారో నేను అదే మార్గంలో నడిచే ప్రయత్నం చేశాను. నా జీవితంలో ప్రత్యక్షరూపంలో భగవంతుని వరదానాలు చూశాను, పొందాను. ఎవరైతే ఈ శిబిరానికి వచ్చారో, వసంత పంచమికి వచ్చారో వారు ప్రేరణలు పొంది వెళ్లాలని నేను కోరుకుంటున్నాను. మన శ్రేష్ఠతను ఉజ్జ్వలము చేసుకొనేందుకు లోపల నుండి బయట నుండి ప్రేరణ లభించునట్లు మనపై భగవంతుడు దయచూచుగాక. మీకు అటువంటి ప్రేరణ లభిస్తే, ఫలితంగా మీరు పూర్తి తృప్తి పొందుతారు. మీరు ఇటువంటిదేదైనా ఉపలబ్ధి పొందితే మన దేశం ధన్యమౌతుంది. గాయత్రీ మాత ధన్యమౌతుంది. మనం ధన్యమౌతాము. ఈ శిబిరం ధన్యమౌతుంది.

☆ ☆ ☆

**వివేకంతో ఆలోచించు, మాట్లాడు, పని చెయ్యి. ఇదే నిజమైన దైవ ప్రార్థన.**

## మనం-మన ఆరోగ్యం

# నవ్వు, నవ్వించు - రోగాన్ని జయించు

ఆరోగ్య ప్రయోజనం, దాని సంరక్షణ, అభివృద్ధి- వీటి రహస్యం తెలుసుకోవాలి. టానిక్కులతోనూ, పౌష్టికాహారం తీసుకోవడంతోనూ సరిపోదు. ఆ విధంగా ఆలోచించే రోజులు పోయాయి. వస్తాదులు, పహిల్వానులు, హకీంలు ఎవరినైనా శక్తివంతంగా చేయగలమని గొప్పలు చెప్పుకుంటారు. ఆహార, విహారాలలో నిగ్రహాన్ని పాటించటంతోపాటు, మానసిక స్థాయిలోగూడా ఆరోగ్యాన్ని నిలుపుకోవడం చాలా ముఖ్యమైన విషయమని నిపుణులు ఇప్పుడంటున్నారు. దౌర్బల్యం, అసమర్థత అనేవి శరీరాంగాలకు మాత్రమే పరిమితం గావు. మస్తిష్కానికి చెందిన జ్ఞాన సంవేదనల ప్రభావం గూడా ఉంటుంది. ఇప్పుడు రక్తప్రసరణ కేంద్రానికిగాక, మస్తిష్క విద్యుత్ ప్రవాహానికి ప్రాముఖ్యత నీయడం జరుగుతున్నది. జీవితంలో అనేక రంగాలలో ప్రగతి, అధోగతి చెందించడం మాత్రమేగాకుండా, శారీరక అనారోగ్యానికీ, ఆరోగ్యానికీ గూడా మస్తిష్కంతో సంబంధం ఉన్నదని తెలుస్తున్నది.

చాలాకాలం సుదీర్ఘంగా ప్రయోగాలు చేసిన తరువాత శరీర శాస్త్రజ్ఞులూ, మనోవిజ్ఞానవేత్తలూ, మస్తిష్కంమీద అవాంఛనీయమైన ఒత్తిడి పెరగటం వల్ల టెన్షన్ పెరుగుతుందనీ, అదే శక్తి క్షయానికి కారణమనీ తెలుసుకున్నారు. జీవనశక్తి భాండాగారం కృశించటం వల్ల జీర్ణమండలం, రక్తప్రసరణ మండలం, శ్వాసకోశం మొదలైనవాటి క్రియలలో నిరోధం కలగటం వల్ల అవి లోపల ఉత్పత్తి చెందుతున్న మురికిని బయటకు నెట్టలేకపోవడం జరుగుతుంది. పోషణలో తగ్గుదల వల్ల, మురికి ఎక్కువ కావడం వల్ల దౌర్బల్యం, వ్యాధి కలుగుతున్నాయి.

మనోవికారాల వల్ల అనారోగ్యం కలుగుతుందని ఎప్పుడో తెలుసు మనకు. కాని ఇప్పుడు వైజ్ఞానికులుగూడా చెప్పటం వల్ల అది శంఖంలో పోసిన తీర్థమైంది. విచార శీలురైన వైద్యులు ఇప్పుడు రోగిపై శారీరకంతోపాటు మానసికమైన పర్యవేక్షణ గూడా చేస్తున్నారు. హెచ్చుతగ్గులు, ఆందోళనలనూ పరిశీలిస్తున్నారు. మందులివ్వడం కంటె ఎక్కువ ప్రాముఖ్యతను మానసిక వికృతులను నిలువరించే ప్రక్రియలకే ఇస్తున్నారు. అందువల్ల రోగాలు త్వరగా నయమౌతున్నాయి. ఇంతకు ముందు అంగ పరీక్షకు ప్రాముఖ్యత నిచ్చేవారు. ఇప్పుడు మానసిక వైద్యం వైద్యరంగంలో ప్రముఖ స్థానం వహిస్తున్నది.

మనోవికారానికి రెండు స్థాయిలున్నాయి. ఒకటి నైతిక క్షేత్రానికి సంబంధించినది. మోసం, దగా, ద్వేషం, దొంగతనం చేయడం, దౌర్జన్యం, హింస వంటి అవరోధాల రూపంలో అది ప్రకటితమవుతుంది. రెండవ స్థాయి పిచ్చి ఆలోచనలు పెచ్చుమీరి పోవడానికి చెందింది. చింత, భయం, ఆందోళన, అవిశ్వాసం, ఉద్వేగం, కాముకత, చెడుదృష్టి, సంక్షోభం, నిరాశ, కోపం మొదలైన వాటివల్ల ఏదో ఒక ప్రమాదం ఏర్పడుతుంది. కారణం చాలాచిన్నది.కాని తీవ్రంగా, పిచ్చిగా ఆలోచించడం వల్ల ఆ కల్పన వాస్తవమనే రంగును పులుముకుని కనిపిస్తుంది. అన్యాయాలన్నీ పరిహాసాస్పదంగా కనిపిస్తాయి. ఈ మనోవికారాల వెనుక నైరాశ్యం ఉంటుంది. తనను తాను ఏకాకిగా భావిస్తూ బాధపడే వాడు మరొకరి యెడ ఉపేక్ష చూపుతాడు. గోరంతని కొండంత చేసుకుని కుమిలిపోతాడు.

ప్రస్తుతం రెండు రకాల మనోవికారాలూ చాలా ఎక్కువగా కనిపిస్తున్నాయి. తెలివి లేమి వల్ల జనం ఈ వలలో చిక్కుకుపోతున్నారు. అనారోగ్యం పెచ్చుమీరి పోవడానికి ముఖ్య కారణం ఇదే. మానసిక ఒత్తిడికి లోనవుతున్న వారిలో ఎక్కువ మందికి చిత్రవిచిత్రమైన రోగాలు ఎన్నో వస్తున్నాయి. ఎన్ని రకాల మందులు వేసుకున్నా, ఎన్ని వైద్యాలు చేసినా తగ్గడం లేదు. వ్రేళ్లను నరికివేయకుండా, కొమ్మలను నరికివేసినంత మాత్రాన విషవృక్షం కృశించి, నశించిపోతుందా? చికిత్స ఏ పద్ధతిలో చేసినప్పటికీ అది క్షణికమే. అంతేగాకుండా కొన్ని మారక ప్రకృతి గలిగిన మందులను వాడటం వల్ల రియాక్షన్లు వస్తాయి. అసలు రోగం మానిపోవటం కన్న వీటి వల్ల వచ్చే కొత్త రోగాలు మరింతగా కృంగదీస్తాయి. ఒక డాక్టరు దగ్గర రోగం తగ్గక, మరో డాక్టరు దగ్గరికి పరిగెత్తడం, అక్కడ మళ్లీ పరీక్షలు చేయటం మందులు మార్చటం మళ్లీ మామూలే. అక్కడా తగ్గక మరో డాక్టరు వద్దకు పరుగులు పెట్టడం వారందరూ డబ్బులు పిండడం- ఇదీ పరిస్థితి.

ఆరోగ్యాన్ని చక్కజేసుకోవడానికి, ఆహార- విహారాల్ని ప్రకృతికి అనుగుణంగా, సాదాగా సాత్వికంగా ఉంచుకోవడం మాత్రమే గాకుండా మరో ముఖ్యమైన విషయం మానసికంగా ఒత్తిడి లేకుండా ఉండటం. ఇందుకు - నైతిక స్థాయికి సంబంధించినంత వరకూ, దృష్టి కోణంలోనూ, ప్రవర్తనలోనూ ఆదర్శాలను నిలుపుకోవడం వల్ల ప్రయోజనం కలుగుతుంది.

**మంచి సంకల్పం చెయ్యి. మంచి మార్గం లభిస్తుంది.**

మరో స్థాయిలో (పిచ్చి ఆలోచనలు) - స్వభావంలో కొన్ని మార్పులు, చేర్పులు చేసుకుంటే సరిపోతుంది.

రోగులందరూ, ఆరోగ్యం చక్కదిద్దుకోవాలని కోరుకునే వారందరూ జీవన విధానాన్ని సౌమ్యంగా, క్రమబద్ధంగా మార్చుకుని, ఆచరణలో ఎంత సంస్కారం సాత్వికత అలవరచుకుంటే అంతగా ప్రమాదం నుండి బయటపడగలుగుతారు. సాదా భారతీయ స్థాయిలో మసులుకుంటూ వాసన, తృష్ణ, అహంకారాల అగ్నిలో తమ జీవితాన్ని తగులబెట్టుకోకుండా జాగ్రత్త పడాలి. ఉన్నత స్థాయి సాఫల్యం పొందటం కోసం వ్యక్తిత్వగరిమను సంపన్నం చేసుకోవాలి. మనోబలం ఈ ఆధారం మీదనే పెరుగుతుంది.

మానసిక చాంచల్యాన్ని పోగొట్టుకోవడానికి నియమ పూర్వకంగా మసలుకోవడం నేర్చుకోవాలి. నైతికత సమగ్ర ఆరోగ్యానికి, దీర్ఘాయుర్దాయానికీ గ్యారంటీ ఇస్తుంది. ఈ క్రమశిక్షణలో, ఆత్మసంస్కరణలో లోపమనేది ఉండకూడదు. ఏదైనా తప్పుచేస్తే దానికి పరిష్కారమార్గంగా ప్రాయశ్చిత్తం కూడా జరుగుతుంది. ఎవరు త్రవ్వుకున్న గొయ్యిని వారే పూడ్చుకోవాలి. దుష్కృత్యాలవల్ల సమాజానికి కలుగుతున్న హానిని పరిష్కరించుకోటానికి పరమార్థపూర్వక సత్కర్మలను చేస్తామని ఒక సునిశ్చితమైన వ్రతధారణ చేయాలి. పాపానికి ప్రాయశ్చిత్తం పుణ్యం చేయడం వల్లనే జరుగుతుంది. పంచామృతాన్ని త్రాగినంత మాత్రాన, గంగలో స్నానం చేసినంత మాత్రాన పాపానికి ప్రాయశ్చిత్తం కలుగదు. విశ్వవ్యవస్థలో కలిగిన కల్లోలం నివారింపబడదు. ధర్మశాస్త్రాలలో రోగ నివారణకు పుణ్య పరమార్థం ప్రయోజనకరంగా చెప్పబడింది. ఇది ఆడంబరాలతో కూడి ఉండకూడదు.

రోగాలు రావడానికి మరో వైజ్ఞానిక కారణం పిచ్చి ఆలోచనల సముచ్చయం. నిరాశ, నిస్పృహ, అనుమానం, చింత అకారణంగానో, సకారణంగానో మానసికతపై దుష్ప్రభావం చూపి టెన్షన్, ఆందోళన పెంచుతాయి. దానివల్ల నిద్రలేమి, కలత నిద్ర వంటి అనేక బాధలు కలుగుతాయి. అవి చాలా కాలంగా నిలవ ఉండడం వల్ల వేళ్లుపాతుకుంటాయి. ఈ పిచ్చి ఆలోచనల వల్ల కలిగే ఉద్వేగాలను అదుపులో పెట్టడం సులభం. దానికి కారణం అవి శీలంలో గాఢంగా నాటుకుని ఉండకపోవడమే. చింతనల కారణంగా స్వభావం పైపొరల మీద ముద్రలు పడతాయి. వాటిని సులభంగా తుడిచి పారవేయవచ్చు. ఈ పని చేస్తే రోగం సగం అదుపులోనికి వచ్చినట్లే.

మనసు తేలికపడితే, మందహాసం దానంతటదే వస్తుందనే మాట నిజం. నవ్వుతూ ఉండటం అలవాటు చేసుకుంటే మన మనస్సు తేలికవుతుందన్నమాట గూడా నిజమే. భ్రాంతి జన్య వికృతాల భారం చాలావరకూ తగ్గుతుంది. అద్దం ముందు నిలబడి నవ్వటం అభ్యాసం చేయాలి. ఇది ప్రతి రోజూ నియమంగా చేస్తుండాలి.

నవ్వుతుంటే మనిషి అందం రెట్టింపు పెరుగుతుంది. వృద్ధులైనా సరే చక్కగా నవ్వుతుంటే వారి ముఖారవిందం వికసిస్తుంది. పలు వరస ముత్యాల మాలవలె తళుక్కున మెరుస్తూ అందమిస్తుంది. మందహాసం వల్ల మరెన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఆత్మవిశ్వాసం, ఆంతరిక సంతోషం, ఉల్లాసం తొణికిసలాడుతాయి. పెదవులను బట్టే వ్యక్తి సంతోషాన్ని కనిపెట్టవచ్చు. ఉల్లాసం, ఉపలబ్ధి, ప్రగతి లభిస్తాయి. నవ్వుతూ ఉంటే ఈతడు దరిద్రుడు కాదు, దుఃఖితుడు కాదు అని దర్శకులకు విశదమవుతూ ఉంటుంది. ఒక విధంగా మందహాసమనేది సుఖజీవన విజయ కేతనం వంటిది. అది అందరికీ కనిపిస్తుంది.

మనం నవ్వుతూ ఉంటే ఎందరో మనతోపాటు నవ్వుతుంటారు. ఏడుస్తుంటే ఎవరూ తోడుండరు. ఒక్కరే ఒంటరిగా ఏడవాలి. మర్యాద కోసం ఇతరులు వచ్చి కూర్చోవచ్చు. కాని ఎక్కువ సేపు ఉండరు. వారి ప్రసన్నతను పాడు చేసుకోరు. అంతేగాకుండా నిరాశతో, ఓటమితో క్రుంగిపోతున్నవాడిని చూస్తే వాడు డబ్బులడుగుతాడేమో, మరేదైనా సహాయం కావాలంటాడేమోనని అనుకుంటారు. ప్రసన్న చిత్తం గలవాడు సుఖపడుతున్నాడు, సంపన్నుడు అని భావించి దగ్గరకు చేరతారు. సంతోషంలో పాలు పంచుకోవాలనుకుంటారు.

నవ్వుతూ ఉండేవాడు నవ్వుతూ కులాసాగా ఉండే వాతావరణంలో ఎక్కువ పని చేయగలుగుతాడు. చిరునవ్వు ఉద్వేగాన్ని తగ్గించడానికి మందులాంటిది. దానిని సేవించే వ్యక్తి, స్వయంగా తాజాగా ఉండటమే గాకుండా దగ్గర ఉన్న వారందరికీ తాజాతనాన్ని పంచిపెడతాడు. అందువల్ల వారిలో ఉద్వేగం, నీరసం తగ్గిపోతాయి.

మంచిగానీ చెడుగానీ అలవాట్లను మనిషి అభ్యాసంతో అలవరచుకుంటాడు. అద్దంముందు కూర్చుని నవ్వడం అభ్యాసం చేస్తూ మిత్రమండలితో నవ్వుతూ, నవ్విస్తూ కాలక్షేపం చేస్తుంటే అది అలవాటైపోతుంది. అందువల్ల ఆరోగ్యం మెరుగుపడుతుంది అనేది నిశ్చయం. దాంతోపాటు మరెన్నో లాభాలు కలుగుతాయి. బహుముఖ సాఫల్యానికి మార్గం సుగమమవుతుంది.

☆ ☆ ☆

**ప్రాణికోటిపట్ల మైత్రిని మేలుకొలిపేదే నిజమైన మతం.**

బోధకథ

# నిరంతర పోరాటానికి మారుపేరు ఆయన

అమెరికాలోని ఒక పెద్ద నగరంలో వ్యవసాయ శాస్త్రవేత్తల సమావేశం జరుగుతున్నది. సంపన్నులు, బుద్ధికుశలురు ప్రతిభాశాలురైన పలువురు విద్యావేత్తలు తమ పరిశోధనల గురించి, అందులో తాము సాధించిన విజయాల గురించీ చర్చ జరుపుతున్నారు. అప్పుడు ఒక పిచ్చివాని వంటి వ్యక్తి హాలులోనికి ప్రవేశించాడు. అతని వాలకం చూచి గేటు కాపలాదారు అడ్డగించినా, అతని చేతిలోని పరిచయ పత్రాన్ని చూచి లోనికి పోనిచ్చాడు.

ఆయన పేరు జార్జి కార్వర్. ఆయన లోపలికి రావటం సభికులు చాలా మందికి పరిహాసాస్పదంగా కనిపించింది. ఇక్కడే గాదు, ఆయనకు ప్రతిచోటా ఇదే తిరస్కారం. ఆయన భుజాల మీద పెద్ద పెద్ద సంచులున్నాయి. ఒంటి మీద గుడ్డలు చిరిగిపోయి, నలిగిపోయి ఉన్నాయి. సంచుల నిండా పుస్తకాలు, లెన్సులు, మోడల్సు, వైజ్ఞానిక ఉపకరణాలూ ఉన్నాయి. లోనికి వచ్చి బరువులు దించి పక్కన పెట్టి కుర్చీలో కూర్చున్నాడు. ఆయన పరిచయాన్ని ఆ సరంజామా చెప్పకనే చేస్తున్నది.

నిర్వాహకులద్వారా ఆహ్వానం పొందిన కార్వర్ ఆ సమావేశంలో ఉపన్యసించవలసి ఉన్నది. తాను మాట్లాడవలసిన సమయం కాగానే తన వస్తువులన్నిటినీ ముందు బల్లమీద పేర్చాడు. అది ఒక విచిత్రమైన స్థితి. అందరూ పట్టించుకోక నిర్లక్ష్యం చేసినా కార్వర్ తన పని తాను చేసుకుపోతున్నాడు. ఎవరి సంగతీ ఆయన పట్టించుకోలేదు. ఆయనకు అక్కడ ఆసీనులైన అందరి సంగతీ తెలుసు. కాని ఆయనకు తాను చేసిన పరిశోధనలపట్ల, వాటి ఫలితాలపట్ల పూర్తి విశ్వాసం ఉన్నది. వాస్తవానికి ఆత్మ విశ్వాసం అనేది ఒక మహత్తర శక్తి. ఆశక్తి అండగా ఉంటే ఎటువంటి పరిస్థితులలోనైనా, ఎక్కడైనా వ్యక్తి తన విలువను ప్రతిష్ఠింప జేసుకోవటం జరుగుతుంది.

ఆయన తన పరిశోధనల గురించీ ఫలితాల గురించీ వివరించి చెప్పేటప్పుడు శ్రోతలందరూ ఆశ్చర్యంలో మునిగిపోయినారు. ఆయన వేషభూషలను చూచి ఏర్పరచుకున్న తేలిక భావం ఆయన ప్రసంగాన్ని వినగానే చెల్లాచెదరైపోయింది. కార్వర్ మూడు గంటలపాటు అనర్గళంగా తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఆయన పరిశోధనల గురించి సభికులందరూ కదలక మెదలక వింటూ కూర్చున్నారు. ఇంతకు ముందు చేసిన పరిశోధనా ప్రసంగాలన్నీ ఈ ప్రసంగం ముందు దిగదుడుపనటానికి గూడా పనికిరానట్లు వారికి అనిపించింది. విద్యా బుద్ధులనేవి వస్త్రధారణలో గాదు, మస్తిష్కంలో ఉంటాయనేది అర్థమైంది. విద్వత్తు అనేది బయటికి కనిపించే పైపై మెరుగులకు సంబంధించింది గాదు. వ్యక్తి ఓజస్సు ద్వారా తేజస్సు ద్వారా అది బయటకు వస్తుంది. అది లోనుండి పెల్లుబుకుతుంది. అది వస్త్రాలలో గోచరించదు. వ్యక్తి ఆత్మవిశ్వాసంలో దర్శన మిస్తుంది. శ్రోతలందరూ తాము అంతకు ముందు ఏర్పరుచుకున్న దురభిప్రాయానికి తామే సిగ్గుపడి తలలు వాల్చుకున్నారు. కార్వర్ మహాశయుని దీక్ష, తత్పరతలతో గూడిన పరిశోధన ఫలితం వారిని ముగ్ధుల్ని చేసింది.

ఈ మహత్తర నిరంతర పారిశ్రామికునికి జన్మనిచ్చి అమెరికాలోని డయమండ్ గ్రోవ్ అనే గ్రామం సార్థకతను పొందింది. ఆయన అక్కడ ఒక నీగ్రో కుటుంబంలో జన్మించారు. అప్పట్లో నల్లజాతి నీగ్రోలు తెల్లజాతి అమెరికన్లకు బానిసలుగా ఉండేవారు. కార్వర్ మహాశయుడు గూడా చిన్నతనంలో తన తల్లితోపాటు ఒక తెల్లజాతి అమెరికన్ నివాసంలో ఊడిగం చేసేవారు.

కొంచెం పెద్దవాడైన తర్వాత తన యజమాని పిల్లలు ఎక్కడికో వెళ్లటం చూచి వారెక్కడికి వెళుతున్నారని తల్లిని అడిగితే, స్కూలుకి వెళుతున్నారని ఆమె చెప్పింది. వెంటనే కార్వర్ తాను గూడా బడికి పోతానని కోరాడు. నాయనా మన నొసటి వ్రాతలో బడికి వెళ్లే భాగ్యంలేదని చెప్పింది. భాగ్యం అనేది ఎవరో నొసట వ్రాసేదికాదన్నాడు చిన్నారి కార్వర్. అలాగా, అయితే ఆ పిల్లలతోనే మాట్లాడుకోమన్నది అమ్మ. నిజంగానే ఆపిల్లల దగ్గరికి పోయి అదృష్టం ఎలా వస్తుందని వారిని ప్రశ్నించాడు కార్వర్. వారికి ఈ ప్రశ్న అర్థం కాలేదు. తల్లితో తాను జరిపిన సంభాషణను వారికి వివరించాడు. సరే! నీవు గూడా మాతో బడికి రావాలనుకుంటున్నావా? అని వారడిగారు. అవును! నేను గూడా చదువుకోవాలనుకుంటున్నాను, నన్ను గూడా మీతోపాటు స్కూలుకు తీసుకు పోతారా? అని అడిగాడు కార్వర్.

యజమాని పిల్లలు అతడికి వర్ణమాలను నేర్పారు. ఇంట్లోనే చదువుకోమన్నారు. ఆ మాటలు మంత్రంలా పని చేశాయి కార్వర్ మీద. నేల మీద పుల్లలతో విద్యాభ్యాసం సాగింది. యజమాని ఇది చూచి అతడి నిష్ఠ గమనించి సంతోషించాడు. కాని తల్లికి భయం వేసింది. తెల్లజాతి యజమానులు క్రూరులు, నిర్దయులు, అత్యాచారులని ఆమెకు తెలుసు. కాని యజమాని ప్రసన్నతను గురించి అతడు వివరించాక ఆమె సంతోషించింది.

సరే యజమానికి చక్కగా సేవ చెయ్యమన్నది తల్లి. కార్వర్ ఆవిధంగానే యజమానికి శ్రద్ధగా సేవలందించేవాడు. తన శ్రద్ధా, విశ్వాసపాత్రతలతో అందరి మనసులూ చూరగొన్నాడు. ఆర్థికంగా యజమాని కార్వర్‌కు ఎట్టి సహాయమూ అందించలేదు గాని, అతడిని

**వ్యసనం మిత్రునిలా ప్రవేశించి, శత్రువులా చంపుతుంది.**

బానిసత్వం నుండి విముక్తుని చేశాడు. అదే గొప్ప అనుగ్రహంగా భావించాడు కార్వర్. అతడు స్వతంత్రుడైనాడు. కాని ఈ స్వాతంత్ర్యం అతడికి లెక్కించలేనన్ని సమస్యలను తెచ్చిపెట్టింది. తాను చదువుకోవాలంటే ఎక్కడ చదువుకోవాలి? ఆరోజుల్లో అమెరికాలో విద్యాలయాలకు కొదవలేదు గాని, వాటిలో నీగ్రో పిల్లలకు ప్రవేశం నిషిద్ధం. నీగ్రోలకు ప్రవేశం ఉన్న పాఠశాల ఎక్కడైనా ఉన్నదేమోనని అన్వేషించాడు కార్వర్. ఎంతగానో వెదికి, ఎంతో దూరంలో న్యాశో నగరంలో నీగ్రో బాలకుల పాఠశాల ఉందని తెలుసుకున్నాడు. తన కుటుంబ సభ్యుల వద్ద సెలవుతీసుకుని బయలుదేరాడు కార్వర్.

పాఠశాల పరిస్థితి అత్యంత హృదయవిదారకంగా ఉన్నది. చిత్తడిగా, మురుగు కంపు కొడుతున్న చిన్న గది. అందులో ఖైదీలలా నిండి ఉన్న పిల్లలు. కార్వర్ పరిస్థితిని అర్థం చేసుకున్నాడు. సాధక బాధకాల గురించి ఆలోచించలేదు. జీవితమే అంత. కష్ట సుఖాల కలగూరగంప. తప్పేదేమున్నది. కార్వర్ విద్యాలయంలో ప్రవేశించాడు. ఏకాగ్రతతో చదువు ప్రారంభించాడు. పరిస్థితులూ కష్ట నష్టాలూ పట్టించుకోకుండా, వాతావరణాన్ని లెక్క చేయకుండా దూసుకు పోవటమనేదే వీరుల లక్షణం. అటువంటి వాడే విజయశ్రీని వరింపగలుగుతాడు. కార్వర్ అటువంటివాడు.

కార్వర్ ముందు మరో సమస్య వచ్చిపడింది. ఖర్చుకు సంబంధించినది. కూడూ, నీడా, గుడ్డా కావాలిగదా! ఎవర్నీ అడగటం, యాచించటం ఆయనకు సుతరామూ ఇష్టం లేదు. తానే స్వయంగా కష్టపడి సమకూర్చుకోదలచాడు. మొట్ట మొదటగా ఆహారం కోసం డబ్బు సంపాదించుకోవాలి. ఎక్కడ చూచినా మొండి చేయి ఎదురైంది. కాని ఆయనలోని ఆశాదీపం కొడిగట్టలేదు. అతడు హతాశుడు కాలేదు. ముందుంచుకున్న లక్ష్యం గొప్పది. లక్ష్య ప్రాప్తికోసం నడుము బిగించాడు.

కఠోరశ్రమను దృష్టిలో పెట్టుకుని బట్టలు ఉతికే పనిని చేపట్టాడు. తెచ్చిన వారివి తెచ్చినట్లు గుడ్డలుతకటం, ఇస్త్రీ చేయటం వారి ఇంటికి తీసుకుపోయి అందజేయటం. బాగానే పైసలు ముడుతుండేవి. కాలం గడిచిపోతోంది. శ్రమతో బాధ్యతతో మెల్లగా పాఠశాలను వదిలి కళాశాల స్థాయికి చేరుకున్నాడు. సంఘర్షణతో గూడిన ఈ యాత్ర ఒక తపస్సు వంటిది. అది చరిత్రను సృష్టించింది.

కాలేజీలో చేరటానికి అప్లికేషను పెట్టే ముందు మరో పెద్ద సమస్య ఎదురైంది. నీగ్రోవిద్యార్థిని చేర్చుకునేటందుకు ఏ కాలేజీ సిద్ధంగా లేదు. కార్వర్ రైతుగా తన్ను తాను ఎంచుకున్నాడు. అందువల్ల వ్యవసాయ శాస్త్రంలోనే డిగ్రీని తీసుకోవాలనుకున్నాడు. హాయిలెండ్ విశ్వవిద్యాలయానికి అప్లికేషన్ పెట్టాడు. అధికారులను సవినయంగా అభ్యర్థించాడు. వారు తిరస్కరించడమే కాకుండా అవమానించి పంపించారు. జార్జి కార్వర్ ఎవ్వర్నీ నిందించక తన కర్మ అని సరిపెట్టుకున్నాడు. ఇండియానోపొలిస్‌లో సింప్సన్ కాలేజీకి వెళ్లాడు. అక్కడ ప్రొఫెసరును కలిశాడు. ఆయన సహృదయుడు కాబట్టి ఈనీగ్రో బాలకునిలో ప్రతిభాబీజాంకురాన్ని పసిగట్ట గలిగాడు. నిద్రాణంగా ఉన్న ప్రతిభను అంచనా వేస్తూ - బాబూ నీవు డిగ్రీ పొందవచ్చు గాని ఉద్యోగమెలా దొరుకుతుంది నీకు అని ప్రశ్నించాడు.

నేను చదవటం ఉద్యోగం కోసం గాదు, విశ్వసేవకు అంకితం కావటమే నా లక్ష్యం. నా సమస్త ప్రతిభనూ విశ్వహితం కొరకు సమర్పిస్తాను - అన్నాడు కార్వర్. ప్రొఫెసరు గారు కార్వర్‌లోని ఈ సర్వజన హిత వాంఛను అర్థం చేసుకున్నారు. అచంచలమైన అతడి ఆత్మ విశ్వాసానికి ప్రభావితులైనారు. కాలేజీ కమిటీకి సిఫారసు చేస్తూ కార్వర్ దరఖాస్తు పత్రాన్ని పంపారు.

కాలేజీ కమిటీ సభ్యులు ప్రొఫెసరుగారి సిఫార్సును కొట్టి పారవేయ లేదు గాని కఠినమైన షరతులను విధించారు. అవి క్రూరమైనవి, అమానుషమైనవీ గూడా. కాని కార్వర్ వాటిని శిరసావహించాడు. నేను పుట్టిందే క్రూరమైన, అమానుషమైన ప్రపంచంలో. నాకు మానావమానాలతో పని లేదు. నా లక్ష్యం వాటికి అతీతమైనది - అన్నాడు. అతనికి విద్యార్థిగా అధికారం లేదు. తెల్లవారితో సమానంగా అధికారాలను కోరగూడదు. హాస్టలులో చేర కూడదు. అన్ని షరతులకూ ఒప్పుకున్నాడు. బట్టలుతుకుతూనే చదువు సాగించాడు. ఈ సాధన అన్ని అవరోధాలనూ దాటించింది. తెల్లవారి అవమానాలు, ప్రతికూలత అతని ప్రగతికి అడ్డు పడలేదు. అంతిమ పరీక్షలో మొదటి స్థానంలో ఉత్తీర్ణత పొందాడు.

అందరూ ఆశ్చర్యచకితులైనారు. కళాశాల అధికారులు గౌరవం చూపారు. అక్కడే ప్రొఫెసరుగా నియమించారు. ఆయన పాఠాలు చెప్పటం మాత్రమే గాక వ్యవసాయ శాస్త్రంలో గొప్ప పరిశోధనలను చేశారు. అమెరికాలో వ్యవసాయాభివృద్ధికి అవి ఎంతగానో తోడ్పడ్డాయి.

ఆయన నీగ్రో అనే సంగతి అందరూ మరచిపోయారు. అంతటా ప్రశంసల జల్లు కురిసింది. రాయల్ సొసైటీ ఆఫ్ ఇంగ్లండ్ ఆయనను స్పిగన్ మెడల్‌తో సత్కరించింది. ఆయన తనవాడని అమెరికా దేశమే గర్వించింది. ఆయన తన నిష్ఠతో తెల్లవారి మనసుల్లో నీగ్రోలయెడ గౌరవభావాన్ని అంకురింప జేశాడు.

కార్వర్ జీవితం శ్రద్ధా, నిష్ఠలకు పర్యాయపదం. పుట్టింది ఎట్టి నీచ నికృష్ట స్థితిలో నైనా కఠోరశ్రమతో, అంకితభావంతో అత్యున్నత స్థాయిని అందుకోవచ్చు ననేటందుకు ఆయన నిదర్శనం.

అనువాదం: డి.వి.ఎన్.బి.విశ్వనాథ్

***

**కర్మతో కలిస్తేనే జ్ఞానానికి సార్థకత; లేకుంటే అది బరువు మాత్రమే.**

## కుటుంబ నిర్మాణం

# దాంపత్య జీవితం సుఖమయం కావాలంటే...

ఆలోచనలను కార్యరూపంలో పెట్టడం, మధుర స్వప్నాలను సాకారం చేసుకోవడం కోసం దాంపత్య జీవితంలో కొన్ని వ్యావహారిక సత్యాలను తెలుసు కోవడం తప్పనిసరి. దాంపత్య జీవితంలో అవరోధాలు లేకుండా ఉండాలి గదా! తమలో ఎవరో ఒకరికి మాత్రమే సంపద, సిరి, వ్యక్తిగత సౌందర్యం, యోగ్యత, ప్రతిభ ఉన్నవని గర్వం పనికిరాదు. భార్య తల్లిదండ్రులు సంపన్నులై ఉండవచ్చు. చిన్న తనంలో ధనికుల ఇంట పుట్టటం వల్ల ఎన్నో భోగ భాగ్యాల ననుభవించి ఉండవచ్చు. కాని వివాహమైన తరువాత భర్త కుటుంబం సంపన్నులు కాకపోవచ్చు, అటువంటప్పుడు భార్య తన ప్రవర్తనలో పూర్వపు దర్పం, వైభవం ప్రకటించడం మంచిది కాదు. అందువల్ల భర్త స్వాభిమానం దెబ్బతింటుంది. పుట్టింటి గొప్పలను చెప్పుకుంటున్నదే అనుకోండి. అత్తింటి గౌరవాన్ని కించపరచిందే అనుకోండి. అప్పుడు భార్య సుఖంగా గడపవలసిన తన సంసార జీవితంలో నిప్పులు పోసుకున్నట్లే. అదే విధంగా తన సౌందర్యం, యోగ్యత, విద్య, ప్రతిభ మొదలైన వాటిని గురించిన గర్వం ఎన్నడూ ప్రకటించగూడదు. భర్త విషయం గూడా అంతే. ఎప్పుడూ తన భర్త తన కుటుంబం గురించి గర్వపడాలి. అప్పుడు భేదాభిప్రాయాలు కలగవు.

అదే విధంగా, ఇతరుల సమక్షంలో భార్య చేత అనవసరపు సేవలు చేయించుకోటం, భార్యను పనిమనిషిలా చూడటం వల్ల భార్య లోలోపల కుమిలిపోయి, సమస్యలు రేకెత్తుతాయి. భార్యకు భర్త ఇంటి పనులలో సహాయం చేయాలి. ఆమెను స్నేహితురాలి మాదిరి గౌరవించాలి. అంతేకాని స్నేహితుల ముందు చిన్నబుచ్చటం మంచిది గాదు. భర్త చెప్పినట్లు భార్య చెయ్యడం మంచిదే. అది బాధ్యతాయుతమైన ప్రవర్తన గూడా. అదే విధంగా భర్త గూడా భార్యను సంప్రదించి అన్ని పనులూ చేయటం మంచిది. అప్పుడు భార్య, భర్త లిద్దరిలోనూ పరస్పర గౌరవ సహకారాలు పెరుగుతాయి. మిత్రులు, పరిచయస్తుల మధ్య వారిద్దరికీ గౌరవం పెరుగుతుంది. అంతేగాని ఇతరుల ముందు ఎవరికి వారు తమ ఆధిక్యాన్ని ప్రదర్శించ కూడదు. ఆదేశానికీ, మర్యాదగా కోరడానికీ స్వరంలో తేడా ఉంటుంది. ఆ ధ్వనిలో తమ గొప్పతనం అవతలి వారి తేలికతనం ప్రతిధ్వని వినిపించగూడదు. "మధూ మా ఫ్రెండ్ సురేష్ వచ్చాడు, వాడికి టీ తీసుకురా'' అని ఆర్డరు వేసే కంటే, "సురేష్, మా ఆవిడ టీ చాలా బాగా కలుపుతుందిరా. టీ కలపాలంటే ఆవిడే కలపాలి. ఆవిడ చేతిలో ఉన్నది ఆ రుచి. డికాక్షన్, పంచదార, పాలు వాటంతటవి కరెక్టుగా అమరిపోతాయి. అలా మరెవరికీ కుదరదు. మధూ! వాడితో పాటు నాకు గూడా నీ అమృత హస్తాలతో మరో కప్పు అందించు. నేను గూడా తరిస్తాను'' అని చెప్పాలి.

దాంపత్య జీవనంలో స్వావలంబన, సహకారం, సమన్వయం చాలా అవసరం. ఒకరు మరొకరికి సహకరించాలి. కాని అవతల వారికి అతిగా అనిపించగూడదు. సహకారం సంతులనంతో కూడి ఉండాలి. అందువల్ల ఒకరి యెడ మరొకరికి ప్రీతి ఎక్కువవుతుంది. ఎవరికి వారు అన్ని పనులూ తామే చేసుకుపోతూ రెండవ వారి సహకారం అర్థించకపోయినా ఇబ్బంది కలుగుతుంది. నాతో ఏంపని అని అలసత్వభావన పుట్టుకు వస్తుందిగూడా. ఎవరి రంగాలలో వారు పని చక్కగా చేసుకుంటూ పోవాలి. మరొకరి పనిలో కొంచెం సహకరించాలి. అప్పుడు ఒకరి కోసం మరొకరు అనే భావన కలిగి పరస్పరం ప్రేమ ఇనుమడిస్తుంది. భార్య చేసే పనిలో భర్త పాలుపంచుకోటం, భర్త చేసే పనికి భార్య సహకరించడం సహకారమవుతుంది. దీనివల్ల ఆకర్షణ పెరుగుతుంది. అది ఎంత చిన్న పనయినాసరే, ఆహ్లాదకరంగా మారుతుంది.

భార్యభర్తలకు ఎవరి రంగంలో వారికి లిపిబద్ధంగాని అధికారాలుంటాయి. భారతదేశంలోనేగాదు, విదేశాల్లో గూడా, ప్రపంచంలో అన్ని కుటుంబాల్లోనూ, ఇంటిపనుల అధికారం, బాధ్యత భార్యదైతే, బయటిపనుల విషయంలో అధికారం, బాధ్యత భర్తకే ఉంటాయి. ఇద్దరి మధ్యనా తమంతట తాముగా సరిహద్దు అతిక్రమణ అప్పుడప్పుడు చేస్తే పరవాలేదు. ఒకరి అధికార క్షేత్రంలోనికి మరొకరు పరస్పరాంగీకారంతో ప్రవేశించవచ్చు. అది బాధ్యతేగాని అధికారం గాదు. సంపద, లావాదేవీల్లో ఒకరికి వివేకం ఎక్కువ ఉండవచ్చు, వారే చేయవచ్చు. కాని రెండవ వారిని చిన్న బుచ్చగూడదు, బలవంతం కూడదు.

జీవితం యెడ సరైన దృష్టి కలిగి నడిచే దాంపత్య సంబంధంలో మాధుర్యం ఉన్నది. జీవితం పూలపానుపుగా ఉండాలని కోరుకుంటే, జీవితం కష్ట సుఖాల సమన్వయ మన్న విషయాన్ని వారు మరచి పోకూడదు. సుఖ, దుఃఖాలను ఉత్సాహంగానే అనుభవించ గలగాలి. వివాహానికి పూర్వం వధూవరులు దాంపత్య జీవితం సుఖాల పూల పానుపు అనుకుంటే, తరువాత కలిగే సుఖ, దుఃఖాలు వారిని కలచివేస్తాయి. ఒకరి మీద మరొకరు నిందారోపణ చేసుకుంటారు. అది పెద్ద పొరపాటు.

దంపతుల్లో ఎవరో ఒకరు జీవితం శూన్యం, కంటకభరితం అసహ్యమని భావించి, దానికి కారణం జీవన సహచరులేనని భావిస్తే, తగాదాలు, పరస్పరదూషణలు మాత్రమే మిగులుతాయి. దుఃఖం సహింపరానిదిగా ఉంటుంది. ఆ దుఃఖాన్ని పరస్పర స్నేహంతో, సేవతో, సానుభూతితో, జీవనోత్సాహంతో పోగొట్టుకోవచ్చు. లేకపోతే పరిస్థితి భయానకంగా తయారవుతుంది. అందువల్ల మొదట్లోనే

**మనిషిలోని అన్నిటి కన్నా గొప్ప శక్తి సంకల్ప శక్తి. అన్నిటికన్నా గొప్ప దోహదకారి ఆత్మవిశ్వాసం.**

జీవితపు యథార్థ స్వరూపాన్ని తెలుసుకోవాలి. రాబోయే కష్ట సుఖాలను అనుభవించడానికి సంసిద్ధం కావాలి. అందువల్ల పని సులభమవుతుంది. కష్ట సమయాల్లో ధైర్యంగా ఉండి కష్టాలను ఎదుర్కోవాలి. భార్యా, భర్తలు దుఃఖాన్ని ఒకరు మరొకరిపైకి నెట్టకుండా, సమానంగా పంచుకోవాలి. అది వివేకమనిపించుకుంటుంది. ఒకరితో ఒకరు చెప్పుకున్నా మరొకరికి నొప్పి కలగ గూడదు. భర్త పైఅధికారి అతని మీద కోపంతో ఉన్నాడు. ఆఫీసులో భర్తతో అతని ప్రవర్తన బాగుండలేదు. అందువల్ల భర్త విచారిస్తున్నాడు. పైఅధికారి గాబట్టి అతడినేమీ అనలేక ఆకోపమంతా ఇంట్లో భార్యమీద చూపిస్తాడు, తగాదాపడతాడు. అది మూర్ఖత్వం. భర్త ఆఫీసులో బాగా కష్టపడి అలిసిపోయి ఇంటికి వస్తాడు. ఇంటికి రాగానే భార్య తన కష్టాలనన్నిటినీ ఏకరువు పెడుతుంది. పిల్లలు పెట్టిన అవస్థలు, ఇరుగు పొరుగు వారితో చికాకుల చిఠా విప్పుతుంది. అటువంచి వ్యవహారం మంచిది గాదు. ఒకరి నొకరు గమనించి మసలుకోవాలి. మెల్లగా సర్దుకుపోవాలి.

ఒకరి నొకరు కలుసుకున్నప్పుడు వీలైనంత ప్రసన్నంగా ఉల్లాసంతో ఉండాలి. అది టానిక్‌లా పని చేస్తుంది. దాంపత్య జీవనానికి యౌవనాన్ని ప్రసాదిస్తుంది. సంఘటనలు భార్యా, భర్తల వశంలో ఉండవు. కాని ఆవేగం మీద అంకుశం ప్రయోగించ గలిగితే, ఎట్టి గడ్డు పరిస్థితులలోనైనా, ఒకరి ఆసరాతో మరొకరు సర్దుకు పోగలరు. భర్త ఎంత తెలివిగలవాడైనా, భార్య ఎంత ఓర్పు కలిగినదైనా, వారిని మరొక పురుషునితోగానీ, మరొక స్త్రీతోగానీ పోల్చి అవమాన పరిస్తే పరిస్థితి చెడిపోతుంది. ఒకరిని మరొకరు ప్రశంసించుకోవాలి. శ్రీమతీ నువ్వెంత ఓర్పుతో, సమర్థతతో ఇల్లు సర్దుకుపోతున్నావు, అనాలి. అంతేగాని పక్కింటావిడ ఇల్లు ఎంత చక్కగా సర్దుతుంది, ఎంత సమర్థవంతంగా ఇల్లు దిద్దుతున్నది, అని మరొకరిని పొగడ గూడదు. అటువంటి ప్రవర్తనవల్ల ఎంత చక్కని దాంపత్యమైనా మలినమవుతుంది. అనుమానాలు కలుగుతాయి. అన్యోన్యత, తదేక నిష్ఠ పతి పత్నులకు చాలా అవసరం. వివాహానికి ముందు జీవితం ఎలా ఉన్నా సరే పెళ్లయిన తరువాత భార్య భర్తను, భర్త భార్యను తన ప్రవర్తనతో రంజింప జేయాలి. అతి భావుకత్వం పనికి రాదు. వివాహానికి ముందు జరిగిన విషయాలను చెప్పి విశ్వాసపాత్రతను ప్రకటించుకోగూడదు. ఈ భావుకత ఎక్కువశాతం దంపతులలో సందేహానికి అంకురం మొలకెత్తిస్తుంది. అది చిలికి చిలికి గాలి వానవుతుంది.

పుత్రికను దుహిత అనటంలో విశేషం ఉన్నది. దుహిత అంటే దూరంగా ఉండడంలో హితమున్నది అని అర్థం. భార్యా భర్తలు చిన్నతనం నుండీ ఒకొరికొకరు పరిచితులు కావచ్చు. ఒకరి మంచి చెడ్డలు మరొకరికి బాగా తెలిసి ఉండవచ్చు. అటువంటి వారి జీవితాల్లో ఝంఝూమారుతాలు వీయవచ్చు. చెడ్డ విషయాలు భూత ప్రేతాల్లా ఎదుట నిలుస్తుంటాయి. ఒకరి మీద మరొకరికి విరక్తి కలుగుతుంది. మంచి విషయాలు గుర్తుపెట్టుకోవడం మంచిదేగాని చెడు విషయాలు మరచిపోవటం మంచిది. అంతేగాని భావుకతతో వాటినే ఆలోచించడం కూడదు.

వివాహానికి ముందు కలలు కంటుంటారు. వాటిని నిజం చేసుకునేటందుకు ప్రయత్నించవలసిందే. గాలి మేడలు కట్టటం గాదు. మనం ఎంతవరకు చేయగలం, ఎంతవరకు నిజం చేసుకోగలం అనేది ఆలోచించి ఆచరణలో పెట్టాలి. నిదానంగా, ఆచితూచి అడుగులు వేస్తూ ముందుకు సాగాలి. క్రిందపడినప్పుడు లేచి నిలబడడం నేర్చుకోవాలి.

ఎవరికి వారికి శారీరక వ్యవస్థలోనూ మానసిక వ్యవస్థలోనూ తేడాలుంటాయి. కాని శరీరం మనస్సు కలిసి ఒక సామాన్య స్వరూపం ఉంటుంది. పైన చెప్పిన విషయాలన్నీ సాధారణంగా దంపతులందరియడ వర్తిస్తాయి. కొందరికి నిరర్థకంగా కనిపించవచ్చు. కాని వాటి ప్రయోజనం తక్కువేమీ గాదు.

దాంపత్య జీవనం మొగ్గతొడిగి వికసించినప్పుడు, దాని సౌరభంతో కుటుంబ సభ్యులు, సమాజం, దేశం, ప్రపంచం పులకితమవుతాయి, ఆనందిస్తాయి. దాంపత్యం మధురమూ, సఫలమూ, సార్థకమూ కావాలి. భార్యభర్తల సుఖ దుఃఖాలు వారికే గాదు, సమాజానికి గూడా చెందుతాయి. నేటి యుగంలో పరిస్థితులు వివాహవ్యవస్థయే అనవసరం అనిపించేటట్లు చేస్తున్నాయి. ఈ బుద్ధివాద యుగంలో, ఈ స్థితిలో దాంపత్య వ్యవహారాన్ని సరిగా అర్థం చేసుకోవాలి. ఇది ఇప్పుడు మరింత తప్పనిసరి. ఈ తథ్యాన్ని గ్రహించి ఆ ప్రయోజనాన్ని మరింతగా నేరవేర్చాలి.

అనువాదం: డి.వి.ఎన్.బి.విశ్వనాథ్

☆ ☆ ☆

## ఓటమి నేర్పే పాఠం

ఒక సాలె పురుగు పెద్ద గూటిని అల్లుతోంది. అది పదే పదే తెగిపోతోంది. నిరాశ చెందక అది చేసిన కృషి 14వ సారి ఫలించింది. పరాజితుడై 13 సార్లు ఓడిపోయిన గ్రూసో ఈ దృశ్యాన్ని చూచి ప్రభావితుడై రెట్టింపు ఉత్సాహంతో 14వసారి యుద్ధంచేసి విజయాన్ని సంపాదించాడు. "ప్రతి ఓటమీ పూర్తి తత్పరతతో పనిచేయలేదనే సత్యాన్ని మనకు తెలియజేస్తూ ఉంటుంది" అని గ్రూసో అనేవాడు. ఎవరైతే తమ తప్పుని తెలుసుకొని దిద్దుకుంటారో వారు అసంభవాన్ని సంభవం చేసి చూపగలరు. సామర్థ్యాన్ని పొందగల్గుతారు. నిరంతర శ్రమకు అర్థం ఆత్మ విశ్వాసం. నేను దీనిని తప్పక పూర్తి చేస్తాననే విశ్వాసం అంతరంగంలో జాగృతమైన నాడు, ఎంత నికృష్టస్థితిలో ఉన్నా ఉన్నత శిఖరాలను అధిరోహించ గల్గుతాడు.

- ప్రజ్ఞాపురాణం నుండి

**మనలో జ్ఞానం పెరిగిన కొలదీ ఔదార్యం పెరుగుతుంది.**

# నావారితో నా మాట

## 1.దేవసంస్కృతి విశ్వవిద్యాలయంలో జీవన కళలో శిక్షణ

క్రమబద్ధంగా జీవించడం ఒక కళ. అన్నిటినీ మించిన విద్య ఇది. ప్రతి యువకుడూ, ప్రతి జిజ్ఞాసువూ నేర్చుకోవలసిన విద్య ఇది. దురదృష్టమేమంటే - నేడు వివిధ విశ్వ విద్యాలయాలలో, కళాశాలలలో, విద్యాలయాలలో ఈ ఆర్ట్ ఆఫ్ లివింగ్ కళను తప్ప మిగిలిన వన్నిటినీ నేర్పుతున్నారు. 'ఆర్ట్ అఫ్ లివింగ్' అంటే ప్రతి శ్వాసలో అధ్యాత్మను జీవించడం. "హోల్ లైఫ్ ఈజ్ యోగా" (జీవితమంతా యోగమే) అన్నారు శ్రీ అరవిందులు. "హోల్ లైఫ్ ఈజ్ స్పిరిట్యూ ఆలిటీ" (జీవితమంతా ఆధ్యాత్మికతయే) అన్నారు పరమపూజ్య గురుదేవులు. వీరిరువురూ ఒకే సత్యాన్ని వేర్వేరు మాటలలో చెప్పారు.

వాస్తవానికి విశుద్ధమైన భారతీయ ఆధ్యాత్మికత జీవన కళయే. కనుక, మన సంస్కృతియే జీవన కళకు మూలాధారం కాగలుగుతుంది. పాశ్చాత్య సభ్యతకు ఆ సామర్థ్యం లేదు. జీవన కళలో మనిషిని మహామానవుడుగా రూపొందించే సూత్రాలన్నీ ఇమిడి ఉన్నాయి.

**దేవసంస్కృతి విశ్వ విద్యాలయంలో** 2004-2005 విద్యా సంవత్సరంలో 'జీవన కళ'ను పాఠ్య ప్రణాళికలో చేర్చుతున్నారు. జీవితంలోని వివిధ సమస్యలు, జీవన సరళిలోని వివిధ కోణాలు, వ్యవహారకుశలత, జప సాధన వంటి ఆత్మ నిర్మాణ సూత్రాలను ఇందులో బోధిస్తారు. ఈ విద్యా బోధన నేటి విద్యా విధానంలోని ఒక పెద్ద లోపాన్ని పూరిస్తుంది. తద్వారా విద్య సర్వతోముఖం అవుతుంది.

'జీవన కళ' పాఠ్యక్రమాన్ని నాలుగు భాగాలుగా విభజించారు. వీటిని నాలుగు సెమిస్టర్‌లలో బోధిస్తారు. మొదటి సెమిస్టర్‌లో నిర్మాణాత్మకంగా జీవించే కళ నేర్పుతారు. రెండవ సెమిస్టర్‌ను జీవితంలోని వికృతులు, వాటి పరిష్కారం అనే విషయంపై కేంద్రీకరిస్తారు. మూడవ సెమిస్టర్‌లో ఆధ్యాత్మిక జీవన కళలో శిక్షణ ఇస్తారు. నాల్గవ సెమిస్టర్‌ను ఆధ్యాత్మిక శిక్షణ కళ కేంద్రంగా నిర్వహిస్తారు. నాలుగు సెమిస్టర్‌లతో కూడిన డిగ్రీ/పి.జీ కోర్సులలో ఈ నాలుగు సెమిస్టర్ల ప్రశిక్షణలను మేళవిస్తారు. ఫలితంగా దేవసంస్కృతిపై ఆధారపడిన ఈ నిర్బంధ పాఠ్యక్రమం యోగం, మనస్తత్వ శాస్త్రం, భారతీయ సంస్కృతి, సమగ్ర ఆరోగ్య యాజమాన్యం, స్వావలంబనలతోపాటు భవిష్యత్తులో ప్రారంభించే విభాగాలతో ముడిపడి ఉంటుంది. యోగ విద్యార్థులు కూడా ఈ జీవన విద్యలో ప్రవీణులు అవుతారు. ఐ.టి, బి.టి, హోలిస్టిక్ మెడిసిన్ (సర్వతోముఖ వైద్యశాస్త్రం) విద్యార్థులు కూడా ఈ జీవన విద్యలో ప్రవీణులు అవుతారు. ఆ తర్వాత క్రమక్రమంగా ఈ విద్య వర్క్‌షాపులను వివిధ విశ్వవిద్యాలయాలలో కూడ ఏర్పాటు చేస్తారు. ఆ విధంగా ఈ విద్య మన విద్యా విధానంలో అంతర్భాగం కాగలుగుతుంది.

ఈ జీవన కళ పాఠ్యక్రమంలోని మొదటి సెమిస్టర్‌కు **నిర్మాణాత్మకంగా జీవించే కళ** మూలాధారంగా ఉంది. ఇందులో సిద్ధాంతపరమూ, ప్రయోగపరమూ అయిన శిక్షణ ఉంటుంది. సిద్ధాంత భాగంలో మానవ జీవన పరిచయం, అందులోని అనంతమూ, అత్యంత శ్రేష్ఠమూ అయిన అవకాశాలు, లక్ష్య నిర్ణయం, తన వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకోవడం వంటి అంశాల సాధారణ పరిచయం కల్పిస్తారు. నేడు మనిషి జీవన సరళి వికృతం అయిపోయింది. కనుక శరీర ఆరోగ్యాన్ని ఎలా పరిరక్షించుకోవాలి? జీవన సరళిని (ఆహార విహారాలు, వేష భూషలు, మాటామంతీ) ఎలా సక్రమంగా నిలుపుకోవాలి? జీవితంలో సంయమనానికీ, సదాచారానికీ గల ప్రాముఖ్యం ఏమిటి? వాతావరణానికీ, పరిస్థితులకూ అనుగుణంగా జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవాలి? - ఈ అంశాలలో శిక్షణ గరపడం తప్పనిసరి అవుతోంది. ఈ శిక్షణ లోపించడంవల్ల కొందరు విద్యార్థులు క్రూరకృత్యాలు జరుపుతున్నారు. రాగింగ్ చేస్తున్నారు. ప్రవీణులూ, బుద్ధికుశలురూ, అయినా జీవన సరళి పరిచయంలేని విద్యార్థులు వారి ఆగడాలకు గురి అవుతున్నారు.

కల్పనా శక్తి, ఇచ్ఛా-సంకల్ప శక్తి, భావన, బుద్ధి, స్మృతి, నిర్మాణాత్మకత, భావాత్మక దృక్పథం (పోజిటివ్ మెంటల్ ఏటిట్యూడ్)లు కూడ ఈ మొదటి ఆరు మాసాల పాఠ్యక్రమంలో ఉంటాయి. శ్రేష్ఠమైన ఆలోచనల ఆదర్శాల ప్రాముఖ్యం, ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం, ఆత్మపరీక్ష, సాఫల్యానికి సరైన కొలబద్దలు, వ్యవహారకుశలత, కుటుంబంలో సామాజిక పరిస్థితులలో దానిని అమలు జరపడం - ఇవన్నీ ఈ విద్యలో ఉంటాయి. సమయ సద్వినియోగం (టైమ్ మేనేజ్‌మెంట్), సమతూకం ఆకర్షణ కలిగిన వ్యక్తిత్వాన్ని నిర్మించడం, సమర్థవంతంగా తనను తాను

**మనిషికి విషయ సుఖాలే సర్వస్వం కాకూడదు.**

వ్యక్తపరచడం, నాయకత్వ సామర్థ్య వికాసం - ఇవికూడా ఈ సెమిస్టర్‌లో ఉంటాయి. ప్రజ్ఞాయోగం, శిథిలీకరణ, ప్రాణాకర్షణ ప్రాణాయామం, డైరీ వ్రాసుకోవడం, సెల్ఫ్ విజువలైజేషన్ (ఆత్మ దర్శనం), ప్రణాళికాబద్ధ మైన కార్య పద్ధతిని నిర్ణయించడం, ఆత్మబోధ - తత్వబోధ, **15** నిమిషాలపాటు సార్థక గాయత్రీ జపం, జ్యోతి అవతరణ యొక్క ధ్యాన - ధారణ, స్వాధ్యాయం ఈ సెమిస్టర్‌లో ఉంటాయి.

రెండవ సెమిస్టర్ **జీవితంలోని వికృతుల పరిష్కారం** పై కేంద్రీకరించబడి ఉంటుంది. ఇందులోని సిద్ధాంత భాగంలో మానవ జీవితంలో సాఫల్యాల కొరత, అవకాశాలు సద్వినియోగం కాని స్థితి, కర్మఫల వ్యవస్థ, నైతిక విశ్వాసాలు లోపించడం, అందువల్ల తగ్గుతూన్న కార్యశూరత, కుటుంబంలో, కార్యాలయంలో, సామాజిక పరిస్థితులలో క్రమబద్ధత లోపించడం వంటివి ఉంటాయి. క్రమబద్ధం కాని, విశృంఖలమైన జీవన సరళి, అపరిశుభ్రత, గమ్యం లేని జీవితం, దుర్వ్యసనాలు, సంయమనం లోపించడం, సోమరితనం, నిర్లక్ష్యం మున్నగు వానివల్ల కలిగే నష్టాలు, వాటి పరిష్కారాలు ఇందులో ఉంటాయి. వ్యతిరేకాత్మక దృక్పథం, ఉద్రిక్తత, నిరాశ, మనస్సు కుంచించుకుపోవడం, విషాదం, వైఫల్య భయం, ఆత్మముగ్ధత, పగటి కలలు, ఆత్మహీనత, అపరాధ భావం, నింద, పరదోషారోపణ, అసూయా ద్వేషాలు మున్నగు దుర్గుణాల నిర్ధారణ, పరిష్కారం - ఇవన్నీ ఇందులో ఉంటాయి. దంభం, ఉగ్రస్వభావం, హింసాప్రవృత్తి, లాలస, గొప్పతనం కోసం అత్యాశ, అపరాధ మనస్తత్వం, ఖండిత వ్యక్తిత్వం - వీటి నిర్ధారణ, పరిష్కారం కూడా ఇందులో ఉంటాయి.

ప్రయోగపరంగా - మొదటి సెమిస్టర్‌లోని విషయాలతోపాటు లోమ-విలోమ ప్రాణాయామం, దివ్య అనుదాన ధ్యాన-ధారణ, ప్రార్థన, ప్రాయశ్చిత్త విధి, మృదు చాంద్రాయణం, నిష్కాసన తపం, నిష్కామ సేవలోని వివిధ క్రియాత్మక అంశాల శిక్షణ జరుగుతుంది.

మూడవ సెమిస్టర్‌లోని కేంద్ర బిందువు - **ఆధ్యాత్మిక జీవనం.** మనిషిలో ఇమిడిఉన్న ఆధ్యాత్మిక అవకాశాలు, అంతర్ దృష్టి (ఇన్ట్యూషన్), అతీంద్రియ శక్తులు, ఆధ్యాత్మిక దృష్టిని మేలుకొలిపే విజ్ఞానం, తపస్సు, యోగం ఇందులో నేర్పుతారు. ఆత్మిక ప్రగతిలో గురువు పాత్ర, గురు-శిష్య సంబంధం, ఆధ్యాత్మిక సాధనలో సహాయపడే తత్వాలు, ఆ సాధనలో వచ్చే అవరోధాలు, పునర్జన్మ - మోక్షం, ఆధ్యాత్మిక జీవన సరళి అంటే ఏమిటి - ఇవన్నీ నేర్పుతారు. స్థూల, సూక్ష్మ, కారణ శరీరాల ఆధ్యాత్మిక పరిచయం, విభూతులు, వాటి జాగరణకు పద్ధతులు, కర్మయోగ జ్ఞానయోగ భక్తి యోగములు, వాటి కోసమై ఆరాధన, సాధన, ఉపాసనల శిక్షణ - ఇవన్నీ నేర్పుతారు. శ్రద్ధ - ప్రజ్ఞ - నిష్ఠల సిద్ధాంతం కూడా నేర్పుతారు. పంచకోశాల ఆధ్యాత్మిక పరిచయం, వానిలో ఇమిడి ఉన్న దివ్య అవకాశాలు, వాటి జాగరణకు పద్ధతులు, షడ్ చక్రాలు కుండలినిల పరిచయం, వాటి జాగరణకు సంబంధించిన విజ్ఞానం, ఆధ్యాత్మిక జీవన లక్షణాలు దానికి కొలబద్దలు కూడ నేర్పుతారు.

క్రియాత్మక విభాగంలో - మొదటి, రెండవ సెమిస్టర్‌ల విషయాలతోపాటు సాధక దైనందిని (డైరీ)ని ప్రతిరోజు వ్రాయడం, సాప్తాహిక ఉపవాసం, సోఽహమ్, ప్రాణాయామం, సవితా ధ్యానం, ఆత్మదర్శన సాధన, నాదయోగం ఉంటాయి.

నాల్గవ సెమిస్టర్‌కు కేంద్ర బిందువుగా **ఆధ్యాత్మిక శిక్షణ కళ** ఉంటుంది. ఆధ్యాత్మిక ఆచార్యునికి తప్పనిసరిగా ఉండవలసిన గుణాలు, ఉన్నత ధ్యేయం, ఈశ్వరనిష్ఠమైన జీవనం, తపశ్చర్య, నిరాడంబరత్వం - నమ్రత, సంస్కారవంతులు ప్రభావశాలురు అయిన వ్యక్తుల జీవితాలు - ఇందులో ఉంటాయి. విద్యార్థులలో దాగి ఉన్న యోగ్యతలు, ప్రత్యేకతలు, భావి అవకాశాలు, దౌర్బల్యాలు, ద్వంద్వ ప్రవృత్తి మున్నగు వాని ద్వారా వారి మనస్సు, వ్యవహారణల అవగాహన, సముచితమూ సహానుభూతియుతము అయిన మార్గదర్శనం - ఇందులో ఉంటాయి. భావపూర్ణ సంప్రేషణ, సహృదయత, సంవేదనశీలతల పాత్ర, ప్రభావవంతమైన ఆధ్యాత్మిక శిక్షణ పద్ధతులు, సూక్ష్మ వైచారిక సంప్రేషణ, దీక్షాతత్వం మున్నగునవి ఇందులో ఉంటాయి. శీలం, ఆలోచన వ్యవహారణలలో ప్రామాణికత, గుణ కర్మ స్వభావముల శ్రేష్ఠత, ప్రజాసేవపట్ల అంకిత భావం, ఈశ్వరీయ కార్యాలపట్ల సమర్పణ, నిరహంకారం వంటి స్వర్ణ సూత్రాలను ఇందులో నేర్పుతారు. బుద్ధ భగవానుడు, స్వామి వివేకానంద, శ్రీఅరవిందులు, రమణ మహర్షి, ఆచార్య శ్రీరామశర్మగార్ల శిక్షణ పద్ధతులను కూడ నేర్పుతారు. క్రియాత్మక విభాగంలో - మొదటి మూడు సెమిస్టర్‌ల క్రియావిధులలో విద్యార్థులను నిష్ణాతులను చేస్తారు.

బంగారాన్ని అగ్నిలో కాల్చి శుద్ధిచేసి భస్మంగా తయారుచేసి ఔషధంగా వాడతారు. అలాగే, జీవన కళ అనే అగ్ని విద్యద్వారా తపింపజేసి భావి భారత పౌరులను మేధావులు, సంవేదనశీలురు, జీవన నిర్వహణ యాజమాన్యంలో కుశలురు అయేటట్లు ఈ శిక్షణ తీర్చిదిద్దుతుంది. నేడు కాకుంటే రేపయినా అన్ని సాంకేతిక విశ్వవిద్యాలయాలు, ఇతర విశ్వవిద్యాలయాలు ఈ జీవన కళను తమ పాఠ్యక్రమాలకు కేంద్ర బిందువుగా చేసుకోవలసి ఉంటుంది.

**తపస్సు మన బలహీనతను బలంగా, అవిద్యను జ్ఞానంగా మార్చుతుంది.**

# 2. శీతాకాలంలో శాంతికుంజ్‌లో నడిచే శిబిరాలు

శాంతికుంజ్ గాయత్రీ తీర్థానికి రావడం, ఇక్కడి సాధన శిబిరాలలో పాల్గొనడం సాధకులకు ఒక మహత్తర సౌభాగ్యం. ఇది మహాకాలుని ఆలయమనీ, ఇక్కడనుండి 21 శతాబ్దపు జ్ఞాన గంగోత్రి ప్రవహించిందని పరమపూజ్య గురుదేవులు చెప్పేవారు. శరన్నవరాత్రితో ఆరంభమయే శీతాకాలానికి ఒక ప్రత్యేకత ఉంది. ప్రధానమైన సాధనలన్నీ ఈ రోజుల్లోనే జరుగుతాయి. పగటి సమయం తగ్గుతుంది. రాత్రి సమయం పెరుగుతుంది. బాగా చలిగా ఉండడంతో వ్యక్తి అంతర్ముఖుడు అవుతాడు. ఈ కాలంలో చేసే సాధన సఫలం అవుతుంది. ఇప్పుడు ఇక్కడ దేవసంస్కృతి విశ్వవిద్యాలయం కూడ ఉన్నది. దానిలో సుమారు పదివేల ఉత్తమ గ్రంథాలు ఉన్నాయి. చదువు చెప్పేవారు సమయదానం ఇచ్చిన విద్వాంసులు. నేర్చుకోదగినది ఎంతో ఉంది. చలి మరీ హెచ్చుగా ఉండదు. శాంతికుంజ్‌లో, మథురలోని గాయత్రీ తపోభూమిలో, ఆవల్‌ఖేడాలోని జన్మభూమి తీర్థంలో సంవత్సరమంతా శిబిరాలు నడుస్తూ ఉంటాయి. మిగితా రెండు స్థలాలలో ప్రకటించిన శిబిరాలు మాత్రమే జరుగుతాయి. అయితే, శాంతికుంజ్‌లో ప్రతి క్షణం ఏదో ఒక శిబిరం జరుగుతూ ఉంటుంది. తనకు సంబంధించిన విస్తృత వివరణ ఇచ్చి, ముందుగా అనుమతి పొందిన తర్వాత ఎవరైనా ఇక్కడికి రావచ్చు. శాంతికుంజ్‌లో శీతాకాలంలో జరిగే శిబిరాలు ఇవి :

**1. తొమ్మిది రోజులు, నెలరోజుల సంజీవనీ సాధన శిబిరం:** ఈ శిబిరాలు ప్రతినెలా 1 నుండి 9, 11 నుండి 19, 21 నుండి 29 తేదీలలో జరుగుతాయి. తొమ్మిది రోజుల శిబిరంలో 24వేల గాయత్రీ మంత్ర అనుష్ఠానం, ప్రేరణ ఇచ్చే 8 ప్రవచనాలు, ప్రేరణ ఇచ్చే గోష్ఠులు, వీడియో సందేశాలతో సాధకుని దినచర్య తీరికలేనిదిగా ఉంటుంది. ఉదయం 4 గంటలకు నిద్ర లేవాలి. హిమాలయాలకు సమీపాన ఉన్నా, ఇబ్బంది కలిగించే చలి ఉండదు. తీర్థాలలో తప - తితిక్షలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. కొందరు నెలరోజుల సాధన కోసం వస్తారు. ఒక జీవన సాధన శిబిరంలో వారు పాల్గొంటారు. మిగతా సమయంలో సునిశ్చితమైన మార్గదర్శనంలో సాధన క్రమం అమలు చేస్తారు.

**2. అంతః ఊర్జా జాగరణ శిబిరం:** ఇది అయిదు రోజులపాటు జరిగే మౌన సాధన శిబిరం. ఈ శిబిరంలో పాల్గొనగోరేవారు ముందుగా కనీసం ఒక తొమ్మిది రోజుల సాధన శిబిరంలో పాల్గొని ఉండాలి. ఈ సంవత్సరం శిబిరాలు అక్టోబరు 11 నుండి డిసెంబరు 25 వరకు జరుగుతాయి. (1 నుండి 5, 6 నుండి 10 - ఈ క్రమంలో) ఆతర్వాత 2004 జనవరి 6 నుండి 20 వరకు, జనవరి 31 నుండి ఫిబ్రవరి 29 వరకు, మార్చి 1 నుండి 20 వరకు జరుగుతాయి. మొత్తం 28 శిబిరాలు జరుగుతాయి. ఈ సంవత్సరం ప్రతి శిబిరంలో 32 మంది సాధకులను మాత్రమే తీసుకుంటారు. తాను మౌనంతో పాటు, ఇతర నియమాలను పాటించగలడో లేదో ప్రతి సాధకుడు ముందుగా వివరంగా తెలియజేయాలి.

**3. యుగశిల్పి, పరివ్రాజక శిబిరం:** ఈ శిబిరాలు వరుసగా నెల, 45 రోజులపాటు జరుగుతాయి. యుగశిల్పి పాఠ్యక్రమంలో పౌరోహిత్యం, సంభాషణ, సంగీతం, యుగ నాయకత్వాలలో ప్రాథమిక శిక్షణ ఇస్తారు. పరివ్రాజక శిబిరాలు మరో 15 రోజులు కొనసాగుతాయి. ప్రజా నాయకులుగా తయారుకావాలని కోరే సాధకులకు ఈ శిబిరం ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఈ శిబిరం ప్రతినెలా 1 నుండి 31 వరకు, ఆ తార్వాత 15 రోజులు నడుస్తుంది.

**4. తొమ్మిది రోజుల నిర్మాణాత్మక శిబిరం, ఆరు రోజుల ఆర్.సి.హెచ్ శిబిరం:** స్వావలంబన, గ్రామ యాజమాన్యం - కుటీర పరిశ్రమలు ప్రాధాన్యం వహించే ఈ శిబిరాలు ప్రతి నెలా 10 నుండి 18, 29 నుండి 7వ తారీకులలో జరుగుతాయి. మాతా శిశు ఆరోగ్యం, ప్రసూతికి సంబంధించిన ప్రశిక్షణ కూడా ఆరురోజులపాటు ప్రతినెల 23 నుండి 28 వరకు ఇవ్వబడుతుంది. ప్రభుత్వ సంస్థలు, ఆరోగ్యంపట్ల ఉత్సాహం చూపే మిషన్‌కు చెందిన సమూహాలకు ఇందులో ప్రాధాన్యం ఇస్తారు.

**5. వివిధ శిబిరాలు :** భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష గోష్ఠులు, విశ్వవిద్యాలయాల వర్క్‌షాప్‌లు, కార్యకర్తలకు సంస్థాగతమైన ప్రశిక్షణ, అయిదు రోజుల వ్యక్తిత్వ సంస్కరణ శిబిరాలు, నైతిక ప్రశిక్షణ శిబిరాలు, $2^1/_2$ రోజుల జీవన యాజమాన్య శిబిరాలు ఈ శిబిరాలలో ముఖ్యమైనవి. అవసరాన్నిబట్టి ఈ శిబిరాలు ఏర్పాటు అవుతాయి.

ఈ శీతాకాలం సాధకులకు ఒక ప్రత్యేక అవకాశం. ప్రశిక్షణ లేనిదే మనిషి తన కౌశల్యాన్ని, ఆత్మశక్తినీ వెలికితీయలేడు. అలాంటి అవకాశం మన జీవితంలో కూడా లభించాలని ఈ శీతాకాలంలో సాధకులు ఆలోచన చేయాలి.

☆☆☆

**నిజాయితీగా సంపాదించిన కొద్ది డబ్బు కోట్ల రూపాయలకన్న హెచ్చు ఆనందం ఇస్తుంది.**

# శాంతికుంజ్ సమాచారం

## సాధన సంవేదనల సంగమం మాతాజీ దివ్య జీవనం - డా॥ ప్రణవ్ పండ్యాజీ

### సంవేదన, సాధన, సుసంస్కారం, సంవర్ధనం, సువ్యవస్థల ప్రతిరూపం మాతాజీ జీవన లీల

- అని అఖిల విశ్వ గాయత్రీ పరివార్ ప్రముఖులు డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ మాతా భగవతీదేవి శర్మ 9వ వర్ధంతి సభలో ప్రసంగిస్తూ పేర్కొన్నారు.

శాంతికుంజ్ ముఖ్య సభా మండపంలో చేసిన ఆ ప్రసంగంలో వారింకా ఇలా అన్నారు -

వన మూలికలతో తయారైన ఔషధాలను తేనెతో కలిపి త్రాగిస్తారు. అలాగే, జ్ఞానాన్ని సంవేదన అనే అనుపానంతో కలిపి ఉండలు చేసి మాతాజీ పిల్లలకు తినిపించారు. ఆమె కఠోరమైన సాధన చేశారు. ఎన్నెన్నో గాయత్రీ మంత్ర పురశ్చరణలతోనే ఆమె జీవితమంతా గడిచింది. ఆ సాధన ఆధారంగా ఆమె తన గురువు శ్రీరామశర్మ ఆచార్యజీవలె ఎన్నెన్నో సిద్ధులు పొందారు. ఆ సిద్ధులతో ఎంతోమంది బాధలను తొలగించారు. మాతాజీ సువ్యవస్థను ఖచ్చితంగా అమలుచేస్తూనే దానితో ఆత్మీయతను రంగరించేవారు. ఆమె కార్యకర్తలపైన ఎంత ప్రేమ కురిపించేదంటే, లక్షలాది కార్యకర్తలు ఆమె మాటప్రకారం ఎలాంటి త్యాగాలకైనా సిద్ధపడేవారు.

శాంతికుంజ్ ప్రముఖులు శ్రద్ధేయ శైల దీదీ ప్రసంగిస్తూ, మాతాజీ తమ విశాల హృదయంతో జన్మమాతగా పరిణతి చెందారని అన్నారు. ఒక మామూలు గృహిణి తన ప్రచండ సాధన, సమర్పణ, సేవలు ఆధారంగా ఉన్నతస్థాయి ఆధ్యాత్మిక స్థితికి చేరగలదనేందుకు సముజ్వల ఉదాహరణ మాతాజీ దివ్య జీవనమని ఆమె వివరించారు.

ప్రసంగాల అనంతరం భవ్యమైన దీపయజ్ఞం జరిగింది. "ఉజ్వల భవిష్య ఏవం నవయుగకీ సంభావనా ఏ'' (ఉజ్వల భవిష్యత్తు, నవయుగపు మహత్తర అవకాశాలు)అనే ఆడియో బుక్ ఆవిష్కరణ జరిగింది.

### విశ్వామిత్రుడు, వశిష్ఠుడు, సాందీపని ఆదర్శ గురువులు

విశ్వామిత్రుడు, వశిష్ఠుడు, సాందీపని ఆదర్శ గురువులనీ, వీరు మహానాయకులను తీర్చిదిద్దారని, ఆ సంప్రదాయాన్ని తిరిగి నెలకొల్పడం నేడు అత్యవసరమని దేవసంస్కృతి విశ్వవిద్యాలయం కులాధిపతి డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ సెప్టెంబరు 5న విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రసంగిస్తూ ఉద్బోధించారు. వారింకా ఇలా అన్నారు -

భారతీయ సంస్కృతిలో గురుశిష్య సంబంధానికి సహకారం భాగస్వామ్యం ఆధారాలు. గాయత్రీ పరివార్ సంస్థాపకులు పండిత శ్రీరామశర్మ ఆచార్యజీ మహోన్నతుడైన గురువు. ఆయన తన సమయంలో హెచ్చు భాగాన్ని ప్రజలకు శిక్షణ ఇవ్వడానికే వెచ్చించారు. ఆయన పత్రికలద్వారా కూడ ప్రజలకు శిక్షణ గరపుతూ వచ్చారు.

పూజ్య ఆచార్యజీ నిర్ధారణ చేసిన జ్యోతి అవతరణ ధ్యాన-ధారణపై సాప్తాహిక తరగతిని ప్రారంభిస్తున్నామనీ, ఆ తరగతిని తాను స్వయంగా నిర్వహిస్తాననీ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ తమ ప్రసంగంలో తెలియజేశారు.

ఈ సందర్భంగా గురు శిష్య సంబంధాలపై, 'నిజమైన శిష్యత్వం'పై, 'గురువాక్యమ్ బ్రహ్మవాక్యమ్'పై లఘునాటికల ప్రదర్శన జరిగింది.

కులపతి డా॥ఎస్.పి.మిశ్ర ప్రసంగిస్తూ, ఆచార్యుడు తాను ఆదర్శవంతంగా జీవిస్తూ, విద్యార్థులకు అలా జీవించాలనే ప్రేరణ ఇవ్వాలని, విశ్వవిద్యాలయంలో ఈ సూత్రం అమలు జరుగుతున్నదని తెలిపారు.

కుల సచివ్ డా॥ఆర్.పి.కర్మయోగి వందన సమర్పణ చేస్తూ, గురుశిష్య సంప్రదాయాన్ని అనుసరించి వశిష్ఠుడు, సమర్థగురు రామదాసు, యోగి శ్రీ అరవిందులు తమ ఆచరణ ద్వారా శిక్షణ ఇచ్చారని చెప్పారు.

### శాంతికుంజ్‌లో రక్షాబంధన ఉత్సవం

శాంతికుంజ్‌లో ఆగస్టు 12న శ్రావణీ పర్వం - రక్షాబంధన్ ఉత్సవం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. శాంతికుంజ్ ప్రముఖులు శ్రద్ధేయ శైల దీదీ దేశవిదేశాల నుండి వచ్చిన వేలాది సోదరీ సోదరుల చేతులకు రాఖీలు కట్టారు. సోదరీమణులు శ్రద్ధేయ డాక్టర్ ప్రణవ్ పండ్యాజీ చేతికి రాఖీలు కట్టారు. తెల్లవారుజామున 5గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు ఈ రక్షాబంధన కార్యక్రమం కొనసాగింది.

శ్రావణి- ఉపాకర్మ సందర్భంగా ప్రసంగిస్తూ వేదవిభాగ ప్రముఖులు పండిత చంద్రభూషణ శర్మ, శ్రవణ నక్షత్రం కలిగి ఉండడంవల్ల ఆ ఉత్సవానికి శ్రావణీ పర్వమని పేరు వచ్చిందని చెప్పారు. వేదాధ్యయనం ఈ రోజునే ప్రారంభం అయ్యేదనీ, కనుకనే దీనిని ఉపాకర్మఅనికూడా అంటారనీ ఆయన తెలిపారు. ప్రాచీన కాలంలో ఈరోజునుండే క్రొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేదని ఆయన వివరించారు.

నాటి సాయంత్రం బ్రహ్మవాదిని సోదరీమణులు భవ్యమైన దీపయజ్ఞం నిర్వహించారు. పూర్ణిమ సందర్భంగా వేలాది పరిజనులకు వివిధ సంస్కారములు కూడ ఇవ్వబడ్డాయి.

★★★

**మెలకువ జీవితం. నిద్ర బద్ధకం మృత్యువు.**

# వార్తలు

## గాంధీ జయంతి రోజున నారాకోడూరులో వేదమాత గాయత్రి మందిరం భూమిపూజ

1994 శ్రావణ పూర్ణిమ రోజు నారాకోడూరులో గాయత్రీ శక్తి పీఠానికి భూమిపూజ జరిగి కార్యకలాపాలు ప్రారంభమైనాయి. 'పారస్‌మణి' యజ్ఞశాలలో నిత్య గాయత్రీ హోమం జరుగుతున్నది. ప్రతిరోజూ 1 లేక 2 సంస్కారాలు జరుగుతున్నాయి. ఉదయం 5:30 గం॥కు సాయంత్రం 5:30 గం॥కు హారతి, ఉదయం 6 గం॥కు సాయంత్రం 6 గం॥కు ధ్యానము నిర్వహించబడుతున్నాయి. 1999 లో వేదమాత గాయత్రి విగ్రహం 'కామధేను' భవనంలో ప్రతిష్ఠించబడి అందరి పూజలు అందుకుంటూ ఉన్నది. ప్రదక్షిణకు అవకాశం లేకపోవుట వలన అనేకమంది దేవాలయం నిర్మించమని అప్పటి నుండి కోరుతూనేఉన్నారు. ఈ సంవత్సరము శివరాత్రికి బీజరూపంలోని ఆకాంక్ష గురుపూర్ణిమ రోజు సామూహికంగా వ్యక్తమై శాంతికుంజ్ హరిద్వార్ సంచాలకులు పరమ ఆదరణీయ డా॥ ప్రణవ్ పండ్యా, పరమ ఆదరణీయ శైలదీదీ గార్ల శుభాశీస్సులతో అక్టోబరు 2 గాంధీజయంతిన దేవీ నవరాత్రులలో నవకుండముల గాయత్రీ మహాయజ్ఞంతో మందిరానికి 24 మంది దంపతులు 18 మంది కన్యలు సరిగా 9 గంటల 9 నిమిషాలకు భూమి పూజ చేశారు. ఉదయం 8 గంటలకు షుమారు 150 మంది సామూహిక ధ్యానం చేశారు. 700 మందిపైగా కార్యక్రమంలో పాల్గొని భోజన ప్రసాదం స్వీకరించారు. యజ్ఞ సంచాలనం శ్రీయుతులు సవాయిసింగ్ రాజపురోహిత్, వేణుమాధవ్, ఎ.వి.ఎన్.ఎస్.కుమార్ గార్లు నిర్వహించగా సంస్కారశాల బాధ్యత శ్రీఎస్.ఉమామహేశ్వరరావు వహించారు. శ్రీకృష్ణానందాశ్రమం మేనేజింగ్‌ట్రస్టీ శ్రీ ఎల్.కె.శర్మ దీప ప్రజ్వలన చేశారు. గురుదేవులు శ్రీ రామశర్మ ఆచార్య ఆశయాలకు యిది వేదిక మాత్రమేనని, సాధారణ మందిరాల వలె కాదని జనజాగరణకు యిది కేంద్రంగా పని చేస్తూఉందని, శాంతికుంజ్ హరిద్వార్ ద్వారా ప్రారంభించిన సప్త విప్లవాలను ప్రజలకు చేరువగా తీసుకువెళ్ళటానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తూ - 'చర్చకోసం ముసాయిదా'ను చదివి వినిపించి వీలైతే 7 రోజుల కార్యక్రమం చేద్దామని, అందరి అభిప్రాయాలు తెలియజేయాలని శాంతికుంజ్ ప్రతినిధి డా॥ తుమ్మూరి కోరారు. అప్పటికప్పుడే అనేకమంది సమయదానం, అంశదానాలు ప్రకటించారు. శ్రీ కె.పి.విఠల్ ఎన్నిరోజులు సమయదానం కావాలంటే అన్ని రోజులు యిస్తామని ముందుకు వచ్చారు.

ఇప్పటికి జరిగిన చర్చలు సమన్వయం ఆధారంగా సంక్రాంతి నాటికి మందిర నిర్మాణం పూర్తిచేసి 2004 జనవరి 24, 25, 26 తేదీలలో 24 కుండముల గాయత్రీ మహాయజ్ఞం, సప్తవిప్లవాలపై సదస్సులు నిర్వహించి గురుదేవుల ఆధ్యాత్మిక జన్మదినం (జనవరి 26) వసంతపంచమిన వేదమాత గాయత్రిని నూతన మందిరంలో పునః ప్రతిష్ఠ చేయాలని నిర్ణయించటం జరిగింది. రాష్ట్రంలోని నలుమూలలలో ఉన్న గాయత్రీ పరివార్ సభ్యులు, శ్రేయోభిలాషులు పాఠకులు భాగస్వామ్యం వహించటానికి వీలుగా కార్యక్రమం రూపొందించబడింది.

## గాయత్రీ చేతనా కేంద్రంలో 24 కుండముల యజ్ఞం

నవరాత్రి ఉత్సవాల సందర్భంగా హైదరాబాదు హైదర్‌నగర్‌లోని గాయత్రీ చేతనా కేంద్రంలో శాంతికుంజ్ ప్రతినిధి శ్రీ రాకేశ్ జైస్వాల్ ఆధ్వర్యంలో 24 కుండీయ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది.

హైదరాబాదు కాంచన్‌బాగ్‌లోని ధాతునగర్‌లో డా॥ వికాస్ కుమార్ మిథానీ ఎన్‌క్లేవ్‌లో శ్రీహీర్‌సింగ్ రాజపురోహిత్ ఆధ్వర్యంలో యజ్ఞం జరిగింది.

హైదరాబాదులోని మూసాపేట, దీప్తిశ్రీనగర్, ఎస్.ఆర్.నగర్, దాసారం బస్తీ, అమీర్‌పేట, జూబిలీ హిల్స్, బేగంపేట, చింతల్, జీడిమెట్ల, సుభాష్ నగర్, సికిందరాబాద్ పాంట్ మార్కెట్, అల్వాల్, కుశాయిగుడా, దిల్‌సుఖ్‌నగర్, సంతోష్ నగర్, సరూర్ నగర్, సైదాబాద్, ధాతునగర్, మలక్‌పేట, గోశామహల్, భవానీ కాలనీ, కాటేదాన్, బోరబండలలో నవరాత్రి సందర్భంగా యజ్ఞాలు జరిగాయి. ప్రజ్ఞాపుత్రులు శ్రీయుతులు దేవనారాయణ్, భరద్వాజ్, లఖన్, సికందర్ సింగ్, సంజయ్, మనోజ్, పుష్యమిత్రలు ఈ యజ్ఞాలను నిర్వహించారు. శ్రీయుతులు సత్యనారాయణ, రాజశేఖరగుప్త, సికందర్ సింగ్, మనోజ్‌కుమార్, రాజలింగం, శ్రీమతులు బృందావన్ దేవి, అనసూయమ్మ, భారతీ ఖండేల్వాల్ ప్రత్యేక సహకారం అందించారు.

## ఇల్లందులో గురుదేవుల పాదుకల ఊరేగింపు

ఇల్లందు గాయత్రీ పరివార్ మహిళా మండలి సంయోజిక శ్రీమతి కిరణ్‌దేవి గుప్త శాంతికుంజ్ నుండి తీసుకువచ్చిన గురుదేవుల పాదుకలను ఆమె నివాసం నుండి మంగళ కలశంతోపాటు గాయత్రీ హాల్‌కు ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రజల దర్శనంకోసం అక్కడ ఉంచారు. ఆ సందర్భంగా గురుదేవుల జీవనంపై ప్రదర్శనకు శ్రీయుతులు నాగభూషణమ్ ప్రభు, సతీశ్ ఖండేల్వాల్‌లు ప్రారంభోత్సవం చేశారు.

ఇల్లందులో ప్రజ్ఞామండలి ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన మత్తు నిర్మూలన ర్యాలీలో శాంతినికేతన్ హైస్కూలు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

**ఇతరులకు చెడు జరగాలని కోరుకునేముందు నీ హృదయాన్ని అపవిత్రం చేసుకోవలసి ఉంటుంది.**

## చంద్రపయిడిలో పంచకుండీ గాయత్రీ యజ్ఞం

నెల్లూరు జిల్లా చంద్రపయిడి గ్రామంలో శ్రావణ పూర్ణిమ సందర్భంగా ఆగస్టు 12న పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 300 మంది పాల్గొన్నారు. శ్రీడి.వి.ఆర్.మూర్తి యజ్ఞాన్ని నిర్వహించారు. శ్రీయుతులు ఓ.సిద్ధారెడ్డి, ఓబుల్ రెడ్డి ఆధ్వర్యం వహించారు. నెల్లూరుకు చెందిన శ్రీఆర్ముగం, వింజమూరు మహిళా కార్యకర్త శ్రీమతి పద్మ విశేష సహకారం అందించారు. వినూత్నంగా సాగిన ఈ కార్యక్రమం గ్రామీణులను విశేషంగా ఆకట్టుకున్నది.

## జగిత్యాలలో 24 లక్షల గాయత్రీ జపం

జగిత్యాలలో గురుపూర్ణిమ జూలై 13 నుండి సెప్టెంబరు 9 వరకు అర్ధచతుర్మాస వ్రత దీక్ష జరిగింది. ఈ రెండు నెలలలో ప్రతిరోజు గాయత్రీ హవనం, గ్రంథ పఠనం, భజనలు, గాయత్రీ చాలీసా లలితా సహస్ర నామాల పారాయణ, జప ధ్యానములు జరిగాయి. వందలాది స్త్రీ పురుషులు శ్రద్ధా భక్తులతో పాల్గొన్నారు. శ్రీయుతులు ఆడెపు గంగారాం, గడ్డం బుచ్చిరెడ్డి సంపూర్ణ దీక్షలో పాల్గొన్నారు. శ్రీయుతులు జిడ్డె కిషన్, డి.ఎల్.ఎన్.చారి, పడకంటి లక్ష్మీ నారాయణ, అశోక్‌కుమార్ గుప్త, గట్ల లక్ష్మణ్, మిట్టపెల్లి సోమశేఖర్ పాక్షిక దీక్షలో నిత్య కార్యక్రమాలు నిర్వహించారు.

విశేషమేమంటే - జప యజ్ఞంలో 108 మంది 24 లక్షల గాయత్రీ జపం చేశారు. పూర్ణాహుతి రోజున జపాన్ని అమ్మవారికి సమర్పించారు. పూర్ణాహుతి కార్యక్రమానికి శ్రీహీరాసింగ్ రాజపురోహిత్ ఆధ్వర్యం వహించారు. శ్రీ అశ్విని సుబ్బారావు ముఖ్య అతిధిగా విచ్చేశారు. సన్మానాలు, జ్ఞాపికల బహూకరణ, యజ్ఞప్రసాద వితరణ, అన్నదానములతో కార్యక్రమం పూర్తయింది.

## ఉదయగిరిలో 54 కుండముల గాయత్రీ యజ్ఞం

నెల్లూరు జిల్లా ఉదయగిరిలో మేకపాటి రాజమోహన రెడ్డి ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ ఆవరణలో ఆగస్టు 15,16,17 తేదీలలో 54 కుండముల గాయత్రీ మహాయజ్ఞం వైభవంగా జరిగింది. 15 సాయంత్రం 516 కలశాలతో జరిగిన శోభాయాత్రలో వెయ్యిమందికిపైగా పాల్గొన్నారు. 16 ఉదయం యజ్ఞం, సాయంత్రం పదివేల దీపాలతో దీపయజ్ఞం, 17 ఉదయం పూర్ణాహుతి జరిగాయి. 5000 మంది పాల్గొన్నారు. డా॥తుమ్మూరి, శ్రీ డి.వి.ఆర్.మూర్తి, శ్రీ ఎన్.ఎస్.ప్రసాద్ చేసిన ప్రసంగాలు భక్తులను ఆకట్టుకున్నాయి. శాంతికుంజ్‌కు చెందిన శ్రీయుతులు రమాకాంత్ ఖరే, కాంచన్‌జీ, నందకిశోర్ దీక్షిత్‌లు సంగీతంతో, మంత్రాలతో భక్తులను పరవశింపజేశారు. శ్రీయుతులు ఓ.సిద్ధారెడ్డి, గోవర్ధన్ సింగ్ రాజపురోహిత్‌లు కార్యక్రమాన్ని అనుసంధానం చేశారు. శ్రీయుతులు మేకపాటి రాజమోహన రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రాజగోపాల రెడ్డి సోదరులు ఆర్థిక సహకారం అందించారు. వింజమూరు, చీరాల, నెల్లూరుల నుండి వచ్చిన కార్యకర్తలు విశేష సహకారం అందించారు. నెల్లూరు, అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు, ప్రకాశం జిల్లాలలోని గ్రామీణ ప్రాంతాలకు సంస్థ కార్యకలాపాలను విస్తరించాలని యజ్ఞం సందర్భంగా నెల్లూరు, చీరాల కార్యకర్తలు సంకల్పం తీసుకున్నారు.

## భారతీయ సంస్కృతి జ్ఞాన పరీక్ష - 2003

ఈ సంచిక మీకు అందేనాటికి పుస్తకాలు విద్యార్థులకు అందించటం పూర్తవుతుంది. నవంబరు 30వ తేది ఆదివారం ఉదయం పరీక్ష నిర్వహించబడుతుంది. మీ సమీపంలో ఇది జరుగుతుంటే అవసరమైన సమయదానం యివ్వగలరు. వచ్చే సంవత్సరానకు ఈ అనుభవం ఎంతగానో ఉపయోగపడుతుంది. పరీక్షల అనంతరం ఆసక్తి ప్రతిభగల విద్యార్థులతో సంస్కృతీ మండలి ఏర్పాటుచేయవలసి ఉంటుంది. విద్యా విస్తరణ కార్యక్రమంలో యిది ముఖ్యమైన అంగంగా భావించి శాంతికుంజ్ కృషి చేస్తున్నది.

## భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్షకు విశేష స్పందన

భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష నిమిత్తం శాంతికుంజ్ ప్రతినిధి శ్రీనందకిశోర్ దీక్షిత్‌జీ నెల్లూరు, చీరాలలలో విస్తృతంగా పర్యటించారు. చీరాలలో 12 పాఠశాలలలోనూ, 2 జూనియర్ కాలేజీలలోను జ్ఞాన పరీక్షను పరిచయం చేశారు. విద్యార్థులు విశేషంగా స్పందించారు.

## విజయవాడలో మహిళలకు దీపాలంకరణ పోటీ

విజయవాడలో శ్రావణ పౌర్ణమి సందర్భంగా ఆగస్టు 12 సాయంత్రం మహిళలకు దీపాలంకరణ పోటీ జరిగింది. 30 మంది మహిళలు పాల్గొన్నారు. శ్రీమతులు శ్రీదేవి, ఉమాదేవి, రజనిలకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు లభించాయి. శ్రీతొండెపు హనుమంతరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. విజయవాడ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ శ్రీమతి విద్యావతి బహుమతులుగా యుగ సాహిత్యాన్ని ప్రదానం చేశారు. నోబుల్ కిడ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూలు సెక్రటరీ శ్రీమతి రూపవతి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

నాటి ఉదయం సబ్ జోనల్ కార్యాలయంలో జరిగిన పంచకుండీ గాయత్రీ యజ్ఞం సందర్భంగా 10మంది కార్యకర్తలు యజ్ఞోపవీతాలను మార్చుకున్నారు. ప్రాయశ్చిత్త సంకల్పాన్ని పఠించారు. రక్షా బంధన కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.

ఆగస్టు 31న వినాయక చవితి సందర్భంగా కార్యాలయంలో జరిగిన త్రికుండీ గాయత్రీ యజ్ఞంలో 108 సార్లు గణేశ గాయత్రి ఆహుతులు సమర్పించారు.

సెప్టెంబరు 5,6,7 తేదీలలో విజయవాడ సమీపంలోని గుణదలలో ఎమ్.రామారావు ఎస్టేట్స్ హాలులో 21వ శతాబ్దం ఉజ్వల భవిష్యత్తు కోసం నవకుండముల గాయత్రీ యజ్ఞం జరిగింది. 5న

**ఉజ్వల భవిష్యత్తుకు జ్ఞానంతప్ప మరో మార్గం లేదు.**

జరిగిన కలశయాత్రలో 50మంది మహిళలు పాల్గొన్నారు. 6 ఉదయం యజ్ఞం, సాయంత్రం దీపయజ్ఞం, మరునాడు పూర్ణాహుతి జరిగాయి. 150 మంది సాధకులు పాల్గొన్నారు. డా॥తుమ్మూరి కార్యక్రమానికి ఆధ్వర్యం వహించారు.

సెప్టెంబరు 10న మాతాజీ వర్ధంతి సందర్భంగా కార్యాలయంలో త్రికుండీ గాయత్రీ యజ్ఞం జరిగింది. మాతాజీ పేరుమీద 24 ఆహుతులు సమర్పించారు.

### పెదగొట్టిపాడులో గణపతి నవరాత్రి ఉత్సవాలు

గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామంలో ఆగస్టు 31నుండి సెప్టెంబరు 9వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలు జరిగాయి. ప్రతిరోజూ ఉదయం గాయత్రీ యజ్ఞం, అన్న ప్రసాదం, సాయంత్రం శ్రీఏ.సుబ్బారావు భాగవత ప్రవచనం, భజన కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవాల ముగింపు సభలో వివిధ మండలాలలో పదవ తరగతి, ఇంటర్ పరీక్షలలో అత్యధిక మార్కులు తెచ్చుకున్న విద్యార్థినీ విద్యార్థులకు సత్కారం జరిగింది. శ్రీగుంటుపల్లి భద్రరావు సభకు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా శ్రీనేమాని లక్ష్మీ నరసింహ మూర్తి, వారి సతీమణి శ్రీమతి గౌరీ సావిత్రి విచ్చేశారు. శ్రీ ఏ.సుబ్బారావు ఉపన్యసించారు. సభలో శ్రీగుంటుపల్లి వేంకటేశ్వరరావు సమాజ సేవకులు శ్రీగుంటుపల్లి నాగేశ్వర రావును సత్కరించారు.

### చంద్రంపాలెంలో పంచకుండీయ గాయత్రీ మహాయజ్ఞం

విశాఖపట్టణం జిల్లా చంద్రంపాలెంలో ఆగస్టు 11,12 తేదీలలో పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. 11 సాయంత్రం 300 మంది స్త్రీలతో, 100 మంది పురుషులతో కలశయాత్ర శోభాయమానంగా జరిగింది. అనంతరం దుర్గాలమ్మ ఆలయంలో శ్రీమతి విజయలక్ష్మి ఆధ్వర్యంలో సామూహిక ధ్యానం జరిగింది. మరునాడు ఉదయం గాయత్రీ మహాయజ్ఞం జరిగింది. డా॥చంద్రశేఖరం ప్రవచనం ఇచ్చారు. రామలక్ష్మి, గోవిందస్వామి దంపతుల సహకారంతో శ్రీబొల్లాప్రగడ గణపతి శాస్త్రి, శ్రీమతులు బి.వసంత, సావిత్రి, రాజ్యలక్ష్మి యజ్ఞాన్ని నిర్వహించారు. 500 మంది యజ్ఞంలో పాల్గొన్నారు. ఆతర్వాత శ్రీపూర్ణచంద్రరావు సౌజన్యంతో 1200 మందికి అన్న సంతర్పణ జరిగింది. నాటి సాయంత్రం 2400 దీపాలతో దీపయజ్ఞం జరిగింది. శ్రీమతులు ఏ.సావిత్రి, విజయలక్ష్మి ప్రవచన, గానాలతో సభికులను ఆకట్టుకున్నారు. ఆసందర్భంగా 12మంది గురుదీక్ష తీసుకున్నారు. శ్రీయుతులు బి.ఎన్.రావు, బి.హేమచంద్రరావు గ్రంథవిక్రయశాలను నిర్వహించారు. శ్రీదుర్గాలమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీపిల్లా కృష్ణంనాయుడు, కార్యదర్శి శ్రీపోతిన వర్మ కార్యక్రమానికి చక్కటి ఏర్పాట్లు చేశారు.

★★★

## చందాదారులకు విజ్ఞప్తి

**మీకు పత్రిక సక్రమంగా చేరడం కోసం మీ చిరునామా క్రింది నమూనాలో మా కార్యాలయానికి పంపగలరు.**

పేరు : ______________________

చిరునామా : ______________________

పోస్ట్ : ______________ మండలం : ______________

జిల్లా : ______________ పిన్ కోడ్ : ______________

రాష్ట్రం : ______________

ఫోన్.నం (ఎస్.టి.డి కోడ్ తో సహా) : (ఇల్లు)______________ (కార్యాలయం)______________

ఈ మెయిల్ : ______________

పుట్టిన తేది (శాంతికుంజ్ ఆశీర్వాదం కోసం) : ______________

**మీకు ఎలాంటి సమస్యలున్నా క్రింది చిరునామాకు కార్డు ద్వారా లేదా ఈ మెయిల్ ద్వారా తెలియజేయగలరు.**

**YUGA SHAKTI GAYATRI KENDRA,**
183/B, M.I.G, Near B.K.Guda Park, S.R.Nagar, Hyderabad-38.
Ph : 040-23818641, 23819800,
E-mail : ysgkhyd@sancharnet.in, info@aswini.com

**జ్ఞానానికీ, బుద్ధికీ, శోధన పురోగతికీ సాధనా మంత్రం గాయత్రి.**